ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
22-12-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 321 పేజీలు: 10+4 వెల: 6.50

నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

## మరింత సంక్షేమం.. మరికొంత వికాసం

దేశవ్యాప్తంగా గ్రామీణులకు పనిదినాలను పెంచిన 'విబిజిరామ్‌జీ'

- కొత్త బిల్లుకు ఆమోదం తెలిపిన రాష్ట్రపతి ముర్ము
- శాశ్వత మౌలిక వసతుల కల్పనే లక్ష్యం
- వ్యవసాయం, జల సంరక్షణకు ప్రాధాన్యం
- సామాజిక భద్రతకు సరికొత్త వ్యూహం







**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** గ్రామీణప్రాంత నిరుపేదలకు వ్యవసాయ కార్మికులకు నిరంతరపనిదినాలను కల్పించే లక్ష్యంతోమరింత సామాజిక భద్రతను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం అమలుకు తెచ్చిన వికసిత్ భారత్ గారంటీఫర్‌రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(గ్రామీణ) పథకం ఇపుడు దేశవ్యాప్తంగా గ్రామీణులకు ఉపాధి దినాలను మరింత పెంచేదిగా ఉంది. ఇప్పటివరకూ ఉన్న 100 రోజుల >>2

## వస్తున్నా..

### ఈ ద్రోహాన్ని సహించను



ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కెసిఆర్

- పాలమూరుకు జరుగుతున్న అన్యాయంపై
- కేంద్ర, రాష్ట్ర సర్కార్‌ను ఎండగడతా
- బహిరంగ సభలతో ఇక జనంలోనే..
- అది ఫ్యూచర్ సిటీ కాదు.. 'రియల్' బ్రోకర్ దందా
- మీడియా సమక్షంలో మాజీ సిఎం కెసిఆర్ ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్21:** తెలంగాణ ఏర్పడక ముందు రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వాలు పాలమూరుకు ద్రోహం చేశాయని, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా మరోసారి అలాగే వ్యవహరిస్తోందని, పాలమూరు జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై బీఆర్ఎస్ అధినేత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్ల నుంచి మౌనంగా ఉన్నాని.. ఇక తప్పనిసరి పరిస్థితి అని బయల్దేరానని తెలిపారు. అటు కేంద్రాన్ని, ఇటు రాష్ట్రాన్ని ఎండగడతానని పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో గ్రామగ్రామాన ప్రజా ఉద్యమాలు చేస్తాం.. బహిరంగ సభలు పెడతామని తెలిపారు. వాటికి తానే స్వయంగా హాజరవుతానని తెలిపారు. ప్రజాక్షేత్రంలో నిష్క్రియ ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. ఇవాళ్టిదాకా వేరుకథ.. రేపట్నుంచివేరే.. తోలు తీస్తామని హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం తెలంగాణ >>2

## దమ్ముంటే 'సభ'కు రావాలి

### కెసిఆర్ నోట మళ్లీ అవే అబద్ధాలు



- ఆయన హయాంలోనే తెలంగాణకు అన్యాయం
- నీటి వాటాలకు మరణశాసనం రాసింది కెసిఆరే
- ఆయన ఇప్పటికీ మారలేదు..
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్21:** బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కలుగులోంచి ఎలుక బయటకు వచ్చినట్లు వచ్చారని, పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు వాత పెట్టడంతో కనువిప్పు కలిగిందన్నాని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ హయాంలోనే తెలంగాణకు నీటీ వాటాలో తీరని అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.చెప్పిన అబద్దాలు చెప్పకుండా అబద్దాలనే పెట్టుబడిగా కేసీఆర్ మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే ఎక్కువ జలదోపిడిజరిగిందన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. 811 టీఎంసీలు నికర జలాలలో 299 టీఎంసీలే తెలంగాణకు చాలని సంతకం చేసింది కేసీఆరేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నీటి వాటాలపై సంతకం చేసి 3 జిల్లాలకు మరణశాసనం రాశారని దుయ్యబట్టారు. కృష్ణా జలాల్లో 71 శాతం వాటా కావాలని కొట్లాడుతున్న సీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జలదోపిడీకి దోహదం చేసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదని చెప్పారు. కృష్ణా జలాల్లో సగం వాటా కావాలని కేసీఆర్ అడగలేదని మండిపడ్డారు. కృష్ణా, గోదావరి జలాల వాటాపై జనవరి 2 నుంచి అసెంబ్లీలో చర్చిద్దామన్నారు. అసలు చంద్రబాబు >>2

## 6 గ్యారంటీల అమలు ఏదీ?

సిఎంను ఆరా తీశారా?

### సోనియాకు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్21:** తెలంగాణలో స్వయంగా ప్రకటించిన 6 గ్యారంటీలు,మేనిఫెస్టో అమలు గురించి ఏనాడైనా తెలుసుకునేందుకు ప్రయత్నించారా? అని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కనీసం సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సమయంలోనైనా వీటి అమలు గురించి ఆరా తీశారా? అంటూ ఆదివారం ఓ బహిరంగ లేఖ రాశారు. లేఖలో తెలంగాణ రైజింగ్ 2047 పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కార్యక్రమానికి సంబంధించి తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ పేరిట రూపొందించిన పుస్తకాన్ని ఇటీవల ఢిల్లీకి వచ్చి స్వయంగా మీకు అందించిన సమయంలో 2 సంవత్సరాల పాలనలో ప్రభుత్వ పనితీరు, రాష్ట్ర అభివృద్ధి విషయంలో రేవంత్ రెడ్డికి ఉన్న దూరదృష్టిని అభినందించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌కు >>2



## రైలు టిక్కెట్లు పెంపు

- పెరిగిన ఛార్జీలు 26 నుంచి అమలు
- 215 కి.మీ దాకా మార్పులేదు..
- ఆపై పైసా.. రెండు పైసలు చొప్పున అదనపు ఛార్జి
- నాన్‌ఎసి రైళ్లలో 500 కి.మీకి అదనంగా రూ. 10 పెంపు
- సబర్బన్ ఛార్జీలు యధాతథం

**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** భారతీయ రైల్వే శాఖ టికెట్ ధరలను సవరించింది. ఏడాదికి రూ. 600 కోట్ల ఆదాయం పొందడమే లక్ష్యంగా, టికెట్ ధరలను పెంచింది. పెంచిన ధరలు ఈనెల 26 నుంచి అమల్లోకి వస్తాయని రైల్వే తెలిపింది. తాజా ధరల సవరణలుచూస్తే 215 కిలోమీటర్ల వరకు జనరల్ టికెట్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. అంతకుమించి ఎక్కువ దూరం ప్రయాణించే వారికి కిలోమీటరుకు 1 పైసా చొప్పున అదనపు చార్జీ పడుతుంది. అదే సమయంలో ఎక్స్ ప్రెస్, మెయిల్, నాన్ ఏసీ రైళ్లలో కిలోమీటరుకు రెండు పైసలు చొప్పున పెరగనుంది. అటు, నాన్‌ఏసీ రైళ్లలో 500కిలోమీటర్ల దూరం ప్రయాణానికి టికెట్ పై అదనంగా రూ.10 పెంచారు. గడచిన దశాబ్దకాలంలో >>2

## 'మహాలక్ష్మి'లకు ప్రత్యేక కార్డులు



ఆదివారం సమీక్షలో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రి పొన్నం

- పిఎం ఇ డ్రైవ్ కింద 100 ఎలక్ట్రిక్ బస్సులు
- విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందు బుక్స్, యూనిఫామ్స్, షూస్
- రజక, నాయీబ్రాహ్మణ కులవృత్తుల ఉచిత విద్యుత్ బిల్లుల విడుదల
- సమీక్షలో డి.సిఎం భట్టి, మంత్రి పొన్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్21:** మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అదే విధంగా ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ హాస్టళ్లలోని నిరుపేద విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ ఛార్జీలను 200శాతం పెంచామని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కాస్మోటిక్, మెస్ చార్జీల బిల్లులను చెల్లిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఆర్టీసీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రితో పాటుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఇతర జాయింట్ ట్రాన్స్ పోర్ట్ అధికారులు, ఎంజెపి కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసి బలోపేతం చేసేందుకు, కార్మికులను ఆదుకునేందుకు ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి కీలకమైన చర్యలను తీసుకుంటోందని అన్నారు. ముఖ్యంగా ఆడబిడ్డలకు బస్సులో ఉచితంగా ప్రయాణించేందుకు తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ లభాల్లోకి వచ్చిందని అన్నారు. అంతేగాక మహిళా సంఘాల నుంచి రుణాలు తీసుకోవడంతో పాటుగా, ప్రభుత్వం >>7





ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి ఉత్తమ్

# 'నీటి'కి నిప్పుపెట్టింది కెసిఆరే..

## పాలమూరు రంగారెడ్డి డిపిఆర్ ఆయన హయాంలోనే కేంద్రం వెనక్కి

## పచ్చి అబద్ధాలు చెప్పడం కెసిఆర్‌కు తగదు..

## ఆయన చేసిన రూ.96,108కోట్ల నీటి అప్పులో 49వేల కోట్లు చెల్లించాం: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,డిసెంబరు 21,ప్రభాతవార్త:** తెలంగాణ నీటి ప్రయోజనాల పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో కేంద్రంపై ఒత్తిడిపెంచడంతోపాటు, చట్ట పరంగా పోరాటం చేస్తున్నామని, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిపిఆర్‌ను 2023 ఏప్రిల్ 12న కెసిఆర్ హయాంలోనే కేంద్రం వెనక్కి పంపిందని సాగునీటిశాఖ మంత్రిఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బిఆర్‌అంబెద్కర్ సచివాలయంలో విలేఖరులో మాట్లాడుతూ ఒకలక్షా 81వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసి కేసిఆర్ ఒక్క ఎకరంకు కొత్తగా సాగునీటి వసతి కల్పించలేదని ఆవేదనచెందారు. బిఆర్‌అంబెద్కర్ ప్రాణహిత చేవెళ్ళ లిఫ్ట్‌ఇరిగేషన్ పథకంను మా కాంగ్రెస్‌హయాంలో 35,500కోట్ల అంచనా వ్యయంతో మొదలు పెట్టి పదివేల కోట్లు ఖర్చుచేసినదానికి పక్కనపెట్టారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకంకు గుండెకాయలాంటి మేడిగడ్డ కూలిపోయిందని ఆయన విమర్శించారు. తెలంగాణ మొత్తం భవిష్యత్‌ను తాకట్టు పెట్టి కట్టిన ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని ఆయన ఆరోపించారు. మూడు బ్యారేజిలు కూలిపోయి శిథిలమైనాయని ఆయన ముందు తెలంగాణ ప్రజలకు క్షమాపణచెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల 90టిఎంసి కంటే తక్కువ నీటి కేటాయింపు ఉండవని ఆయన తెలిపారు. 45 టిఎంసిలకు తగ్గించుకొన్నామని కెసిఆర్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధమని అన్నారు. కెసిఆర్ దుమ్ముగూడం రాజీవ్‌సాగర్,ఇందిరా సాగర్ పక్కనబెట్టి అత్యంత వ్యయభరితమైన సీతారామసాగర్, సీతమ్మ సాగర్ ప్రాజెక్టుల తెరపైకి వాళ్ళ కమీషన్‌లకోసం తీసుకొచ్చారని దుయ్యబ్టారు. కేసిఆర్ ఇరిగేషన్ ప్రాజెక్టులపైనే 96108కోట్లు రూపాయలు 11శాతం వడ్డికి తీసుకొచ్చారని మేం మాత్రం ప్రాజెక్టుల కోసం ఏడు శాతం వడ్డీకి తెచ్చామని తెలిపారు.ప్రాజెక్టుల కోసం గత ప్రభుత్వం చేసిన రూ. 96108కోట్ల అప్పులో 49వేల కోట్లు గత రెండు సంవత్సరాలలో చెల్లించామని వివరించారు. కెసిఆర్ కృష్ణాబెసిన్‌కు తీవ్ర అన్యాయం చేశారని ప్రాణహిత చేవెళ్ళ కొనసాగిస్తే కాళేశ్వరం కట్టిన డబ్బులతో కల్వకుర్తి,నెట్టంపాడు,భీమా,కోయిల్‌సాగర్, ఎస్‌ఎల్‌బిసి పూర్తి అయ్యేదని ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలో 16లక్షలహెక్టార్లకు సాగు నీరు అందేదని అన్నారు. శ్రీశైలం నుంచి రోజుకు 2014కు పూర్వం 4.1 టిఎంసిలు నీటిని ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలించేదని తెలంగాణ వచ్చాక కెసిఆర్ కారణంగా రోజుకు 9.6టిఎంసిలనీటిని అక్రమంగా తరించేందుకు మౌళిక వసతులు ఏపి నిర్మించుకొందని చెప్పారు. కెసిఆర్ తన మిత్రుడు జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమ ఎత్తిపోతపథకం ద్వారా రోజు 3.3 టిఎంసిల నీటని అక్రమంగా కృష్ణా నది నుంచి తీసుకొని వెళ్ళేందుకు అపెక్స్‌కమిటీ మీటింగ్‌ను వాయిదా వేయించాడని గుర్తుచేశారు. 2004-2014 పదేళ్ళ కాంగ్రెస్‌హయాంలో శ్రీశైలం నుంచి 720 టిఎంసిల నీటిని ఆంధ్రప్రదేశ్ డ్రాచేస్తే కెసిఆర్ హయంలో 1142 టిఎంసి నీటిన అక్రమంగా తీసుకొన్నారని దుయ్యబట్టారు. కృష్ణానది నీటిని 512టిఎంసిలు కెసిఆర్ ఆంధ్రప్రదేశ్‌కు దారాధత్తం చేశారని ఆవేదన చెందారు. 299టిఎంసి నీటిని మాత్రమే ఆయన కృష్ణనదిలో వాటాతో సంతృప్తిచెందారని అన్నారు. పోలవరం నల్లమలసాగర్‌పై కోర్టులో కేసు వేశామని తెలిపారు. కెసిఆర్‌కు మహబూబ్‌నగర్, నల్లగొండపై ప్రేమలేదని అన్నారు. నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, దేవరకొండలో ఎందుకు సకాలంలో కెసిఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేయలేదని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టుకు కీలకమైన నార్లపూర్ ఏదుల్ల ప్రాజెక్టునీటిని అందించే కాలువనే శ్రీశైలం నుంచి తవ్వలేదని 90శాతం పూర్తిచేశామని అనడం హాస్యాస్పదం అన్నారు. మేం పాలమూరుపై ఏడువేల కోట్లు ఖర్చు చేశామని తట్టెడు మట్టి తీయలేదని అనడం తగదని అన్నారు. శ్రీశైలం లెఫ్ట్‌బ్యాంక్ కెనాల్ తవ్వకుండా నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు.

# రైలు టిక్కెట్లు పెంపు

>> రైల్వే శాఖ తన కార్యకలాపాలను మరింత విస్తృతం చేసిందని, అందుకు అనుగుణంగా మానవ వనరుల శక్తి పెంచుకోవాల్సి ఉందని, ఆదాయం కూడా అవసరమని రైల్వే శాఖ తన ప్రకటనలో పేర్కొంది. 2024-25లో జీతాలు, ఇతర ఖర్చుల రూపేణా రూ.1.15 లక్షల కోట్లు చెల్లించగా, రూ.60 వేల కోట్లతో పెన్షన్లు చెల్లించామని, మొత్తంగా రూ.2.63 లక్షల కోట్ల వ్యయం అయిందని రైల్వే శాఖ వివరించింది. ఆదాయ పెంపు మార్గాల్లో భాగంగా ప్రయాణికులపై చార్జీలు పెంచడంతో పాటు సరకు రవాణాను అధికం చేయడంపైనా దృష్టిసారిస్తున్నామని వివరించింది. ప్రతి 500 కిలోమీటర్ల దూరం ప్రయాణానికి నాన్ ఏసీ టికెట్లపై రూ.10 అదనపు భారం పడుతుంది.పెరిగిన రైల్వే ఛార్జీలు డిసెంబర్ 26 నుంచి అమలులోకి వస్తాయి. సబర్బన్ రైలు ప్రయాణ ఛార్జీలను రైల్వే పెంచలేదు. ఎక్కువ దూరం ప్రయాణాలకు సంబంధించిన ఛార్జీలు పెరిగాయి. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఎయిర్ కండిషన్డ్ లేని (నాన్ ఏసీ) కోచ్‌ల్లో ప్రయాణాలకు కిలోమీటరుకు 2 పైసలు పెంచింది. ఎయిర్ కండిషన్డ్ (ఏసీ) కోచ్‌లలో ప్రయాణ ఖర్చు కూడా కిలోమీటరుకు 2 పైసలు పెరిగింది. దీంతో నాన్ ఏసీ, ఏసీ కోచ్‌ల్లో ప్రయాణాలకు ప్రతి 500 కిలోమీటర్ల దూరానికి రూ.10 అదనంగా ఖర్చు పెరుగుతుంది. మరోవైపు పెరిగిన కొత్త ఛార్జీలు ఈనెల 26 నుంచి అమలులోకి వస్తాయని రైల్వే తెలిపింది. ఛార్జీల పెంపు వల్ల రైల్వే ఆదాయం ఏటా రూ. 600 కోట్లు పెరుగుతుందని పేర్కొంది. రైల్వే ఉద్యోగుల వేతనాల ఖర్చు రూ.1,15,000 కోట్లకు, పెన్షన్ ఖర్చు రూ.60,000 కోట్లకు పెరిగిందని రైల్వే తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రైల్వే కార్యకలాపాల మొత్తం ఖర్చు రూ.2.63 లక్షల కోట్లకు పెరిగినట్లు వివరించింది. ఈ నేపథ్యంలో కార్గో, ప్రయాణీకుల ఛార్జీల పెంపుపై దృష్టి సారించినట్లు రైల్వే వెల్లడించింది.

# గాదె ఇన్నయ్యకు 14 రోజుల రిమాండు..

## చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్, డిసెంబర్ 21, ప్రభాతవార్త:** సామాజిక ఉద్యమకారుడు, టిపిఎస్ వ్యవస్థాపకుడు గాదె ఇన్నయ్యకు నాంపల్లిలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) కోర్టు ఆదివారం నాడు రెండు వారాల రిమాండు విధించింది. ఇన్నయ్యను జనగామ జిల్లాలోని జాఫర్‌గడ్‌లో గల ఆయన ఆశ్రమంలో ఎన్ఐఎ అధికారులు అరెస్టు చేసి, నేరుగా నాంపల్లిలోని ఎన్ఐఎ కోర్టుకు తరలించారు. మావోయిస్టులకు అనుకూలంగా వ్యాఖ్యలు చేయడంతో పాటు ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఇన్నయ్యపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కాగా కోర్టు రిమాండు విధించిన తరువాత ఇన్నయ్యను ఎన్ఐఎ అధికారులు నేరుగా చంచల్ గూడ జైలుకు భద్రత మధ్య తరలించారు. ఇన్నయ్యను నాంపల్లి కోర్టుకు తరలించిన సమయంలో స్థానిక పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా భద్రత చేబట్టారు.

# మరింత సంక్షేమం.. మరికొంత వికాసం

>> పనిదినాలను విధిగా ఇపుడు 125రోజులు పనిదినాలు కల్పించాలని దిశా నిర్దేశంచేస్తోంది. విబిజిరామ్‌జీ2025 పేరిట కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన ఈ బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందడంతోపాటు రాష్ట్రపతిసైతం ఆమోదించడంతో చట్టరూపంలో అమలులోనికి వచ్చేసింది. గ్రామీణుకు ఉపాధి కల్పించడంతోపాటు గ్రామీణప్రాంతాల్లోశాశ్వతమౌలిక వసతుల కల్పనకు ఈపథకం ప్రాధాన్యతనిస్తోంది. సృష్టించిన కొత్త వనరులన్నీ కూడా వికసిత్‌భారత్‌జాతీయ గ్రామీణ మౌలికవనరుల వ్యవస్థలోకి వెళతాయి. ఏకీకృత సమన్వయంతోకూడిన జాతీయాభివృద్ధి వ్యూహంతో కొత్తపథకం అమలవుతుంది. పీఎం గతిశక్తి వంటి జాతీయ వనయవస్థలతో అనుసంధానించిన ఈ ప్రణాళికలను పంచాయతీలే సిద్ధంచేస్తాయి. వ్యవసాయం, భూగర్భజలాలనున పెంపొందించడం, మిషన్ అమృత్‌సరోవర్‌లోపునరుద్ధరించిన 68వేల జలాశయాలు ఆధారంగాచేసుకుని అలాంటి జలసంరక్షణ పథకాలకు ఎక్కువ ప్రాధానం ఉంటుంది. గ్రామీణప్రాంతాల్లో మెరుగైన రోడ్లు, అనుసంధానించడం, ప్రాథమిక సేవలు మరింత మెరుగుపరచేలా పనులుంటాయి. వాతావరణముప్పు, పర్యావరణ పరిరక్షనతోకూడిన నీటిసంరక్షణ, వరద నియంత్రణ, భూసంరక్షణ పనుల్లో ఉపాధి హామీ అమలవుతుంది. ఈ కొత్తపథకంద్వారా వలసలను తగ్గించవచ్చని కేంద్రం విశ్వసిస్తోంది. డిజిటల్ వ్యవస్థల వినియోగంతో జవాబుదారీతనం పెరుగుతుందని,డిజటల్ హాజరు, ప్రత్యక్ష చెల్లింపులుఅంటే డిబిటి వ్యవస్థ, డేటా ఆధారిత ప్రణాళికలు అమలవుతున్నాయి. గ్రామీణ రైతులకు కూలీలను చేరువచేస్తుంది. వ్యవసాయ మౌలికవనరులు పెంపొందిస్తుంది. విత్తనాలు నాటడం, కోతలసమయాల్లో కూలీలు అందుబాటులో ఉండేలాచూసుకోడం కోసం ముమ్మర వ్యవసాయ సీజన్ 60రోజుల్లోను ఈపనులు రాష్ట్రాలు నిలిపివేస్తాయి. అలాగే దినసరి కూలీల వేతనం కృత్రిమ పెరుగుదలను కూడా కట్టడిచేసే వీలు కలుగుతుంది. దీనివల్ల ఆహారోత్పత్తి వ్యయనియంత్రణకు వీలు కలుగుతుంది. పంటనష్టాలను తగ్గిచడం, మార్కెట్ అనుసంధానిత పెంచడం, నిల్వసౌకర్యాలు మరింత మెరుగుపరుస్తుందని అంచనా. అలాగే మురుగునీటిపారుదల, నీటి సంరక్షణ భూసంరక్షణ వంటి పనులు ఎక్కువ ఉంటాయి. ప్రస్తుత విబిజిరామ్‌జీతో 25శాతంవరకూ అదనపు ఆదాయం పొందగలుగుతారు. వికసిత్‌గ్రామ పంచాయతీ ప్రణాళికలతో ఉపాధి లభ్యత మరింతగా డిజిటల్ వ్యవస్థల్లో తెలుసుకోవచ్చు. బయోమెట్రిక్; ఆధార్ ఆధారిత ధృవీకరణతో వేతన చెల్లింపుల్లో జాప్యం నివారిస్తారు. పూర్తి పారదర్శకంగా ఉంటుంది. 2024-25 నాటికి 99.94 శాతం డిజిటల్‌పద్ధతిలోనే జరుగుతున్నాయి. నిర్ణీత వ్యవదిలో ఉపాధి కల్పించనిపక్షంలో రాష్ట్రప్రభుత్వాలు నిరుద్యోగ భృతిని కూడా చెల్లించాలి. మెరుగైన రోడ్లతోపాటు జీవనోపాధికి తోడ్పడే ఆస్తుల కల్పనలతో కూలీలకు నిత్యప్రయోజనం కలుగుతుంది. 20 ఏళ్లనాటి పరిస్థితులకు అనుగుణంగా ఆనాడు ఎంజినరేగాను రూపొందించారు. అప్పటినుంచి గణనీయమైన మార్పులు రావడంతో ఇపుడు విబిజిరామ్‌జీ2025 బిల్లును కేంద్రం తీసుకువచ్చి గ్రామీణ ప్రాంతాలకు ఎంతోమేలుచేసింది. పెరుగుతున్న రాబడులు, ఆర్థికసదుపాయాల తోడ్పాటుతో 2011.12లో 25.7శాతం ఉన్న పేదరికం 2023-24 నాటికి 4.86శాతానికి తగ్గింది. ఇదే అంశాన్ని పలు సర్వేలుకూడా స్పష్టంచేసాయి. సామాజిక భద్రత వ్యవస్థలతోపాటు మెరుగైన కనెక్టివిటీ, విస్తరించిన డిజిటల్ యాక్సెస్ అంటే అనుసంధానం, వైవిధ్యమైన గ్రామీణజీవనోపాధితోప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూపకల్పనచేయడంవల్ల గ్రామీణ నిరుపేదలకు మెరుగైన ఉపాధినందించే కల్పతరువుగా మారుతోంది. ఈ పథకం ఇప్పటివరకూ కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా నిధులు భరించినా రాష్ట్రాలకు కూడా బాధ్యతలు పెంచింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 60శాతం కేంద్రం నిధులు అందిస్తే 40శాతం కచ్చితంగా రాష్ట్రాలు భరించాలి. దీనివల్ల పారదర్శకంగా బాధ్యతాయుతంగా విబిజిరామ్‌జీ బిల్లు అమలవుతుందని కేంద్రం భావిస్తోంది. ఈశాన్యరాష్ట్రాలపరిధిలో అయితే 90శాతం కేంద్రం, 10 శాతం రాష్ట్రాలు విధిగా భరించాలి. అంతేకాకుండా ఈపథకంలో మహిళల భాగస్వామ్యాన్ని కూడా పెంచాలని నిర్ణయించింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 48 శాతం మాత్రమే మహిళల భాగస్వామ్యం ఉంటే ప్రస్తుత ఏడాదిలో 56.74శాతం ఉంది. అలాగే ఆధార్‌అనుసంధానం చేసిన కూలీల సంఖ్య 2013-14లో 76 లక్షలుంటే ఇపుడు ఆసంఖ్య 12.11కోట్లకు పెరిగింది. ఎపిబిఎస్‌కింద కవర్‌చేసిన కార్మికులు 11.93 కోట్లవరకూ ఉన్నారు. అలాగే అభివృద్ధిచేసిన ఆస్తులను జియోట్యాగింగ్‌చేయడంవల్ల ఇపుడు 6.44 కోట్లకుపైగా ప్రభుత్వ ఆస్తులు జియోట్యాగింగ్‌జరిగింది. మొత్తంగా ఈ పథకం అమలులో మందు 37శాతం మాత్రమే ఉన్న ఆన్‌లైన్ చెల్లింపులు ఇపుడు డిబిటి వ్యవస్థతో 99.99శాతం జరుపుతుండటంవల్ల కార్మికుల ఖాతాల్లోకే నేరుగా వేతన సొమ్ము జమ అవుతోంది. వికసిత్‌భారత్ లక్ష్యసాధనలో భాగంగా గ్రామీణ నిరుపేదల జీవితాల్లో వెలుగురేఖలు మరింతగా ప్రకాశించేదిశగా కేంద్రం ఈపథకాన్ని అమలులోకి తెచ్చిందనడంలో ఎలాంటి సందేహంలేదు.

# వస్తున్నా.. ఈ ద్రోహాన్ని సహించను

>> భవన్‌లో బీఆర్‌ఎస్‌ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గంతో కేసీఆర్ సమావేశమై దిశా నిర్దేశం చేశారు. అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటే తెలంగాణ,ప్రత్యేకించి పాలమూరు పాలిట పెను శాపంగా మారిందని, తెలంగాణ తెచ్చిన పార్టీగా, ప్రధాన ప్రతిపక్షంగా తమపై రెండు బాధ్యతలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు అనేక రకాల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాడుతూనే ఉందని, కానీ ఇప్పుడు రాష్ట్రం మొత్తానికే ముప్పు వచ్చే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అటు గోదావరి జలాల మీద చంద్రబాబు దోపిడీ చేస్తుంటే దాని మీద చప్పుడు లేదు, ఇటు కృష్ణాలో పాలమూరు ఎత్తిపోతల మీద ఘోరం జరుగుతుంటే దీనిపైనా చప్పుడు లేదు.. మరి రాష్ట్ర ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం ఉన్నట్లు అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో ఏం జరుగుతుందని నిలదీశారు. అందుకే ఈ పిరిస్థితుల్లో నేనే స్వయంగా రంగంలోకి దిగాలని అనుకున్నా అని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్‌ఎల్పీ మీటింగ్‌లో డిసైడ్ అయినమని తెలిపారు. రెండు మూడు రోజుల్లో ఆయా జిల్లా నాయకులతో సమావేశమై, కచ్చితంగా పెద్ద ఎత్తున గ్రామగ్రామాన సభలు పెడతాం.. కవులు, గాయకులను తట్టి లేపుతామని తెలిపారు. అక్కడి ప్రజలకు జరిగే అన్యాయాన్ని జలదోపిడీని అరకట్టాలని మీడియాకు కూడా విజ్ఞప్తి చేశారు.. ఇన్ని రోజులు ఒకరకంగా పోయాం.. ఇక తప్పేటట్లు లేదు.. తెలంగాణ కోసం ఎవరితోనైనా కొట్లాడతామని స్పష్టం చేశారు. భయపడమని అన్నారు. రాష్ట్రాన్ని రక్షించుకోవాలని.. మా కండ్ల ముందే ఇంత దుర్మార్గం జరుగుతుంటే కేసీఆర్ ఎందుకు మౌనంగా ఉండాలని ప్రశ్నించారు. రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ అంతా ఉత్తిదే అని కేసీఆర్ స్పష్టం చేశారు. అన్నీ దిక్కుమాలిన పాలీసీలు, రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా. అంతా గందరగోలం.. గురుకుల పాఠశాల విద్యార్తులు చనిపోయారు. ఇప్పటికి 125 మంది చనిపోయారు. గట్టి అధికారిని పెట్టి గట్టి చర్యలు తీసుకోలేరా అని మండిపడ్డారు. ఇక జూ పార్క్ తీసుకపోయి ఫ్యూచర్ సిటీలో పెడుతాడట.బిజినెస్ హైప్ క్రియేట్ చేయడం మానేయండి. చెప్పాలంటే దీనికి ఆద్యుడు చంద్రబాబే. వైజాగ్ సభలో ఎంవోయూలు కుదుర్చుకున్నది ఎవరితో అని ఆరా తీస్తే స్టార్ హోటళ్లలోని వంట మనుషులని తేలింది అని వ్యాఖ్యానించారు. బాబు మాటే నిజమైతే మరెక్కడి పోయినవి ఆ పెట్టుబడులు. కనీసం రూ.10 వేల కోట్ల అయినా రావాలి కదా అని ప్రశ్నించారు. గ్లోబల్ సమ్మిట్‌లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయులు కుదుర్చుకున్నట్టు చెప్పారు. కానీ.. అబద్ధపు మాటలతో ఎన్నాళ్లు ప్రజలను మోసం చేస్తారు అని రేవంత్ సర్కార్‌ను ప్రశ్నించారు. ఫాక్స్‌కాన్ అనే ఎలక్ట్రానిక్ కంపెనీ తెలంగాణకు రావాలని చాలా కొట్లాడాం. అన్ని దాదాపు సెట్ అయిన సమంయలో రూ.3వేల కోట్లు నగదు ఎదురిస్తామని చెప్పి మహారాష్ట్ర ఆ



తెలంగాణ భవన్‌లో మీడియాతో కెసిఆర్. చిత్రంలో కెటిఆర్ తదితరులు

కంపెనీని తన్నుకుపోయిందన్నారు.. అప్పుడు మనదగ్గర డబ్బులు లేకుండే.మహిళలకు ఇస్తానన్న రూ.2 వేలకే దిక్కులేదు. కానీ, మహిళల్నీ కోటీశ్వరులను చేస్తామని కాంగ్రెస్ నేతలు బీరాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు.మేము భూముల ధరలు పెంచినం. ప్రజల ఆస్తిని పెంచినం. రోడ్డు సమీపంలో 4 ఎరాలున్న వారు ధీమాతో ఉన్నారు. కానీ, కాంగ్రెస్ వచ్చాక ఇప్పుడు ధరలు కుప్పకూలాయి. అమ్మాయి పెళ్లి చేయలేక తక్కువేకే అమ్ముకోవాల్సిన దుస్థితి అని వ్యాఖ్యానించారు. కేవలం రాజకీయ అధికారమే లక్ష్యంగా రైతులు, పేద ప్రజలు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులను రేవంత్ రెడ్డి వేధిస్తున్నారు. కేసీఆర్ చేసిన అప్పులకు పడ్డీలు కట్టలేక పోతున్నాని రేవంత్ చెబుతున్నాడు. కానీ, కాగ్ మనోడికి మొట్టికాయలు వేసింది అని పేర్కొన్నారు. నన్ను తిట్టినదానికి వారి నోళ్లకు మొక్కాలి. పొద్దాక అదే కథనా. మాట్లాడనప్పుడల్లా కేసీఆర్ చచ్చిపోవాలి అనేనా. ఇంత అక్కసా మనిషిమీద. నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు అని కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు. తాము ఫార్మా సిటీని ఎందుకు తీసుకురావాల్సి వచ్చిందో వివరించారు. అనుకోకుండా కొన్ని ప్రాంతాలకు, కొన్ని రాష్ట్రాలకు కలిసొస్తాయి. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో కలరా వ్యాధి వ్యాపించి ప్రజలు ఇబ్బడి ముబ్బడిగా చనిపోయారు. అప్పుడు ఎక్కడికక్కడ లోకలైజ్డ్ ప్రొడక్షన్ ఉండాలని ఐడీపీఎల్ అని పెట్టారు. వాటిని కొన్ని కీలక రాష్ట్రాల్లో పెట్టారు. అందులో ఒకటి హైదరాబాద్‌కు వచ్చింది. ఐడీపీఎల్ పుణ్యమా అని కొంతమంది నేర్చుకుని బయటకొచ్చి స్వయంగా కంపెనీలు పెట్టి విస్తరించారు. వాటిలో అంజిరెడ్డి ఒకరు.. ఆయన దగ్గర పనిచేసిన వాళ్లు కూడా బయటకొచ్చి వాళ్లు కూడా కంపెనీలు పెట్టారు. ఇలా హైదరాబాద్ నగరం మెడికల్, ఫార్మా హబ్‌గా మారింది. అలా ఫార్మా ఎకో హైదరాబాద్‌లో బిల్డ్ అవ్వడం వల్ల ఇబ్బడిముబ్బడిగా కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయి. ఇప్పుడు మూడో వంతు ప్రపంచానికి జీనోమ్ వ్యాలీ నుంచే వ్యాక్సిన్ సరఫరా అవుతుంది, అని కేసీఆర్ తెలిపారు. నిజాం కాలం నుంచి ఫార్మా కంపెనీలు వస్తూ వస్తూ.. హైదరాబాద్ ఫార్మారంగానికి బెస్ట్ డెస్టినేషన్‌గా మారిందని కేసీఆర్ తెలిపారు. మందులు తయారుచేసే క్రమంలో కొంత వేస్టేజి ఉంటుంది.. దాన్ని ఎలా మేనేజ్ చేయాలంటే కొంత తెలివి కావాలి. ఒక ఫార్మా కంపెనీ ముందు నుంచి వెళ్తే మన దగ్గర వాసన వస్తది.. అదే వేరే దేశంలో అయితే అలా రాదు.. వాటి గురించి తెలుసుకోవడానికి ప్రపంచ దేశాలు తిప్పించాం. ప్రపంచవ్యాప్తంగా తిప్పి ఒక ఆలోచనకు వచ్చాం. ఈ క్రమంలోనే జడ్‌ఎల్‌బీ అని వచ్చింది.. అంటే జీరో లిక్విడ్ బేస్. వ్యర్థాలను జీరో లిక్విడ్ చేస్తారు. దాని వల్ల కాలుష్యం రాదు. అంతర్జాతీయంగా అది సక్సెస్ అయ్యింది. ఫార్మా రంగానికి చెందిన వ్యాపారవేత్తలను నేనే స్వయంగా హెలికాప్టర్‌లో తీసుకెళ్లి ముచ్చర్లలోని స్థలాన్ని చూపించానని తెలిపారు. వాళ్లు కూడా ఆ స్థలం సెట్ అవుతుందని చెప్పడంతో ఫార్మా సిటీ నిర్మాణానికి రూపకల్పన చేశామన్నారు. దీనికోసం ఐదారు సంవత్సరాలు కష్టపడి, రైతాంగంతో ఘర్షణ పడకుండా 14 వేల ఎకరాలను సమీకరించామని తెలిపారు. కామన్ అఫ్లియేటెడ్ ప్లాంట్స్ పెట్టి.. వ్యర్థాలను ఇష్టమొచ్చినట్లు వదిలేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిఘా ఉండేలా పెట్టుకున్నదే ఫార్మా సిటీ అని చెప్పారు. దానికి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ కూడా వచ్చిందని అన్నారు. దాని పక్కనే మెడికల్ కాలేజీ కూడా మంజూరు చేశామని చెప్పారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాన్ని ఏదైనాచేసి అమ్ముకోవాలని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.నీ ఫ్యూచర్ సిటీ.. తొక్కలో సిటీ ఎవడికి కావాలన్నారు. హైదరాబాద్‌ను నువ్వేమైనా పెంచావా అని నిలదీశారు. 400 ఏండ్ల చరిత్రతో హైదరాబాద్ పెద్ద సిటీ అయ్యిందని తెలిపారు. అంత చరిత్ర ఉన్న హైదరాబాద్ మహానగరాన్ని దృష్టిలో పెట్టుకుని ఫార్మా సిటీ తీసుకొచ్చామని తెలిపారు. నువ్వేమో ఫ్యూచర్ సిటీ.. తొక్కలో సిటీ అని దిక్కుమాలిన పాలసీలు తీసుకొస్తూ.. రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా చేస్తున్నావని రేవంత్‌పై మండిపడ్డారు.

## వారం - వర్జ్యం

22-12-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
విదియ ఉ.11.50
ఉత్తరాషాఢ తె.5.21, మూల కార్తె
వర్జ్యం : ఉ.9.47-11.30
దు.ము.12.29-1.04, మ.2.42-3.27
శుభసమయం : ఉ.8.30-9.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. ఏ పనిని చేపట్టినా చికాకు కలిగిస్తాయి.వాహన సౌఖ్యం కలదు.

**వృషభం:** ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మిథునం:** సాంకేతిక పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో స్వల్పమార్పులు చోటుచేసుకుంటాయి.

**కర్కాటకం:** చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. పనులు మందకొడిగా సాగుతాయి. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**సింహం:** దూరప్రాంతాల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కన్య:** వివాదాలకు దూరంగా ఉండండి. ఉద్యోగులకు స్థానచలనం ఉంటుంది. సోదరుల కలయిక.వాహన సౌఖ్యం.

**తుల:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి. ఆస్తి వివాదాలు, కోర్టు కేసులు పరిష్కారదశకు చేరుకుంటాయి.వస్త్రలాభం.

**వృశ్చికం:** స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించండి. ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు పొందుతారు.

**ధనుస్సు:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. స్వల్ప ధనలాభం.ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మకరం:** ఋణబాధల నుండి విముక్తి పొందుతారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.సోదరుల కలయిక.

**కుంభం:** మీలోని సృజనాత్మకత వెలుగు చూస్తుంది. వ్యాపారాభివృద్ధి పట్ల దృష్టి సారిస్తారు.ఇంటా బయటా ప్రోత్సాహం.

**మీనం:** పూర్తిగా ఆశలు వదులుకొన్న కార్యక్రమాలను సానుకూలము చేసుకోవటానికి కృషి చేస్తారు. వాహన సౌఖ్యం కలదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రావాలి

>> శిష్యుడే కెసిఆర్, తెలంగాణకు కెసిఆర్ చేసిన ద్రోహం ఏ నాయకుడు చేయలేదన్నారు. పట్టిసీమను అభినందిస్తున్నానని అన్నదే కెసిఆర్, తయన తమలపాకులతో కొడితే నేను తలుపు క్రతో కొడతా అని పేర్కొన్నారు. ఆయన విసనక్రతో కొడితే నేను నీటితొట్టితో కొడతా అని పేర్కొన్నారు.

కొడుకు అల్లుడు కొట్టుకుంటున్నారని కెసిఆర్ బయటకు వచ్చారని,ముఖాముఖి చర్చలకు రమ్మొంటే ముఖం చాటేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుర్చీ కోసం అల్లుడు,కొడుకు కెసిఆర్ చావు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. సిఎంగా ప్రమాణ స్వీకారం కోసం కెటిఆర్ కొత్తబట్టలు కుట్టించుకుంటున్నారని, కెసిఆర్ పోయిన తర్వాత నా దారి నాదేనని హరీశ్‌రావు చెప్పకనే చెప్పిండు, కెటిఆర్ ఐరన్ లెగ్ అని తేలిపోయిందన్నారు. పార్టీ పగ్గాలు హరీశ్‌రావుకు అప్పగించాలనే వాదనలు బిఆర్‌ఎస్‌లో ప్రారంభమయ్యాయని, పార్టీని హస్తగతం చేసుకుంటే రూ.5300 కోట్ల పార్టీ ఆస్తులు తనకు దక్కుతాయని హరీష్‌రావు చూస్తున్నారని పేర్కొన్నారు. కెసిఆర్ మాట్లాడిన భాష ఆయన వయసుకు తగినదికాదన్నారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి డిపిఆర్ కూడా సరిగా సమర్పించే లేదన్నారు. కెసిఆర్ ఆరోగ్యంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలపై నిజనిర్ధాణ కమిటీ వేద్దామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కట్టొద్దన్న హర్షవర్ధన్‌రెడ్డికి బిఫామ్ ఇచ్చింది కెసిఆర్ కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అతలాకుతలం చేసి దివాళ తీయించిందే కెసిఆర్, పదేళ్లలో కృష్ణ మీద కెసిఆర్ ఒక్క ప్రాజెక్టు కట్టలేదన్నారు. కాంట్రాక్టర్లకు అమ్ముడు పోయి కెసిఆర్ వేల కోట్లు కమిషన్లు దండుకుండు, 10 ఏళ్లలో కృష్ణా నదిపై రెండు లక్షల కోట్లు ఖర్చు పెట్టి లక్ష 80వేల బిల్లులు చెల్లించిండు అని చెప్పారు, ఏపీ జల దోపడికి దోహదం చేసిందే కెసిఆర్, జూరాల దగ్గర ఒడిసి పట్టుకోవాల్సిన కృష్ణా జలాలను శ్రీశైలం నుంచి ఇచ్చి ఏపీకి రాసిచ్చిండు అన్నారు. పాలమూరు-రంగారెడ్డికి జూరాల నుంచి నీటిని తీసుకుంటే మన హక్కులు మనకు ఉండేవని, కాంట్రాక్టర్లకు అమ్ముడు పోయి కెసిఆర్ లిఫ్టులు కట్టారన్నారు.

జలాలు నిజాలపై అసెంబ్లీలో చర్చిద్దాం రండీ, జనవరి 2 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తానన్నారు. రెండేళ్ల తర్వాత కలుగులో నుంచి కెసిఆర్ బయలకు వచ్చారు. ఓటమితో కెసిఆర్ మారతారని ఆశించా, కానీ మళ్లీ అబద్ధాలే చెప్పారన్నారు.కెసిఆర్ చావును నేనెందుకు కోరుకుంటా? నాకేమీ వస్తుంది? కెసిఆర్ హాస్పిటల్‌లో ఉంటే వెళ్లి పరామర్శించి వచ్చాను అని చెప్పారు.

కెసిఆర్ ఆర్థిక ఉగ్రవాది అని, రూ.8లక్షల కోట్ల అప్పులు చేశారని, నాలుగు రకాలుగా అవకాశాలు ఉంటే అన్ని రకాల అప్పులు చేశారని దుయ్యబట్టారు. కెసిఆర్ అసెంబ్లీకి వస్తే కృష్ణా జలాలపై అసెంబ్లీలో చెబుతానన్నారు. కృష్ణా జలాల్లో ఏపీకి 64శాతం,తెలంగాణకు 36శాతం చాలని సంతకం పెట్టిన ద్రోహి కెసిఆర్ పేర్కొన్నారు. యూరియా పంపిణీలో టెక్నాలజీ వద్దా,యాప్ పెడితే నష్టం ఏంటీ? అని ప్రశ్నించారు. కృష్ణా బేసిన్ దెబ్బతినడానికి రైతులు నష్టపోవడానికి కారణం కెసిఆర్ అన్నారు.

ఇంకా ప్రజలను మోసం చేయడానికి కెసిఆర్ సుయోధనుడిలా ఏకపాత్రాభియం చేస్తున్నారన్నారు. కెసిఆర్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుప్పకూలుస్తున్నారని నాలుగు రకాలుగా 8లక్షల కోట్ల అప్పులు చేశారని, దాన్ని మేము సరి చేస్తున్నామన్నారు. మోడీ ఎరువు పంపించగానే కెసిఆర్ కోలుకొని బయటకు వచ్చారన్నారు. కాళేశ్వరంపై విచారణకు సిబిఐకి కేంద్రం నుంచి ఎందుకు అనుమతి రావడం లేదు.

అరవింద్‌కుమార్‌పై విచారణకు డిఓపిటి నుంచి అనుమతి ఎందుకు రావడం లేదు అని ప్రశ్నించారు. చెక్ డ్యాములపై బాంబులు పెడితే సమాచారం ఇవ్వండీ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

# 6 గ్యారంటీల అమలు ఏదీ?

>> అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు ప్రకటించారు.కానీ, 2023లో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జరుగుతున్న సమయంలో 17సెప్టెంబర్, 2023న హైదరాబాద్ నగర శివారులోని తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభకు విచ్చేసిన మీరు, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభయహస్తం పేరిట కాంగ్రెస్ పార్టీ రూపొందించిన మేనిఫెస్టోను ఆవిష్కరించడమే కాకుండా స్వయంగా 6 గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ప్రకటించారు. తదనంతరం జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలిచి, అధికారం చేపట్టి 2 సంవత్సరాల పాలన పూర్తి చేసుకుందని గుర్తు చేశారు. ఈ 2 సంవత్సరాల కాలంలో ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు మీరు, మీ కుటుంబ సభ్యులైన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీ పార్టీ హామీ ఇచ్చి ఆవిష్కరించిన మేనిఫెస్టో అమలు గురించి కానీ, మీరు స్వయంగా ప్రకటించిన 6 గ్యారంటీల అమలు గురించి కానీ ఏనాడైనా తెలుసుకోవడానికి ప్రయత్నించారా? కనీసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిమ్మల్ని కలిసిన సమయంలోనైనా వీటి అమలు గురించి అడిగి తెలుసుకున్నారా? అని ప్రశ్నించారు. 2 సంవత్సరాల పాలన పట్ల రేవంత్‌రెడ్డిని మీరు అభినందించారు. అంటే, తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు గురించి గానీ,6 గ్యారంటీలు ప్రజలకు అందించారా లేదా అనే వాస్తవాలు గానీ మీకు తెలిసినట్లు లేదు, తెలుసుకోవడానికి మీరు ప్రయత్నించినట్లు కూడా లేదు అని పేర్కొన్నారు.

కానీ, ఇచ్చిన హామీలు వదిలివేసి తెలంగాణ ప్రజలను వంచిస్తూ, ప్రజలను మోసం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి పేరిట విజన్ డాక్యుమెంట్‌తో కొత్త పల్లవి అందుకొని మీ పార్టీ, మీరు ఒకరినొకరు అభినందించుకుంటున్నాని తప్పుపట్టారు. ఆనాడు ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన మీరు, మళ్లీ ఇప్పుడు రాష్ట్రంలో విజన్ డాక్యుమెంట్ పేరిట కొత్త హామీలు ఇస్తున్నారు. మరి ఎన్నికలప్పుడు ఇచ్చిన గ్యారంటీలను గాలికొదిలేశారా? ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన 420 హామీలను మూసీ నదిలో కలిపేలేశారా? లేక గాంధీ భవన్ లో పాతరేశారా? తెలంగాణ ప్రజలకు తెలియజేయాలి అని సూచించారు. .కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు గడిచిపోయింది. ఇప్పటికైనా కొత్త ఊహలు, కొత్త ఆశలు, కొత్త హామీలు కల్పించేముందు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై ఇచ్చిన మాట మీద నిలబడాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. లేదంటే మీరు ప్రయోగించిన అభయహస్తమే ప్రజల ఆగ్రహం రూపంలో మీ పాలిట భస్మాసుర హస్తమై మిమ్మల్ని అధికారానికి దూరం చేయకుండా మానదు అని స్పష్టం చేశాఉరు.గ్యారంటీల పేరుతో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన హామీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మీరు ఇచ్చిన హామీల అమలులో మోసం చేస్తే,భవిష్యత్తులో తెలంగాణ ప్రజలు కూడా మీకు మద్దతు ఇచ్చే విషయంలో ప్రతిచర్యలకు పాల్పడి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



# భావోద్వేగాల అదుపునకు ధ్యానం ఉపకరిస్తుంది

### ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ప్రారంభించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

### హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 21:** భావోద్వేగాలను అదుపులో ఉంచుకునేందుకు ధ్యానం ఉపకరిస్తుందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ధ్యానం చేస్తున్న వారి మనసు ఏకాగ్రతతో ఉంటుందని తెలిపారు. మానసిక ప్రశాంతత కోసం అందరూ ధ్యానం చేయాలని సూచనలు చేశారు. రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. సిపి రాధాకృష్ణన్, జిష్ణుదేవ్‌వర్మ, శ్రీధర్‌బాబు ఒకే వేదికపై ధ్యానం చేశారు. డిసెంబరు 21ను ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి (ఐరాస) ప్రకటించిందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ధ్యానం, యోగాలో భారత్ ఎప్పుడూ ముందుంటుందని కొనియాడారు. మన దేశం ఓ ఆధ్యాత్మిక కేంద్రమని, వికసిత్ భారత్‌లో ఆర్థిక అభివృద్ధే కాదని, దేశ శాంతి కూడా భాగంగా ఉంటుందని పేర్కొన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థకు ఆయన అభినందనలు తెలిపారు. శాంతి, సామరస్యం, ఆధ్యాత్మికతను ఈ సంస్థ ప్రోత్సహిస్తోందని అన్నారు. అందరూ ధ్యానం చేసేలా శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి పటేల్ (దాజీ) చొరవ చూపుతున్నారని తెలిపారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ ధ్యానం వల్ల అన్నింటిని జయించవచ్చని, వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత ధ్యానం గురించి ప్రస్తావించాయని తెలిపారు. ప్రజలందరూ పరస్పర సహకారంతో శాంతితో మెలగాలి. భగవద్గీతలోనూ ధ్యానం గురించి, వాటి ప్రయోజనాల గురించి ప్రస్తావన ఉందన్నారు. ధ్యానం ద్వారా ఒత్తిడి, ఆందోళనను జయించవచ్చని దాజీ వివరించారు. మనసు కేంద్రంగా ధ్యానం చేస్తే సత్ఫలితాలు ఉంటాయని అన్నారు. మనసు ప్రశాంతంగా ఉంటే ఏకాగ్రత వస్తుందని అన్నారు. తద్వారా సునాయాసంగా విజయాలు సాధించొచ్చని, ధ్యానం చేశాక వచ్చే మార్పును మనం గమనించొచ్చని తెలిపారు. రాత్రి 8 గంటలకు కన్హా శాంతివనం వేదికగా వర్చువల్ ద్వారా లక్ష మందితో ధ్యానం చేయించారు. 170 దేశాలు ఇవాళ మెడిటేషన్ జరుపుతున్నాయని, 2,600 మెడిటేషన్ సెంటర్లలో మెడిటేషన్ చేస్తున్నారని వివరించారు.

**ఢిల్లీకి వెళ్లిన ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్**

రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఆదివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా చేగురులోని కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న ఉప రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్ళారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, అడిషనల్ డీజీపీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, ఇతర అధికారులు, పోలీస్ అధికారులు, ఘనంగా వీడ్కోలు పలికారు.

# క్రోమ్, వాట్సాప్ యూజర్లకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరిక

### నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వినతి

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** గూగుల్ క్రోమ్ బ్రౌజర్ లోపాలు వాట్సాప్ ఖాతాల టేకోవర్ వంటి పద్ధతుల ద్వారా సైబర్ నేరగాళ్లు ఖాతాదారులను లక్ష్యంగా చేసుకుని మోసాలు చేస్తున్నట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) వెల్లడించింది. ఈ విషయమై టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సైబర్ నేరగాళ్లు డేటా చౌర్యం, ఆర్థికనేరాల కోసం ఈ తరహా పద్ధతులను ఎంచుకుంటున్నట్లు తెలిపారు. వినియోగదారులు తమ యాప్‌లను అప్‌డేట్ చేయాలని, ఒటిపిలు లేదా వెరిఫికేషన్ కోడ్‌లను ఎవరికీ షేర్ చేయవద్దని ఆమె సూచించారు. ఏదైనా అనుమానం వస్తే 1930 లేదా సైబర్‌క్రైం వెబ్‌సైట్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని ఆమె తెలిపారు. క్రోమ్ దాడి ఎలా జరుగుతుదనే దానిపై ఆమె వివరిస్తూ వెబ్‌లింక్/యార్‌ఎల్ ఓపెన్ చేస్తే క్రోమ్‌లో వున్న లోపం వల్ల దుర్వినియోగం జరగవచ్చని, బ్రౌజర్ డేటా, సేవ్ చేసిన పాస్‌వర్డ్స్ డేటా అనధికారికంగా చోరీ అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. దీంతోపాటు ఫేస్‌బుక్ ఫొటో ట్యాగ్ ద్వారా లేదా ఆఫర్లు, హెచ్చరిక ద్వారా గానీ నకిలీ లింక్/మెసేజ్ వస్తుందని, ఈ సమయంలో అప్రమత్తంగా వుండాలని, నిర్లిప్తంగా వుంటే సైబర్ నేరగాళ్లు ఖాతాదారుల చాట్‌ను గమనించే వీలుంటుందని ఆమె వెల్లడించారు. గూగుల్ క్రోమ్, లేటెస్ట్ వర్షన్‌కు ఖాతాదారులు అప్‌డేట్ కావాలని ఆమె కోరారు. అనుమానంగా వుండే లింక్‌లను క్లిక్ చేయవద్దని తెలియని వెబ్‌సైట్లలో లాగిన్ కావొద్దని ఆమె సూచించారు.

# కొనసాగుతున్న చలి తీవ్రత

### 14 జిల్లాలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు

### సంగారెడ్డిలో 5 డిగ్రీలు, రంగారెడ్డిలో 6.9, వికారాబాద్‌లో 7 డిగ్రీల అత్యల్పం

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. శనివారంతో పోలి స్తే సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు కలిగిన జిల్లాల సంఖ్య కొంత తగ్గినా మొత్తం మీద 14 జిల్లాలలో పది లోపు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో ఐదు డిగ్రీలు, రంగారెడ్డిలోని మొయినాబాద్‌లో 6.9, వికారాబాద్‌లోని నవాబ్‌పేట్‌లో ఏడు డిగ్రీలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు ఇలా వున్నాయి. ఆసిఫాబాద్‌లోని తిర్యాణిలో 7.2, ఆదిలాబాద్‌లోని భీంపూర్‌లో 7.6, మెదక్‌లోని ఎల్దుర్తిలో 7.9, కామారెడ్డిలోని గాంధారిలో 7.9, నిజామాబాద్‌లోని సాలూరాలో 8.5, సిద్దిపేట్‌లోని అక్బర్‌పేట్‌లో 8.9, మేడ్చల్‌లోని ఉప్పల్‌లో 9.1, నారాయణ్ పేట్‌లోని నారాయణ్‌పేట్ టౌన్‌లో 9.5, మహబూబ్‌నగర్‌లోని గండీడ్‌లో 9.8, సిరిసిల్లాలోని రుద్రంగిలో 9, జగిత్యాలలోని కతలాపూర్‌లో 10.1, మంచిర్యాల్‌లోని కొత్తపల్లిలో 10.2, భూపాలపల్లిలోని ముత్తారంలో 10.3, కరీంనగర్‌లోని కొత్తపల్లెలో 10.4, పెద్దపల్లిలోని రామగిరిలో 10.4, ములుగులోని గోవిందరావుపేట్‌లో 10.3, భువనగిరిలోని రాజాపేట్‌లో 10.6, నల్లగొండలోని చింతపల్లిలో 10.6, హనుమకొండలోని శాయంపేట్ లో 10.7, నాగర్‌కర్నూలులోని కల్వకుర్తిలో 10.8, జనగాంలోని బచ్చన్నపేట్‌లో 10.9, వనపర్తిలోని గోపాల్‌పేట్‌లో 11, మహబూబాబాద్‌లోని గంగారంలో 11.1, వరంగల్‌లోని నెక్కొండలో 11.2, హైదరాబాద్‌లోని మారేడ్‌పల్లిలో 11.2, గద్వాలలోని లీజాలో 11.3, కొత్తగూడెంలోని గుండాల లో 11.4, ఖమ్మంలోని ఎంకూరులో 12, సూర్యాపేట్‌లోని ముకుందాపురంలో 12.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సమయంలో సా ధారణ ఉష్ణోగ్రతలు 14.1 డిగ్రీల సగటున వుండాల్సి వుండగా 2.1 డిగ్రీలు తక్కువగా 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత యేడాది ఇదే సమయంలో 14.9 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో చలితీవ్రత మరోవారం రోజుల పాటు వుంటుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఆరంజ్ అలర్ట్ వున్న జిల్లాలకు ఇది మరికొన్ని రోజులపాటు ఉంటుందన్నారు.

# విబిజి రామ్‌జి-2025 బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర

**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మారుస్తూ కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ బిల్లు-2025కు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆమోదం తెలిపారు. నరేంద్రమోదీ సర్కార్ సంకల్పించిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ (గ్రామీణ్) బిల్లుపై ఆదివారం ముర్ము సంతకం చేశారు. దాంతో ఇరవై యేళ్లుగా కరువు పనిగా కొనసాగుతున్న ఎంజీ నరేగా చట్టం కనుమరుగవ్వనుంది. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా పలు సంస్కరణలకు రూపమిస్తున్న మోదీ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొత్త పేరుతో కొనసాగించనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 100 రోజులు ఉపాధి కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చింది. మోదీ ప్రభుత్వం ఈ పథకం నుంచి గాంధీ పేరును తొలగించాలనే ఉద్దేశంతో కొత్త చట్టంతో వచ్చింది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్(గ్రామీణ్) బిల్లును ప్రభుత్వం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. ఆదివారం ఆ బిల్లుపై ప్రెసిడెంట్



సంతకం చేశారు.

ఈ కొత్త స్కీమ్‌లో పనిదినాలతోపాటు వేతనం కూడా పెంచిన విషయం తెలిసిందే. ఇదివరకూ 100 రోజులున్న పని దినాలను 125కు, కనీస వేతనాన్ని కూడా రూ.240కి పెంచారు. అలానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల్లోనూ కీలక మార్పులు చేశారు. ఇంతకుముందు హిమాలయ పర్వత ప్రాంత రాష్ట్రాల్లో ఈ వాటా 90:10గా ఇతర రాష్ట్రాల్లో 75:25గా ఉండేది. ఇకనుంచి కేంద్ర, రాష్ట్రాలు ఖర్చులను 60:40 శాతంలో భరించనున్నాయి.

### మహాత్ముడి పేరు తొలగించడం మాత్రమే కాదు..

# 13 కోట్ల పేదల పొట్ట కొట్టే కుట్ర

### రోహతక్ కాంగ్రెస్ ఎంపి దీపేందర్ హుడా

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ పేరు తొలగించడమే కాకుండా ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి దేశవ్యాప్తంగా ఉన్న 13 కోట్ల మంది పేదల పొట్ట కొట్టాలనే కుట్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం చేస్తోందని రోహతక్ ఎంపి దీపేందర్ హుడా ఆరోపించారు. గాంధీభవన్‌లో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మధుయాష్కి ప్రచార కమిటీ ఛైర్మన్, మెట్టు సాయి కుమార్ ఛైర్మన్, ఫిషర్మెన్ కమిటీ, సామరాంమోహన్ రెడ్డి మీడియా కమిటీ ఛైర్మన్, అల్లం భాస్కర్, సంధ్యా రెడ్డి టిపిసిసి ప్రధాన కార్యదర్శి, లింగం యాదవ్ తదితరులతో కలిసి దీపేందర్ హుడావిలేఖరులతో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పేరు కోసం రాజకీయం చేస్తుందని అన్నారు. కోవిడ్ సమయంలో పనికి ఆహార పథకం సంజీవిని లాగ పని చేసిందని వ్యాఖానించారు. జీ రామ్ జీ కి గ్యారెంటీ లేదని ఆయన ఆవేదనచెందారు. యూపిఎ ప్రభుత్వం రోజ్ గార్ యోజనను పూర్తిగా కేంద్రం నిధులు కే టాయించింది బిజెపి ప్రభుత్వం జి.రామ్ జి పేరుతో రాష్ట్ర ల పై భారం మోపాలని చూస్తుందని ఆరోపించారు. గతంలో రాష్ట్రాలు పని దినాలు చూపించింది కానీ ఇప్పుడు కేంద్రమే పని దినాలు నిర్ధారిస్తుందని తెలిపారు. గ్రామ పంచాయతీ లకు ఇప్పుడు పనుల ఎంపిక హక్కులు ఉండవు కేంద్రం ఆధీనంలో ఉంటదనీ తెలిపారు. 90 : 10శాతం నిధులు కేంద్రం ఇచ్చేదని ఇప్పుడు 60:40 మించి నిధులు ఇవ్వదని తెలిపారు. రాష్ట్రాలకు నిధులు ఇవ్వదు కానీ అధికారం కేంద్రం చేతుల్లోనే ఉంటుంది క్రమేణా మన్రేగా పథకాన్ని తీసివేయలని చూస్తుంది కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మేము ఒప్పుకొము అని తెలిపారు. వందే మాతరం గీతాన్ని మార్చి కొత్త గీతాన్ని తీసుకరావాలని బిజెపి చూస్తుందని తెలి పారు. నేషనల్ హెరాల్డ్ పేరుతో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. కానీ కోర్టు వాస్తవాలను గుర్తించిందని అన్నారు. 2015 లో డాక్టర్ సుబ్రహ్మణ్యం స్వామి ప్రయివేట్ ఫిర్యాదుతో ఇడి, సిబిఐ కేసు నమోదు చేసిందిమని లాండరింగ్ జరిగిందని పదే పదే రెండు సంస్థలు కేసులో పెట్టి ఇబ్బంది పెట్టిందని ఆవేదన చెందారు. కేవలం రాజకీయ కక్షతోనే నేషనల్ హెరాల్డ్ కేసు పెట్టి ఇబ్బంది పెట్టారని అన్నారు. రాహుల్‌గాంధీ పోరాటం చేశా రనీ చివరకు ఇడిసిబిఐ కేసును తిరస్కరించింది చివరకు సత్యమే గెలిచిందని తెలిపారు.

# పవన్‌కల్యాణ్ సిఫారసుతో కొండగట్టుకు రూ.35 కోట్లు కేటాయింపు హర్షణీయం

### కేంద్రమంత్రి బండి సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 21:** తెలంగాణలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 96 గదుల సత్రం నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రూ.35.19 కోట్లు కేటాయించడం హర్షణీయమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సిఫారసుతో ఈ నిధులు మంజూరు కావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. దీని వల్ల కొండగట్టుకు వచ్చే భక్తు లకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి గతంలో రూ.100 కోట్లు కేటాయిస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు.

అలాగే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నయా పైసా నిధులు కేటాయించకపోగా, ఆర్జిత సేవల ఛార్జీలను పెంచి భక్తులపై అదనపు భారం మోపుతోందని ఆరోపించారు. భక్తులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నా అప్పటి బీఆర్ఎస్ ప్రభు త్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే కొండగట్టు ఆలయానికి తగిన నిధులు కేటాయించి, అన్ని విధాలుగా అభివృద్ధి చేయా లని బండి సంజయ్ డిమాండ్ చేశారు. టిటిడి నిధులతో నిర్మించనున్న సత్రం పూర్తయితే కొండగట్టు దర్శనానికి వచ్చే లక్షలాదిమంది భక్తులకు వసతి సౌకర్యాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# బుక్ 'ఫెయిర్'లోనూ అవకతవకలేనా?

### ఆర్థిక అక్రమాలపై గత కార్యవర్గం జవాబివ్వాలి

### 2014 నుంచి 22 వరకు అన్ని వివరాలు వెల్లడించాలి

### అందుకే వారి సభ్యత్వాలు నిలిపివేశాం: హెచ్‌బిఎఫ్

### ప్రస్తుత అధ్యక్షుడు యాకుబ్, ప్రధానకార్యదర్శి వాసు

**హైదరాబాద్(ముషీరాబాద్), డిసెంబరు 21, ప్రభాతవార్త:** జనరల్ బాడీ నిర్ణయం మేరకే హైదరాబాద్ బుక్ ఫెయిర్ గత కార్యవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారుల సభ్యత్వాలను తాత్కాలికంగా నిలిపివేయటం జరిగిందని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రస్తుత అధ్యక్షులు కవి యాకుబ్, ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షులు బాలురెడ్డిలు స్పష్టం చేశారు. ఆదివారం బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతిష్టాత్మక హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఆర్థిక వ్యవహారాల్లో 2014 నుంచి 2022 వరకు భారీ అక్రమాలు జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై గత కార్యవర్గం స్పష్టత నివ్వాలని డిమాండ్ చేశారు. 1986 నుంచి కాచిగూడలో బీఓఐలో అధికారిక ఖాతా ఉండగా రిజిస్ట్రేషన్ లేకుండానే ది హైదరాబాద్ బుక్‌ఫెయిర్ పేరుతో 2021లో ఐసీఐసీఐ బ్యాంక్‌లో, 2016లో ఎస్‌బీఐలో కొత్త ఖాతాలు ఎందుకు తెరవవలసి వచ్చిందని ప్రశ్నించారు. ఈ ఖాతాల నుంచి భారీ మొత్తంలో కన్వెన్షన్ సెంటర్‌కు చెల్లించటం, లక్షలల్లో డబ్బు ఉపసంహరణలు చేయటం, గతంలో నిర్వహించిన 8 ప్రదర్శనలకు సంబంధించి టిక్కెట్ల విక్రయాలు, ఫుడ్ స్టాల్స్ నుంచి వచ్చిన ఆదాయం బ్యాంకుల్లో ఎందుకు జమ కాలేదని నిలదీశారు. నిధుల దుర్వినియోగంపై మూడు సార్లు నోటీసులు ఇచ్చినా గత బాధ్యులు స్పందించటలేదని, అందుకే జనరల్ బాడీ నిర్ణయం మేరకు వారి సభ్యత్వాలు తాత్కాలికంగా రద్దు చేసి, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టటం జరిగిందని తెలిపారు. పదేళ్ల కాలంలో ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయలేదని, క్యాష్‌బుక్, వోచర్లు కూడా నూతన కార్యవర్గంకు అప్పగించలేదని మండిపడ్డారు. జిల్లాల్లో ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సహాయం బ్యాంకు రికార్డుల్లో కనిపించటం లేదని, కొత్త కార్యదర్శి ఎన్నికయినప్పటికీ పాత వారే సిగ్నేటరీలుగా కొనసాగటం ఆర్థిక నేరం కింద పరిగణించబడు తుందని అన్నారు. బుక్‌ఫెయిర్ కార్యా లయాన్ని గత అధ్యక్ష కార్యదర్శులు తమ సొంత అవసరాలకు వాడు కున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై వివరణ ఇవ్వాలని గత కమిటీ బాధ్యులైన జూలూరి గౌరీ శంకర్, కోయ చంద్రమోహన్, పి.రాజేశ్వం రావులకు మూడుసార్లు లేఖరుల రాసినా స్పందించకపోగా, ఎదురు సామాజిక మాధ్యమాలలో ప్రస్తుత కమిటీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత కమిటీ బాధ్యులు ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకుని అన్ని అనుమానాలను నివృత్తి చేయాలని, అన్ని రికార్డులను నూతన కమిటీకి అప్పగించాలని సూచించారు. ఇన్ని అనుమానాల నేపథ్యంలో కోయ చంద్రమోహన్‌కు చెందిన తెలంగాణ పబ్లికేషన్స్‌కు స్టాల్ కేటాయించకపోవటం అప్రజాస్వామ్యం అంటూ ప్రచారం చేయటం, తెలంగాణపై వివక్ష అంటూ వ్యాఖ్యలు చేయటం హాస్యాస్పదమని, బుక్‌ఫెయిర్‌లో అన్ని ప్రాంగణాలకు తెలంగాణ కవులు, సాహితీ వేత్తల పేర్లు పెట్టి, తెలంగాణకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ఇప్పటికైనా గత కార్యవర్గం తమ ప్రశ్నలకు సమాధానం చెప్పి, నిజాయితీ నిరూపించుకుంటే, వారికి స్టాల్ ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు, కవి యాకుబ్, ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి

# పోరాటానికి సిద్ధమవుతున్న ఆర్‌టిసి యూనియన్లు!

### గుర్తింపు ఎన్నికలే ప్రధాన అజెండా

### దాంతోపాటు ఇతర సమస్యలపై పోరాటం

### జెఎసిగా ఏర్పడిన కార్మిక సంఘాలు

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న కార్మిక సంఘాలు తమ సమస్యల పరిష్కారానికి సిద్ధమవుతున్నాయి. అందులో భాగంగా సంఘాలు జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)గా ఏర్పడ్డాయి. ఆర్‌టిసిలో గుర్తింపు ఎన్నికలను వెంటనే నిర్వహించాలనే ప్రధాన ఎజెండాతో కార్మిక సంఘాలు ఉద్యమించడానికి సిద్ధమవు తున్నాయి. ఆర్‌టిసిలోని 6 కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్ప డ్డాయి. ఎంప్లాయిస్ యూని యన్(ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్(టిఎంయు), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు), ఎస్‌డబ్ల్యూఎఫ్, బహుజన కార్మిక యూనియన్, బహుజన వర్కర్స్ యూనియన్, కార్మిక పరిషత్ సంఘాలు జేఏసీగా ఏర్పడ్డాయి. ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం, ఆర్‌టిసి సంస్థ పరిరక్షణ కోసం ఆరు సంఘాలు జేఏసీగా ఏర్పడ్డాయి. సమావేశంలో పాలొనగన్న ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ జేఏసీ కార్యక్రమాలకు బయట నుండి మద్దతు ఇస్తామని ప్రకటిం చింది. ఆర్‌టిసి కార్మికులు నిత్యం ఎదురుకొంటున్న అధిక పని భారాలపై, వేధింపులపై, ప్రభుత్వ యాజమాన్యాల కార్మిక వ్యతిరేక విధానాలపై, ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం దశలవారీ పోరాటాలు నిర్వహించాలని జేఏసీలో తీర్మానించారు. ప్రధాన డిమాండ్‌గా ఆర్‌టిసిలో యూనియన్లను పునరు ద్ధరించడంపైనే పోరాటం చేయాలని జేఏసీ భావిస్తోంది. ఆర్‌టిసిలో గుర్తింపు యూనియన్ లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్‌టి సిలో యూనియన్లను పునరుద్ధరణ చేస్తామని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచినచంది. దాంతోపాటు పిఆర్‌సి పరిధిలోకి ఆర్‌టిసి కార్మికులను చేరుస్తామని, పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని ప్రకటించింది. మంత్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఉద్యోగ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడిన సమయంలో ఆర్‌టిసిలో యూనియన్లను అనుమతిస్తామని హామీ ఇచ్చారని సంఘాల నేతలు చెబుతున్నారు. ఖర్చు లేని పనైన యూనియన్లను పునరుద్ధరణ చేయకపోవడం వలన కార్మికులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. జేఏసీగా ఏర్పడిన సంఘాలే కాకుండా.. ఆర్‌టిసిలోని ఇతర సంఘాలు కూడా ఇవే సమస్యలపై వేర్వేరుగా పోరాటం చేయడానికి సిద్ధంగానే ఉన్నాయి. ఆర్‌టిసిలోని కార్మికుల ప్రధాన డిమాండ్స్‌లో గుర్తింపు ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీన ప్రక్రియను వేగంగా పూర్తి చేయడం. వీటితోపాటు ఇతర సమస్యలపై కూడా ఇటు జేఏసీ, అటు సంఘాలు వేర్వేరుగా ఉద్యమించడానికి సిద్ధమవుతున్నాయి.

# అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పేపర్-1 కీ విడుదల

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** ఈ నెల 14న జరిగిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పేపర్-1కు సంబంధించిన కీ ఆదివారం విడుదల అయ్యింది. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా పేపర్ 1 పరీక్షలకు సంబంధించి ఏదైనా అభ్యంతరాలు వుంటే ఈ నెల 24 తేదీ ఐదు గంటల లోపున ప్రతీ అభ్యంతరానికి 500 రూపా యలు గేట్ వే పేమెంట్ ద్వారా చెల్లించాలని శ్రీనివాస రావు తెలిపారు. అభ్యంతరాలు సరిగ్గా వుంటే డబ్బులను వెనక్కు చెల్లించడం జరుగుతుందని, సరైన పత్రాలు లేకుండా చేసే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని ఆయన తెలిపారు.

# హైడ్రా కమిషనర్ గన్‌మ్యాన్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** హైడ్రా కమిషనర్ వద్ద గన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ కృష్ణ చైతన్య ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన ఘటన కలకలం రేపింది. హాయత్ నగర్‌లోని తన నివాసంలో గన్‌తో కాల్చుకుని కృష్ణ చైతన్య ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. భార్యతో కలిసి హాయత్ నగర్‌లో నివసిస్తున్న కృష్ణ చైతన్య తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను కామినేని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కృష్ణ చైతన్య పరిస్థితి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. సమాచారం అందుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెంటనే కామినేని ఆసుపత్రికి చేరుకుని వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కృష్ణ చైతన్యకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. చికిత్సకు హైడ్రా సంస్థ పూర్తిస్థాయిలో సహాయం చేస్తుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కాగా, ప్రాథమిక సమాచారం ప్రకారం.. రెండేళ్ల క్రితం బెట్టింగ్, గేమింగ్ యాప్స్ పెట్టుబడులు పెట్టి భారీగా నష్టపోయినట్లు తెలుస్తోంది. అప్పుల భారం పెరగడంతో తీసుకున్న లోన్లకు జీతం ఎక్కువగా కట్ అవుతూ రావడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సమాచారం. ఈ ఒత్తిడే అతన్ని ఆత్మహత్య యత్నానికి దారి తీసినట్లు భావిస్తున్నారు. ఇదివరకే ఆర్థిక ఇబ్బందుల కారణంగా కృష్ణ చైతన్య ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆయన తండ్రి హాయత్‌నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. అలాగే గతంలో ఒత్తిడి, ఆరోగ్య సమస్యల కారణంగా తలలో రక్తం గడ్డకట్టడంతో చికిత్స తీసుకున్నట్లు తెలుస్తోంది. విధుల పరంగా కృష్ణ చైతన్య ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోనలేదని అధికారులు స్పష్టం చేశారు. అధికారులతో పాటు ఇతర సిబ్బందితో కూడా మర్యాదగా, గౌరవంగా వ్యవహరిస్తూ విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. విధుల విషయంలో అప్రమత్తంగా, క్రమశిక్షణతో ఉన్న వ్యక్తిగా ఆయనకు మంచి పేరు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కృష్ణచైతన్య ఆరోగ్యంపై కామినేని ఆసుపత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. అతడికి న్యూరోసర్జన్లు డాక్టర్ ఎం.ఎ.జలీల్, డాక్టర్ సాయిశివ నేతృత్వంలో శస్త్ర చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. పుర్రెకు, మెదడుకు తీవ్రమైన పగుళ్లు ఉన్నట్లు నిర్ధారించామని వైద్యులు పేర్కొన్నారు. ఇంటెన్సివ్ న్యూరో క్రిటికల్ కేర్‌లో చికిత్స పొందుతున్నాడని, 48 గంటలు అతడిని అబ్జర్వేషన్‌లోనే ఉంచుతామని వైద్యులు ప్రకటించారు.




# నేడు రాష్ట్రవ్యాప్తంగా వరదలు, ప్రమాదాలపై మాక్ ఎక్సర్‌సైజ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 21:** వరదలు, పారిశ్రామిక ప్రమాదాలపై ప్రభుత్వం, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థతో కలిసి సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనుంది. ఈ మాక్ ఎక్సర్‌సైజ్ కోసం రాష్ట్రంలోని కొన్ని జిల్లాలను ఎంపిక చేశారు. జిల్లా కలెక్టర్లు, జిల్లాలోని అన్ని సంబంధిత శాఖల అధికారులు, అలాగే రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన సీనియర్ అధికారుల మార్గదర్శకత్వంలో ఈ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తారు. డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో ఒకేసారి అన్ని జిల్లాల్లో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించి, వ్యవస్థల సామర్థం, సమన్వయాన్ని పరీక్షి ంచనున్నారు.

వరదల మాక్ ఎక్సర్‌సైజ్‌కు ఎంపికైన ప్రదేశాలు1. ఖమ్మం జిల్లా మున్నేరు నది ఒడ్డున ఉన్న బొక్కలగడ్డ, ఖమ్మం పట్టణంప్రభుత్వ జనరల్ హాస్పిటల్ 2. వరంగల్ జిల్లారెడ్డిపురం / చిన్న వడ్డేపల్లి చెరువు 3. కామా రెడ్డి జిల్లా పెద్ద చెరువు జీఆర్ కాలనీ 4. నిజా మాబాద్ జిల్లా రఘునాథ చెరువు కిల్లా రామా లయం 5. మెదక్ జిల్లా దూప్‌సింగ్ తండా, హవేలీ ఘన్‌పూర్ మండలంబుర్గుపల్లి గ్రామం 6. మహబూబ్‌నగర్ జిల్లా కృష్ణసాగర్ (కొత్త చెరువు) రామయ్య బావిమోడెం కుంట (యెను గొండ) దివిటిపల్లి (అమరరాజా ఇండస్ట్రీ సమీపంలో) ఏరియా హాస్పిటల్, జడ్చర్ల.7. హైదరాబాద్ జిల్లా నెక్లెస్ రోడ్, వ్యూపాయింట్ 8. సూర్యాపేట జిల్లా పెద్ద చెరువు, కోదాడ 9. భద్రాద్రి - కొత్తగూడెం జిల్లాబుర్గంపాడు గ్రామం గోదావరి నది, భద్రాచలం 10. నిర్మల్ జిల్లా చిత్యాల వాగు11. జయశంకర్ - భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి వాగు12. హనుమకొండ జిల్లా రెడ్డిపురం చెరువు సమ్మయ్య నగర్, పారిశ్రామిక ప్రమాదం పారిశ్రామిక ప్రమాదాల మాక్ ఎక్సర్‌సైజ్‌కు ఎంపికైన ప్రదేశాలు1. సంగారెడ్డి జిల్లా ఔరోబిందో ఫార్మా లిమిటెడ్, బొరపట్ల, హత్నూర మండలం వినియోగించే రసాయనాలు: మెథనాల్, నాఫ్తలీన్, ఎథనాల్, ఎథైల్ అసిటేట్, ఐసో ప్రొపైల్ ఆల్కహాల్ 2. మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ - హైదరాబాద్ స్మార్ట్ టెర్మినల్, ఐడీఏ ఫేజ్-3, చెర్లపల్లి ఇంధనాలు: మోటార్ స్పిరిట్, హెచ్ఎస్‌డీ, ఏటీఎఫ్, ఎథనాల్, బయోడీజిల్ 3.రంగారెడ్డి జిల్లానాట్కో ఫార్మా లిమిటెడ్, కెమికల్ డివిజన్, మెకగూడ, నందిగారసాయనాలు: అసిటోన్, మెథనాల్, ఐసో ప్రొపైల్ ఆల్కహాల్, మెథైల్ క్లోరైడ్, టోల్యూన్, హెక్సేన్, సైక్లో హెక్సేన్, ఎథైల్ అసిటేట్, హెచ్‌సీఎల్ గ్యాస్, సల్ఫ్యూరిక్ యాసిడ్, సోడియం హైడ్రాక్సైడ్, నైట్రిక్ యాసిడ్ 4. యాదాద్రి భువనగిరి జిల్లా డివిస్ ల్యాబొరేటరీస్, లింగోజిగూడెం, టోల్యూన్, మెథనాల్, ఆర్థో జైలిన్, క్లోరిన్, అమోనియా5. నల్గొండ జిల్లారెడ్డి ల్యాబ్స్, మిర్యాలగూరసాయనాలు: మెథాక్సీ డైబెన్జో అజెపిన్, సోడియం స్టియరిల్ ఫ్యూమరేట్, ఆక్సాకర్బాజెపిన్, ఇస్ట్రాడెఫైలిన్ఈ మాక్ ఎక్సర్‌సైజ్ సమయంలో ఎన్‌డిఎంఎ నుంచి వచ్చిన ప్రత్యేక పరిశీలకులు లోపాలు, బలహీనతలు, సమన్వయ లోపాలను గమనించి నివేదిక సిద్ధం చేయనున్నారు.

ఉదయం 09:00 గంటల నుంచి 13:00 గంటల వరకు వరదల సన్నివేశం, రాత్రి వేళ సాయంత్రం 17:30 గంటల నుంచి 21:00 గంటల వరకు పారిశ్రామిక ప్రమాదాల సన్నివేశం ఎంపిక చేసిన పై జిల్లాలు, ప్రదేశాల్లో ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహిస్తారు.

వార్త

బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు, బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.

న-జార్జి ఎలియట్

# ఆరని 'రావణ కాష్టం'


బంగ్లాదేశ్ రగడ రావణ కాష్టంలా రగులుకుంటోంది. 1971 నాటి బంగ్లా విమోచన ఉద్యమంలో పాల్గొన్న వారి వారసులకు ఉద్యోగాల్లో అధిక రిజర్వేషన్లు ఇవ్వడాన్ని అక్కడ విద్యార్థి లోకం తప్పు పట్టింది. రిజర్వేషన్ల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి బదులు తమకు ఉద్యోగాలు రాకుండా ఇలాంటి కార్యాచరణ చేపట్టడాన్ని నిరుద్యోగ యువకులకు రుచించలేదు. దాంతో వారంతా ఆనాడే తిరుగుబాటు చేశారు. ఆ ఉద్యమంతో బంగ్లా ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతి జరిగింది. ఆపైన భారత్‌లో ఆమె తలదాచుకోవడంతో తాత్కాలిక ప్రభుత్వ పాలన నోబెల్ గ్రహీత యూనస్ చేతిలోకి వెళ్లింది. ఆ తర్వాత అక్కడి పాలన షేక్ హసీనాకు పూర్తి వ్యతిరేకంగా మారింది. అనేక సందర్భాలను వెలికి తీసి ఆమెను అభిశంసించడమే కాకుండా, ఆమె అనుయాయులకు నిద్ర పట్టకుండా చేసింది. కాగా వచ్చే ఫిబ్రవరిలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం తేదీలు నిర్వహించింది. గత ఆగస్టులో విద్యార్థుల ఉద్యమానికి నేతృత్వం వహించిన ఇంక్విలాబ్ మంచ్ నేత ఉస్మాన్ షరీఫ్ హాదీ ఢాకా 8 నియోజక వర్గం నుంచి పోటీ చేయదలచి ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతుండగా ఓ ముసుగు మనిషి అతడిని కాల్చాడు. తీవ్ర గాయమై ఆనక సింగపూర్ ఆస్పత్రిలో మరణించాడు. షేక్ హసీనాకు భారత ప్రభుత్వం ఆశ్రయం కల్పించడం నచ్చని హాదీ ఆది నుంచీ భారత్‌పై వ్యతిరేక వైఖరితో ఉండేవాడు. కాగా అతను మృతి చెందాడన్న సమాచారంతో ఢాకాలోను, పలు జిల్లాల్లోను హింసాత్మక ఘటనలు జరిగాయి. భారత రాయబార కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. బంగ్లాదేశ్‌లో పనిలో పనిగా మత విద్వేషాలు కూడా తలెత్తాయి. తాజా దుశ్చర్య భారత్ బంగ్లాదేశ్ మధ్య సత్సంబంధాలను బెడిసికొట్టే పరిస్థితి ఎదురయ్యింది. ఓ అమాయక హిందువుని కొన్ని ఉగ్రవాద ముష్కర మూకలు అతి కిరాతకంగా చంపేశాయి. ఈ ఘటనకు సాకుగా చూపిన అతను ఇస్లాం మత దూషణ చేశాడన్న ఆరోపణలో ఎలాంటి వాస్తవం లేదని ఇన్వెస్టిగేషన్ అధికారులే చెప్పినా దాడులు దారి తప్పాయి. ముందుగా అతన్ని చెట్టుకు కట్టి ఉరి తీసి చంపేశారు. డిసెంబరు 18న మెయిమెన్ సింగ్ ప్రాంతంలోని దీపు చంద్ర దాస్ అనే అతను ఇస్లాం మతాన్ని అవమానించాడంటూ అతడి సహోద్యోగి ఉద్యోగరీత్యా ఉన్న దుగ్ధ కొద్దీ నేరాన్ని ఆరోపించాడు. జరగకూడనిది జరిగిపోయింది. ఫ్యాక్టరీలో గొడవ జరుగుతున్న సమయంలోనే దీపును బయటికి పంపడం వల్లే అతనిని వాళ్లు చంపగలిగారు. తదనంతర పరిణామాల్లో దీపూ నిర్దోషిత్వంపై వివరాలు సేకరించి వెల్లడించిన ప్రముఖ పత్రిక 'డైలీ స్టార్'పై ఆందోళన కారులు మళ్లీ ఆగ్రహించారు. ఆ పత్రిక భవనాలను, యంత్రాలను విధ్వంసం చేసారు. అసలీ నిజాలను పాబ్ 14 కంపెనీ కమాండర్ మహమ్మద్ సంసుజమాన్ వెల్లడించగా సదరు వివరాలను ఆ పత్రికలో ఇచ్చారు. పత్రికల ధర్మం. అయినప్పటికీ ఉద్రిక్త వాతావరణంలో ఈ విషయాలను అర్థం చేసుకోలేక ఆందోళన కారులు దాష్టీకానికి ఒడిక ట్టారు. దీపూ హత్య జాతీయంగా, అంతర్జాతీయంగా కలకలం రేపింది. ఇలా ఓ అమాయక హిందువుని తప్పుడు ఆరోపణలతో చంపేయడాన్ని ఉత్తర హిందూ ఉత్తర అమెరికా హిందూ కూటమి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బంగ్లాదేశ్ క్రమేపి ఆటవిక పాలన వైపుగా మరలుతోందని హిందువులపై ఇంతటి దాడులు జరుగుతున్నా అంతర్జాతీయ మీడియా, ప్రపంచ దేశాలు మౌనంగా ఉండటానికి జీర్ణించుకోలేకపోతున్నామని వ్యాఖ్యానించింది. ఇది ఇలా ఉంటే బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభం భారతదేశానికి ముప్పుగా పరిణమిస్తుందని మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీబ్ బజార్ హెచ్చరిస్తున్నారు. దేశంలో చాలా ఉగ్రవాదుల శిక్షణా శిబిరాలు ఉన్నాయని వెల్లడించారు. బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు ఫిబ్రవరిలో నిర్వహించినట్లు తేదీ విడుదలయ్యాక బంగ్లాలో ఇరు వర్గాల దాడులు మళ్లీ ఊపు అందుకున్నాయి. హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయని మీడియా స్పష్టంచేస్తోంది. వాస్తవాలు వెలుగులోకి తెచ్చారన్న కారణంగా వివిధ పత్రికా సంస్థలపై దాడులు చేసి పత్రికా స్వాతంత్ర్యానికి మచ్చ తెచ్చారు. ఇలా పత్రికా సంస్థలపై దాడులు చేయడం దురదృష్టకరం. ఉన్నది తాత్కాలిక ప్రభుత్వమైనా బంగ్లాదేశ్‌లో శాంతి భద్రతలను కాపాడడంలో విఫలమవడమే కాదు. కొత్తగా మత విద్వేషాలను కూడా అదుపుచేయలేకపోతోంది. హాదీ మృతి విషయాన్ని తాత్కాలిక ప్రభుత్వ అధినేత మొహమ్మద్ యూనస్ స్వయంగా టీవీలో ప్రకటించారు. ఆ వెంటనే జనం అల్లర్లకు దిగారు. అలాంటి ఉద్వేగాలున్నప్పుడు ఆయనలా చేయకుండా ఉండాల్సింది. ఆయన సంయమనం పాటించి ఆ విషయాన్ని కొంచెం సర్దుకున్నాక చెప్పి ఉంటే ఇంత తీవ్ర స్థాయిలో అలజడులు జరిగే పరిస్థితి ఉండేది కాదు. కానీ ఆయన అలా ఆ దిశగా ఆలోచించ లేకపోయారు. జనం జీర్ణించుకోలేని అంశాలను అదిమిపెట్టి ఉంచితేనే మేలు. ఇప్పటికైనా యూనస్ ప్రభుత్వం భారతీయుల భద్రత రీత్యా గట్టి చర్యలు తీసుకోవాల్సి ఉంది. సంయమనం పాటించే కృషిచేయాలి. హాదీ హంతకులు భారత్‌కు వెళ్లిపోయారన్న అపోహ కూడా ఉంది. ఇలాంటి పరిస్థితిలో పాలకుల మోనం మంచిది కాదు. అందుకే భారతీయుల కోసం భారత దౌత్య అధికారులు ప్రత్యేక అడ్వైజరీ ఇవ్వాల్సి వచ్చింది. అటు వైపు నుంచి కూడా బంగ్లా పాలకులు అప్రమత్తమవడం అత్యంత ఆవశ్యకం. ఉభయ దేశాల మధ్య అపోహలు, అనుచిత ప్రవర్తనల పర్యవసానాలు ఉండడం శ్రేయస్కరం కాదు.

కేవలం ఆలోచించడం కాదు, ఆచరణ ముఖ్యం. అదీ ఇప్పుడే ప్రారంభించాలి తప్ప రేపటికి వాయిదా వేయకూడదు.



ఇ. గిబ్బన్

దిగజారడం ప్రారంభించనే కూడదు. ఒక్కసారి దిగజారితే ఇక దానికంతే ఉండదు.



హెచ్. లాంగ్‌ఫెలో

# ప్రజావాక్కు



## రాష్ట్రాలకు గుదిబండ

**ఉపాధి** హామీకి కొత్తబిల్లుతో ఇప్పటికిప్పుడు వచ్చే ప్రమాదం ఏముంది. ఒకటి పని కల్పన అనేది డిమాండ్ బేస్ కాకుండాప్రభుత్వఇష్టాలమీద ఆధారపడిపోతుంది. అసలు ఈ ఉపాధి హామీ పాత చట్టంలో ఉన్న విశిష్టత ఏమిటి జెండర్ తేడాలు లేకుండా అందరికీ సమాన వేతనం అనే భావం ఒకటి ఉండేది. అయితే ఇప్పుడది ఉండకపోవచ్చు. మూడు ఈ దేశంలో దళితులు ఆదివాసులకు ఈ బిల్ ఆక్సిజన్ లాంటిది, ఇప్పుడు అది మాయం అవుతుంది, ఇప్పటికే వివిధ రకాల సాంకేతిక నిబంధనలతో చాలా మందినిఉపాధిహామీకి దూరంచేశారు. ఇప్పుడు60 రోజుల హాలిడే పేరుతో మరికొంత మంది దూరం అవుతారు. అసలు ఈబిల్‌లో రాష్ట్రాలకు స్వేచ్ఛ లేకపోగా గుది బండ అనిరాష్ట్రాలు అనుకునేట్టు చేయడంలోకేంద్రం ఏ మాత్రం ఆలోచన లేకుండా చేసింది అనడంలో సందేహం లేదు.

- యారా కొమురయ్య, ఆక్కపల్లిగూడెం

## అహంకారం కూడదు

**విద్యవల్ల**వినయం అబ్బుతుందనిఅంటారు. అయితే విద్యావంతులు అందరిలోనూ ఈవినయం ఉన్నట్లు అనిపించదు. వారు మాట్లాడే భాష, కోపంతో వారి నోట నుంచి వచ్చేఅసభ్యకరమైన తిట్లువింటుంటే వీరు నిజంగా అంతా పెద్ద చదువు చదివారా అదీ విదేశాల్లో అనే అనుమానం కలుగుతుంది. తాము అనుకున్నది జరగనప్పుడు తాము కోరుకున్నది అందుకోలేనప్పుడు అందుకు కారణమైన వారిపై ద్వేషంపెంచుకుంటారు. భీష్ముడు అన్నివిద్యల్లోనూ ఆరితేరినవారు. ఎంతటి వారినైనా ఓడించగల మహా బలవంతుడు అయినప్పటికీ అహంకారాన్ని ప్రదర్శించలేదు.

- మిధునం, హైదరాబాద్

## వందేభారత్‌లో స్లీపర్ క్లాస్

**భారతీయ** రైల్వేశాఖ కొత్తగా రెండుస్లీపర్‌క్లాస్‌తో వందే భారత్‌రైళ్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆ శాఖ మంత్రివర్యులు ప్రకటించారు. వందే భారత్‌లో ఉన్న రెండు తరగతుల ధరను సామాన్యులే కాకుండా, అత్యవసరం కానిచో జీత గాళ్లుకూడా భరించే అవకాశంలేదు. ఈనేపథ్యంలో స్లీపర్ తరగతితోఉన్న వందేభారత్ రైలు టికెట్‌ఛార్జీ, ప్రయాణం చాలా ఉపయోగపడుతుంది. అత్యంత సాంకేతికతతో, సత్వరంగమ్యం చేరే సదుపాయం కలుగుతుంది.

-బి.మేఘనాథం, విశాఖపట్నం

## అధికార పార్టీ గెలుపు

**ఎన్నికలు** జరిగే సమయానికి తీవ్రవ్యతిరేకతతో గడ్డ పరిస్థితులను ఎదుర్కొని కూడా మహారాష్ట్రలో బిజెపి సారథ్యంలోని మహాయుతి కూటమిఅంతటి ఘనవిజయాన్ని ఎలా సాధించగలిగింది. అలాగే పాలన బాగాలేక తీవ్ర అసంతృప్తితో ఉన్న బీహార్ ప్రజలు కప్పదాట్ల సతీష్‌కుమార్ పార్టీకి రికార్డుస్థాయిలో సీట్లను ఎలా కట్టబెట్టారు. ఇవేకాక మరికొన్ని రాష్ట్రాలలో కూడా ఇలానే జరిగింది. ఫలితాలు అనుమానించేలా వెలుపడ్డాయి. నిజమే రాజు తలచుకుంటే దెబ్బలకి కొదవ ఉండదు. ఇసి బిజెపి ఏకమయితే ప్రత్యర్థి పార్టీలకు గెలుపు అనేది ఉండదు.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

## నిధులు పెంచాలి

**ఉపాధి** పైన తీవ్రగందరగోళం నెలకొన్న పరిస్థితి కనబడుతుంది. ఒకవేళ ప్రభుత్వం చెపుతున్నట్టుగా ఆస్తుల సృష్టి కి తగ్గట్టు ఖర్చు ఎక్కువ అవుతుంది అనుకుందాం. అప్పుడు నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీలు ఏమి చేస్తున్నట్టు అసలు చిక్కు ఏమిటి. కేంద్రం తమ బాధ్యతల నుండి తప్పుకోవడమే కదా రాష్ట్రాల ఆదాయాలను లెక్కలోకి తీసుకొనే కొత్త బిల్ తీసుకోస్తాం అని మొత్తుకుంటున్నా అది ఎంత వరకు నిజం అనేది అసలుప్రశ్న. రాష్ట్రాలకు తమ అవసరాలకు తగ్గట్టుపనులు చేసుకునే స్వేచ్ఛ ఇస్తారా లేక ఆర్థిక భారం మాత్రమే మోపుతారా అనేది కూడా అసలు ప్రశ్నే. ఉపాధి హామీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి లేక రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. అన్నింటికంటే ముఖ్యంగా బడ్జెట్ పెంచాలి. కేంద్రం ప్రవచిస్తున్న వికసిత భారతం సాకారం కావాలంటే గ్రామీణ స్వరాజ్యం రావాలి అంటే బడ్జెట్ పెంచాలి.

- భారత అవినాష్, జనగామ

## పెండింగ్ దరఖాస్తులు?

**ప్రభుత్వ** కార్యాలయంలో ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు వెంటనే పరిష్కారంచేయాలి. రెవిన్యూ, పోలీస్, మానవహక్కుల కమిషన్, కలెక్టర్ ఆఫీస్, విద్యాశాఖలో ఎక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. శారీరక వికలాంగులకు, ఎస్సి, ఎస్టీ, వర్గాలకు చెందిన దరఖాస్తులు ఆయా శాఖ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులుప్రత్యేకంగా కృషి చేయాలి. 1 జనవరి 2026 నూతన సంవత్సర కానుకగా ప్రతి ఆఫీస్‌లో గ్రామ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు పెండింగ్ దరఖాస్తులు పరిష్కారం చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# సాంస్కృతిక స్పృహలేని భాషాసేవలేల!

**ఇప్పటికైనా మన విధి విధాన నిర్ణేతలు, తెలుగు భాషాభిమానులు, ముఖ్యంగా తెలుగు సంస్థ వార్లు మేల్కొనాలి. నిధుల గురించి సాకులు చెప్పడం మాని, ఉన్న వనరులతో, ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగాలి. తమిళులు ఢిల్లీలో చేసిన సాహిత్య యాత్రను ఒక ప్రేరణగా తీసుకోవాలి. మన కవుల రచనలను ప్రపంచ వేదికపై నిలబెట్టాలి. అంతర్జాతీయ యవనికపై తెలుగు జెండా ఎగరడం అంటే కేవలం నాయకుల ప్రసం గాల్లో కాదు పారిస్ లైబ్రరీలోనో, లండన్ బుక్ స్టోర్లోనో మనప్రాచీన తెలుగు రచనల అనువాదం కనిపించినప్పుడు, జర్మన్ విద్యార్థి మన పోతనను చదివి తల ఊపినప్పుడు అప్పుడు నిజమైన తెలుగు వెలుగు ప్రసరించినట్లు. ఆ రోజు త్వరలోనే రావాలని ఆశిద్దాం.**

వెంకట రామయ్య గంపా

సాధారణంగా ప్రాంతీయ భాషా సదస్సులు ఆయా రాష్ట్రాలకే పరిమితం కావడం మనం చూస్తుంటాం. కానీ, తమిళసాహిత్య సదస్సుకు తన కార్యక్షేత్రంగా ఢిల్లీని ఎంచుకోవడం వెనుక ఒక బలమైన సాంస్కృతిక స్పృహ ఉంది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని భారతీయ భాషలు సాహిత్య అధ్యయన శాఖలో జరిగిన ఈ మేధోమధనం, వివిధ భాషల విద్యావేత్తలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం ద్వారా, తమిళ సాహిత్యం కేవలం తమిళుల సొత్తు మాత్రమే కాదు, అది భారతీయ విజ్ఞాన సర్వస్వంలో భాగమని నిరూపించింది. ఇది ఇతర భాషా సంస్థలకు ఒక మేలుకొలుపు. తెలుగు భాషకు వెయ్యేళ్ల లిఖిత చరిత్ర ఉంది, రెండు వేల ఏళ్ల మౌఖిక చరిత్ర ఉంది. రాజరాజనరేంద్రుడి ఆస్థానం నుండి, శ్రీకృష్ణదేవరాయల భువన విజయం వరకు మన సాహితీ వైభవం దేదీప్యమానం అని, మన భాష గొప్పదని మనలో మనం చెప్పుకోవడం వేరు, అది ఇతరుల చేత, ముఖ్యంగా భిన్న సంస్కృతుల వారి చేత గుర్తింపు పొందేలా చేయడం వేరు. ఈ విషయంలో తమిళులు చూపిన చొరవ అభినందనీయం. భాష అనేది కేవలం భావ వ్యక్తీకరణ సాధనం మాత్రమే కాదు, అది ఒక జాతి అస్తిత్వ పతాకం. కానీ ఆ పతాకాన్ని మనం ఎగరేస్తున్నామా? ఢిల్లీలో జరిగిన తమిళ సాహిత్య సదస్సును గమనించినప్పుడు, మన తెలుగు వారి స్తబ్దత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఈ అంతరాన్ని అర్థంచేసుకోవడానికి ఒక చిన్న పరిశీలన అవసరం. ఒక జాతి మనుగడ కేవలం దాని భౌగోళిక సరిహద్దుల మీదో, ఆర్థిక వనరుల మీదో ఆధారపడి ఉండదు. ఆ జాతి తన భాషను, సంస్కృతిని, విజ్ఞానాన్ని ఇతరులకు ఎంత సమర్థవంతంగా పంచగలుగుతుందనే అంశంపైనే దాని అంతర్జాతీయ గుర్తింపు ఆధారపడి ఉంటుంది. దీనినే ఆధునిక పరిభాషలో సాఫ్ట్ పవర్ అంటారు. డిసెంబరు 4, 5, 6, 2025న దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఒక కార్యశాల, తెలుగు భాషకు ఒక పాఠంగా మారుతుందనిపించింది. చెన్నైకి చెందిన సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్, ప్రతిష్టాత్మక ఢిల్లీ విశ్వవిద్యాలయపు భారతీయ భాషలు, సాహిత్య అధ్యయన శాఖ సంయుక్తంగా నిర్వహించిన మూడు రోజుల అంతర్జాతీయ కార్యశాల, కేవలం ఒకసాహిత్య సమావేశం మాత్రమే కాదు, అది తమిళ భాష తన ప్రాచీనతను ఆధునిక ప్రపంచానికి చాటిచెప్పిన ఒక వ్యూహాత్మక సాంస్కృతిక విజయం. 12వ శతాబ్దానికి చెందిన ప్రఖ్యాత కవయిత్రి అవ్వైయార్ రచించిన ఆత్తిచూడి అనే నీతినిధుల సంకలనాన్ని ఎంచుకోవడం వెనుక గొప్ప దూరదృష్టి కనిపిస్తుంది. ఇది వేల పద్యాలున్న బృహద్గ్రంథం కాదు, కేవలం 109 చిన్నచిన్న నీతి వాక్యాల సమాహారం. ఈ చిన్న పుస్తకాన్ని ఒకేసారి వివిధ భాషల్లోకి అనువదించే బృహత్తర బాధ్యతను తలకెత్తుకుంది. ఇందులో భారత రాజ్యాంగం గుర్తించిన భాషలతో పాటు, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ వంటి అంతర్జాతీయ భాషలు, అనేక గిరిజన, మైనారిటీ భాషలు ఉండటం గమనార్హం. కేవలం మూడు రోజుల్లో, 109 వాక్యాలను 60 భాషల్లోకి అనువదించడం, సరిచూడటం, ప్రచురణకు సిద్ధం చేయడం అనేది సాధారణ విషయం కాదు. దీనికి అకడమిక్ డిసిప్లిన్, పకడ్బందీ ప్రణాళిక అవసరం. ఒక పదం మూలార్థం చెడిపోకుండా, లక్ష్య భాషలోని సాంస్కృతిక నేపథ్యానికి అన్వయించేలా అనువాదం సాగాలి. అక్కడ జరిగిన చర్చలు, నిపుణుల సూచనలు, సలహాలు ఈ అనువాద సమస్యల పరిష్కార దిశగా సాగాయి. ఈ 60 పుస్తకాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలకు, విశ్వవిద్యాలయాలకు వెళ్తాయి. మనం కేవలం ఈ ఒక్క సంఘటనను చూసి ఆశ్చర్యపోతే సరిపోదు. దీనివెనుక ఉన్న వ్యవస్థాగత నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలి. సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ వెబ్‌సైట్‌ను కానీ, వారి నివేదికలను కానీ పరిశీలిస్తే కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి




వస్తాయి. వారి జాలగూడు (వెబ్‌సైట్)లో వారిసంస్థ సమాచారం మొత్తం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కేవలం జీతభత్యాలకో, భవనానికో పరిమితం చేయకుండా, ఇటువంటి సృజనాత్మక ప్రాజెక్టుల వైపుకు మళ్ళించడం వారి విజయ రహస్యం. తిరుక్కురల్‌ను ఇప్పటికే ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రధానభాషల్లోకి అనువదించారు. ఇప్పుడు ఆత్తిచూడి వంతు. వారు కేవలం తమిళనాడుకే పరిమితం కాకుండా, అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలలో వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేయడంలో విజయంసాధించారు. ఇక్కడే మనసును కలిచి వేసే ప్రశ్న ఉదయిస్తుంది. తమిళ సోదరులు ఢిల్లీ నడిబొడ్డున తమ భాషా వైభవాన్ని చాటు తుంటే, మన తెలుగుభాష పరిస్థితి ఏమిటి? మనకు కూడా 2008లోనే ప్రాచీన భాష హోదా లభించింది. మనకు కూడా ఒక క్లాసికల్ తెలుగుసంస్థ ఉంది. కానీ, జాతీయ స్థాయిలో దాని ప్రభావం ఎంత? మన తెలుగు సంస్థ నిర్వహించే కార్యక్రమాలు ఎలా ఉంటాయంటే చూడటానికి బాగున్న ఒక మంచి సమావేశ మందిరం, కొంతమంది ఆస్థాన పండితులు. ఈ పండితుల జాబితా ఎప్పుడూ ఒకేలా ఉంటుంది. (మ్యూజికల్ చైర్స్ ఆటలాగా, వాళ్ళే తిప్పి తిప్పి కూర్చుంటారు). సదస్సు అంశాలు, కవి సమ్మేళనం, సాహిత్యం సమాలోచన, సాహిత్యం సమాజం, తెలుగు భాష ఇలా ఏమాత్రం కొత్తదనం లేని అంశాలు, ఎత్తిపోతల పథకాలను ఎంచుకుంటారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీబిస్కెట్లు. మధ్యలో ఒకరినొకరు మీరు మహాకవి అంటే కాదు, మీరే యుగకర్త అని పొగుడుకుంటూ, శాలువాలు కప్పుకుంటూ, ఫోటోలు దిగడంతో సభ ముగుస్తుంది. మరుసటి రోజు పత్రికలో ఒక చిన్న వార్త ఘనంగా తెలుగు సదస్సు అంతే! ఆ సదస్సు వల్ల భాషకు, సాహిత్యానికి, లేదా సమాజానికి ఒరిగిన ప్రయోజనం ఏమిటంటే? సమాధానం శూన్యం. తమిళులు వారి ప్రాచీన సాహిత్యాన్ని వివిధ భాషల్లోకి అనువదించి అంతర్జాతీయ పాఠకులకు అందిస్తుంటే, మనవాళ్ళు వచ్చే నెల ఏ అంశం మీద సమావేశం పెడదాం? అని చర్చిస్తుంటారు. తమిళ సెంటర్ పనితీరు రాకెట్ వేగంతో ఉంటే, మనం ఎక్కడున్నామో బయటి ప్రపంచానికి తెలీదు. వారు పుస్తకాలను ప్రచురిస్తుంటే, మనం కాలయాపన చేస్తున్నాం. వారు ప్రపంచానికి చెబుతుంటే, మనం గోడలకు చెప్పుకుంటున్నాం. నిజంగా చెప్పాలంటే, మన సంస్థరహస్య గూఢచారి సంస్థలా పనిచేస్తోంది. అంతర్జాలంలో వారి సమాచారం ఏమీఉండదు. వారు ఏంచేస్తున్నారో ఎవరికీ తెలియదు. బహుశా అదే వారి వ్యూహం ఏమో! ఇది ఎవరినీ నిందించడానికి చేస్తున్న విమర్శ కాదు ఇది ఒక వ్యవస్థాగత వైఫల్యంపై చేస్తున్న ఆవేదన. ఇటీవల కాలంలో తెలుగుకేంద్రం నుండి జాతీయ స్థాయిని ఆకర్షించే నూతన ఆలోచన ఉన్న ఒక్క సదస్సు అయినా జరిగిందా? వేమన పద్యాలు, సుమతీ శతకం, లేదా భర్తృహరి సుభాషితాల తెలుగు అనువాదాలు ఆత్తిచూడి కంటే ఏమాత్రం తక్కువకావు. మన ప్రాచీన రచనల్లోని అంశాలు ప్రపంచ స్థాయికి చెందినవి. కానీ, వాటిని వివిధ భాషల్లోకి అనువదించాలనే ఆలోచన మనకెందుకు రాలేదు? మన దగ్గర నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, పోతన వంటి మహాకవులు ఉన్నారు. వారి సాహిత్యాన్నిఇంగ్లీష్‌లోకి లేదా హిందీలోకి అనువదించి, పెంగ్విన్ క్లాసిక్స్ లేదా అంతర్జాతీయ స్థాయి క్లాసిక్స్ వంటి వాటితో కలిసి ప్రచురించే ప్రయత్నం జరిగిందా? కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని తరచుగా వింటుంటాం. కానీ ఉన్ననిధులతో, అందుబాటులోఉన్న సాంకేతికతతో చిన్నచిన్న ప్రాజెక్టులనైనా ఎందుకు చేపట్టలేకపోతున్నాం? ఒకవేళ అటువంటి ప్రాజెక్టులు చేసివుంటే కనీసం జాలగూడులో ఎందుకు లభించడంలేదు? కనీసం జాలగూడును కూడా సరిగా నిర్వహించలేని స్థితిలో ఒక సంస్థఉండడం చాలా బాధాకరం. ఇప్పటికైనా మన విధి విధాన నిర్ణేతలు, తెలుగు భాషాభిమానులు, ముఖ్యంగా తెలుగు సంస్థ వార్లు మేల్కొనాలి. నిధుల గురించి సాకులు చెప్పడం మాని, ఉన్న వనరులతో, ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగాలి. తమిళులు ఢిల్లీలో చేసిన సాహిత్య యాత్రను ఒక ప్రేరణగా తీసుకోవాలి. మన కవుల రచనలను ప్రపంచ వేదికపై నిలబెట్టాలి. అంతర్జాతీయ యవనికపై తెలుగు జెండా ఎగరడం అంటే కేవలం నాయకుల ప్రసంగాల్లో కాదు పారిస్ లైబ్రరీలోనో, లండన్ బుక్ స్టోర్లోనో మనప్రాచీన తెలుగు రచనల అనువాదం కనిపించినప్పుడు, జర్మన్ విద్యార్థి మన పోతనను చదివి తల ఊపినప్పుడు అప్పుడు నిజమైన తెలుగు వెలుగు ప్రసరించినట్లు. ఆ రోజు త్వరలోనే రావాలని ఆశిద్దాం. •

# బీమా రంగంలో శత శాతం ప్రైవేటీకరణ సురక్షితమా?

తిప్పర్తి శ్రీనివాస్

బీమా రంగం ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన రంగం. ప్రజల జీవితాల్లో అనిశ్చితి ఎదురైనప్పుడు భద్రత కల్పించే ప్రధాన సాధనం బీమానే. ప్రమాదాలు, అనారోగ్యం, మరభయం, ప్రకృతి విపత్తులు వంటి సందర్భాల్లో కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పిస బీమా వ్యవస్థ సామాజిక భద్రతకు పునాదిగా నిలుస్తుంది. అలాంటి ప్రాధాన్యత కలిగిన బీమా రంగంలో శతశాతం ప్రైవేటీకరణ సురక్షితమా అనేప్రశ్న ఈరోజుల్లో విస్తృత చర్చకు దారితీస్తోంది. ఇది దేశ ఆర్థిక స్థిరత్వానికి, సామాన్య ప్రజల భవిష్యత్తుకు మేలు చేస్తుందా లేక ప్రమాదాలను పెంచుతుందా అనే అంశాన్ని లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. బీమా రంగం కేవలం లాభనష్టాల గణాంకాలతో కొలిచే రంగం కాదు. రైతులు, కార్మికులు, మధ్యతరగతి కుటుంబాలు, వృద్ధులు వంటి విభిన్న వర్గాల ప్రజల జీవితాలతో ఇది ముడిపడి ఉంటుంది. భారతదేశంలో ప్రభుత్వ రంగ బీమా సంస్థలు, ముఖ్యంగా భారతీయ జీవిత బీమాసంస్థ, గ్రామీణ ప్రాంతాలుఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కూడా బీమా సేవలు అందిస్తూ ప్రజల నమ్మకాన్ని సంపాదించాయి. బీమా లాభదాయకంగా లేని ప్రాంతాల్లో కూడా సేవలు అందించడమే ప్రభుత్వ రంగ ప్రత్యేకత. ఇలాంటి వ్యవస్థలో శత శాతం ప్రైవేటీకరణ జరిగితే సామాజిక బాధ్యత కంటే లాభాలే ప్రాధాన్యం పొందే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ప్రైవేటీకరణకు అనుకూలంగా విదేశీ పెట్టుబడులు పెరుగుతాయని, పోటీవల్ల సేవల నాణ్యత మెరుగవుతుందని, కొత్త సాంకేతికత అందుబాటులోకి వస్తుందని వాదిస్తోంది. కొంత వరకు ఇవి నిజమే. ప్రైవేట్ రంగ ప్రవేశంతో డిజిటల్ బీమా సేవలు, కొత్త పాలసీలు వచ్చిన విషయం వాస్తవం. అయితే శతశాతం ప్రైవేటీకరణలో ఈ ప్రయోజనాలతోపాటు తీవ్రమైన ప్రమాదాలు కూడా దాగి ఉన్నాయి. ప్రైవేట్ బీమా సంస్థలు ప్రధానంగా లాభాలు వచ్చే నగరప్రాంతాలు, అధిక ఆదాయం కలిగిన వినియోగదారులపైనే దృష్టిసారించే అవకాశం ఎక్కువ. దీనివల్ల గ్రామీణ ప్రజలు, పేదలు, చిన్న రైతులు బీమా కవరేజ్‌కు దూరమయ్యే పరిస్థితిఏర్పడవచ్చు. బీమా రంగం ప్రజల పొదుపులతో నేరుగా ముడిపడి ఉంటుంది. కోట్లాది మంది పాలసీదారులు తమ జీవిత పొదుపులను బీమా సంస్థలపై నమ్మకంతో పెట్టుబడి పెడతారు. ఒకవేళ ప్రైవేట్ లేదా విదేశీ సంస్థలు ఆర్థిక సంక్షోభంలో పడితే లేదావ్యాపార ప్రయోజనాల కోసం దేశంవిడిచిపెడితే, ఆ నష్టాన్ని భరించాల్సింది చివరకు ప్రజలే. అంతర్జాతీయ మార్కెట్ల ఒడిదుడుకులు దేశీయ బీమా రంగంపై ప్రభావం చూపితే ఆర్థిక అస్థిరత పెరిగేప్రమాదం కూడా ఉంది. ప్రైవేటీకరణవల్ల ఉద్యోగ భద్రతపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రభుత్వ రంగ బీమాసంస్థల్లో ఉద్యోగులకు స్థిరత్వం, సామాజిక భద్రత, కార్మికహక్కులుంటాయి. ప్రైవేట్‌రంగంలో మాత్రం లాభాల ఆధారంగా ఉద్యోగ నియామకాలు, తొలగింపులు జరుగుతాయి. దీనివల్ల వేలాది ఉద్యోగుల భవిష్యత్తు అనిశ్చితిలోపడే అవకాశంఉంది. ఉద్యోగ భద్రత లేకపోతే సేవల నాణ్యతపై కూడా ప్రభావం పడుతుందన్న వాస్తవాన్ని విస్మరించలేం. బీమారంగంలో ప్రభుత్వ రంగసంస్థల పాత్రను విస్మరించడం సాధ్యంకాదు. భారతీయ జీవిత బీమాసంస్థ దేశంలోనిమౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలు, సంక్షోభ సమయంలో ప్రభుత్వానికి ఆర్థిక మద్దతు వంటిఅనేక సందర్భాల్లో కీలకంగా నిలిచింది. లాభాల కోసమే కాకుండా దేశప్రయో జనాల కోసం పనిచేసే ఇలాంటిసంస్థలు బలహీనపడితే దేశ ఆర్థికవ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావంపడే అవకాశంఉంది. బీమారంగాన్నినియంత్రించే సంస్థలు ఉన్నప్పటికీ, శతశాతం ప్రైవేటీకరణతర్వాత నియంత్రణ సవాళ్లు మరింత పెరుగుతాయి. పెద్ద కార్పొరేట్ సంస్థలు, విదేశీ పెట్టుబడి దారుల ప్రభావం వల్ల నియంత్రణ వ్యవస్థ బలహీనపడితే వినియోగదారుల హక్కులు దెబ్బతినే ప్రమాదం ఉంది. నియమాలు సడలితే పాలసీదారుల రక్షణ ప్రశ్నార్థకంగా మారుతుంది. ప్రభుత్వ రంగం కేంద్రపాత్రలో ఉండి, ప్రైవేట్ రంగం సహాయక పాత్ర పోషిస్తేనే సామాజిక భద్రతతో పాటు ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుంది. •

# గ్రామపాలకులు కొలువుదీరినట్లే!

డా.పోలం సైదులు

రాష్ట్రంలో కాస్త ఆలస్యమైనా ఎట్టకేలకు ఎన్నికల కమీషన్ పంచాయతీ ఎన్నికలను విజయంతంగా నిర్వహించింది. దాదాపు డిసెంబర్ మాసమంతా ఎన్నికల హడావుడితో గ్రామాలలోని నాయకులు నిద్రలేనిరాత్రులు గడుపుతూ ఓటర్లను ఆకర్షించడానికి విశ్వప్రయత్నాలు చేస్తూ, ధన ప్రవాహంతో మద్యాన్నీ ఏరులా పారించి, అభ్యర్థులు ఒకరిని మించి మరొకరు పోటీపడుతూ ప్రచార పర్వాన్నీ ముగించుకోని, మూడు విడుతలుగా డిసెంబర్ 11,14,17న ఎన్నికలు నిర్వహించి, రాష్ట్రమంతటా 12778 గ్రామాలకు 11497 గ్రామాలలో ఎన్నికలు జరిపి, వివిధ కారణాలవల్ల 26 గ్రామాలను మినహాయించిన, 1205 గ్రామాలు ఏకగ్రీవంతో ఎన్నికైనవారిని కలుపుకొని 12702 గ్రామపంచాయతీలకు ప్రథమపౌరుడి నియామకాలు జరిగిపోయాయి. ఈనెల 22న అధికారికంగా ప్రమాణస్వీకారాలు చేసి గ్రామ పాలకులుగా కొలువుదీరనున్నారు. పోటీలో ఎంతమంది అభ్యర్థులున్నప్పటికి చివరికి గెలుపొందేది మాత్రం ఒక్కరే. కావున కొలువుతీరాక కక్ష్యగట్టే ధోరణితో, స్వార్థపూరిత ఆలోచనలతో ఖర్చుపెట్టిన డబ్బును ఎలా రాబట్టుకోవాలోనని, తమకు మద్దతివ్వని వారిపై ఏ విధంగా కక్ష్యపూరిత చర్యలు చేపట్టాలనో గాకుండా అవినీతికి పాల్పడకుండా దాదాపు ఐదు సంవత్సరాలపాటు గ్రామాభివృద్ధికై గ్రామంలోని పలువురితో చర్చించి నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతి కార్యక్రమంలో గ్రామప్రజలను భాగస్వామ్యులుగా చేస్తూ ఎలాంటి కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరినీ సమానంగా చూస్తూ, గ్రామంలోని ప్రతి ఒక్క విభాగానికి ఒక కమిటీని నియమిస్తూ, ప్రతి సమస్యకు స్పందిస్తూ, ఎప్పటికప్పుడు పరిష్కారమార్గం వైపు అడుగులు వేస్తే, గ్రామ ప్రజలే అతనిని శాశ్వతంగా ఉండేవిధంగా కోరుకుంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతి పథకంపట్ల అవగాహన ఏర్పర్చుకుంటూ, ఆ పథకాలను తమగ్రామంలోని పేదలు ఎవ్వరు ఏ పథకానికి అర్హులో వారికీ ఆ ఫలాలను అందించేందుకు కృషి చేస్తూ, గ్రామాభివృద్ధి దిశగా గ్రామాలలో గెలుపొందిన అభ్యర్థులు ప్రభుత్వం నుండి ఎలాంటి ఫలాలు వచ్చిన ముందు వారి పార్టీకార్యకర్తలకు ఎలాంటి షరతులు పెట్టకుండా అధిక ప్రాధాన్యతనిస్తూ ఇప్పించడం జరుగుతుంది. మరీ ముఖ్యంగా గ్రామాలలో ఉచిత పథకాల విషయంలో తమవర్గానికి మద్దతు ప్రకటిస్తూ వర్గపూరిత రాజకీయాలకు తెరలేపుతుంటారు. కానీ



ఇదంతా మంచి పరిణామము కాదు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే యావత్తు దేశం అభివృద్ధి చెందుతుంది. గ్రామంలోని ప్రతిఒక్కరు వృద్ధిలోకి వస్తనే గ్రామం సైతం అభివృద్ధి చెందుతుంది. గ్రామాభివృద్ధి అనేదీ గ్రామ ప్రథమ పౌరుడిపై ఆధారపడి ఉంటుంది. కావున గ్రామ ప్రజలందరినీ తమ పిల్లలుగా భావించి నిస్వార్థంతో, నిజాయితీతో ఎలాంటి పక్షపాత ధోరణి అవలంభించకుండా, అర్హులందరికీ ఆసరాగా వుంటూ అభివృద్ధికై పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మరికొద్ది రోజులలో వేసవికాలం ప్రారంభం కాబోతున్నది. గత సంవత్సరాల నుండి కొన్ని గ్రామాలలో నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ, ట్యాంకర్లతో నీటిని అందించడం జరిగింది. సర్పంచ్ లు సైతం ముందు జాగ్రత్తతో ప్రణాళికాయుతంగా వేసవికాలంలో మంచినీటి సమస్య లేకుండా చూసుకోవాలి. వితంతువులు, వృద్ధులు, అంగ వైకల్యం కలిగిన వారికీ ప్రతి నెల పింఛన్ వచ్చే విధంగా చూసుకుంటూ, ఏమైనా సాంకేతిక సమస్యలతో పేర్లు తొలిగించబడితే వెంటనే అధికారులదృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాల్సిన అవసరం వున్నది. రేషన్ సరుకులు సక్రమంగా అందుతున్నాయా? ప్రతి నిరుపేదకు ఉపాధిహామీ పథకంలో చోటు ఉన్నదా? రైతుబీమా, రైతు బంధు వస్తుందా? కల్యాణలక్ష్మి అందరికి అందుబాటులో ఉన్నదా? వసతి గృహాల కల్పనలో నిరుపేదలకు స్థానమున్నదా? మురుగు కాలువల నిర్వహణ సక్రమంగా జరుగుతుందా? అంగన్వాడీ, పాఠశాలలు సక్రమంగా నడుస్తున్నాయా? ప్రభుత్వం చేపట్టే పోలియో చుక్కల నిర్వహణ, వాక్సిన్‌కు తోడ్పాటు అందిస్తున్నారా? ప్రతి ఒక్కరి ఇంటికి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు ఉన్నాయా? వీటన్నింటినీ చూసుకోవాల్సిన బాధ్యత వారిపై వున్నది. ప్రతి ఒక్క రైతుకు పంటలోన్లు, పంట నష్టపరిహారం అందుతున్నదో చూసుకోవాలి. వందశాతం అక్షరాస్యత, జనన, మరణ నమోదులు, పచ్చదనం, పరిశుభ్రతకు సహకరించాలి. బడులకు మరమ్మత్తులు, టాయిలెట్లు, ప్రహరీ గోడలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రంథాలయాలు, పంచాయితీ భవనాలు, దేవాలయాలను, కల్యాణ మండపాలు నిర్మించాలి. చాలాగ్రామాలలోకోతులు, వీధికుక్కల బెడదలేకుండా శాశ్వత పరిష్కారమార్గాలు చేపట్టాలి. ప్రతి గ్రామపంచాయతీలో హాజరు రిజిస్టర్‌ను ఖచ్చితంగా అమలుచేయాలి. అందులో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్స్, ఎంపీటీసీలు, కారోబార్, పంచాయతీ కార్యదర్శి, కావలికారు ఏఎన్ఎమ్‌లు, ఆశవర్కర్, ఉపాధ్యాయులు, చౌకీదార్, విద్యుత్ హెల్పర్, వెటర్నరీ అసిస్టెంట్, గ్రామ పోలీస్ అధికారు, ఫీల్డ్ అసిస్టెంట్, సుంకరులు ఐకెపి బాధ్యులు, ఐకెపి యానిమేటర్స్, అంగన్వాడీ టీచర్, వాటర్‌మెన్, రేషన్ డీలర్, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు తమసంతకాన్ని నమోదుచేసి తమబాధ్యతలు నిర్వర్తిస్తూ గ్రామాభివృద్ధికి పూనుకోవాల్సిన అవసరం ఉన్నది. అందరు కష్టించి పనిచేసి, గ్రామాభివృద్ధికి పూనుకుంటారని ఆశిద్దాం. •

# చొరబాటుదారులపైనే వారికి ప్రేమ




## అసోమీయులపై పక్షపాతం అందుకే
## ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నారు
## ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిని గాలికొదిలేశారు
## భూపేన్ హజారికాను అవమానించారు
## కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ తీవ్ర ఆరోపణలు
## నమ్రూప్‌లో ఎరువుల ఫ్యాక్టరీ ప్రారంభించిన ప్రధాని

**గువహాటి, డిసెంబరు 21:** కాంగ్రెస్‌కు అసోమీలపై ప్రేమ, గౌరవం లేదు, దానికి బదులుగా చొర బాటుదారులపై అమితమైన ప్రేమను చూపు తున్నారని, అందుకే ఆ పార్టీ ఓటర్ల జాబితా సవ రణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆది వారం ఉదయం అసోంలోని నమ్రూప్‌లో ఎరు వుల కర్మాగారాన్ని ప్రధాని మోడీ ప్రారం భించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, ప్రతి పక్షంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ అసోం, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిని గాలికొదిలేసిందని, వ్యతిరేకించిందని ఆరోపిం చారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ జాతి వ్యతిరేక ఆలోచనలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. అసోం గుర్తింపు, గౌరవాన్ని కాపాడుకోవడానికి బీజేపీ ఉక్కు కవచంలా అండగా నిలుస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. 'కాంగ్రెస్ బుజ్జగింపు, ఓటు బ్యాంకు" అనే ఈ విషం నుండి మనం అసోంను రక్షి ంచాలని మోడీ పిలుపునిచ్చారు. "బిజెపి ప్రభుత్వం సంగీత దిగ్గజం భూపేన్ హజారికాకు భారతరత్న ఇచ్చి సత్కరిస్తే, కాంగ్రెస్ ఆ అసోం ఆరాధ్యుడిని అవమానించింది. అసోంలోని నాగావ్ జిల్లాలో సెమీకండక్టర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలన్న తమ నిర్ణయాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిం చింది' అని అన్నారు. 'అసోం జనాభా స్వరూపాన్ని నాశనం చేసిన చొరబాటు దారులకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. ఎందుకంటే ఆ చొరబాటుదారులే ప్రతిపక్ష పార్టీకి ఓటు బ్యాంకు. అసోం ప్రజల హక్కులను పరిరక్షించడానికి బిజెపి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది" అని ప్రధాని మోడీ అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలోని స్థానిక ప్రజలను రక్షించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. 'అసోంతోపాటు మొత్తం ఈశాన్య ప్రాంతాలకు శుభదినం. నమ్రప్, దిబ్రుగఢ్ చాలా కాలంగా ఎదురుచూస్తున్న కల నిజమవుతోంది' అని అన్నారు.

ఈ ప్రాంతంలో పారిశ్రామిక పురోగతిలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుందని ప్రధాని మోడీ అన్నారు. "అసోం అభివృద్ధిలో కొత్త వేగాన్ని చేరుకుందని, మీరు ఇప్పుడు అనుభవిస్తున్నది ప్రారంభం మాత్రమే.. ఈ ఆధునిక ఎరువుల కర్మాగా రాన్ని ప్రారంభించడం రైతు సోదరు లందరికీ ఎంతో ఉపయోగం. బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో పరిశ్రమలు, కనెక్టివిటీ ఈ సహకారం అసోం కలలను నెరవేరుస్తోంది. యువత కొత్త కలలు కనేలా ప్రేరేపిస్తోంది" అని ప్రధాని మోదీ అన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడంలో దేశ రైతులు, ఆహార ప్రదాతలు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. అందువల్ల, రైతుల ప్రయో జనాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి ఎన్డీయే ప్రభుత్వం పగలు, రాత్రి కృషి చేస్తోంది. నమ్రప్‌లోని ఈ యూనిట్ వేలాది కొత్త ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని ప్రధాని మోడీ అన్నారు. అంతకుముందు గువహటిలోని స్మారక క్షేత్రంలో చారిత్రాత్మక అసోం ఉద్యమ అమరవీరులకు ప్రధాని మోడీ నివాళి అర్పించారు. ఇది రాష్ట్ర ప్రజలకు ఒక భావోద్వేగ క్షణంగా నిలిచిందని వ్యాఖ్యానిం చారు. 1979లో ప్రారంభమైన ఆరేళ్ల విదేశీ వ్యతిరేక ఉద్యమంలో అమరవీరుడైన ఖర్గేశ్వర్ తలుక్దార్ విగ్రహానికి ప్రధాని మోడీ పూలమాల వేసి నివాళి అర్పించారు. అసోం గుర్తింపు, సంస్కృతి, హక్కులను పరిరక్షించ ్డానికి ఆయన చేసిన కృషి, త్యాగాలను మోడీ స్మరించుకు న్నారు. అనంతరం అమరవీరుల గ్యాలరీని ప్రధాని సందర్శించారు. ఆ తర్వాత బ్రహ్మపుత్ర నదిపై 'చరాయిదేవ్' అనే క్రూయిజ్ నౌకలో అసోంలోని వివిధ ప్రాంతాల నుండి ఎంపిక చేసి 25 మంది విద్యార్థులతో ప్రధాని మోడీ ముచ్చటించారు.

## ఇక చాలు.. అబద్ధాలు చెప్పడం ఆపండి
### ప్రధాని ఆరోపణలపై కాంగ్రెస్ మండిపాటు

**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** స్వాతంత్ర్యానికి ముందు అసోంను పాకిస్తాన్‌కు అప్పగించాలని కాంగ్రెస్ కుట్ర చేసిందని ప్రధాని మోడీ ఆరోపించారు. అసోంను పూర్వపు తూర్పు పాకిస్తాన్‌లో భాగం చేయడానికి ముస్లిం లీగ్, బ్రిటిష్ వారితో చేతులు కలపడానికి సిద్ధమవడం ద్వారా కాంగ్రెస్ పాపం చేసిందని ఆరోపించారు. ఈయితే, ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత, లోక్‌సభ ఎంపి మాణికం ఠాగూర్ స్పందించారం. ఈ ఆరోపణల్ని ఎక్స్ వేదికగా ఖండించారు. అసోంను పాకిస్తాన్‌కు అప్పగించే ప్రతి పాదన లేదని అన్నారు. అసోం హిందూ మెజారిటీ ప్రావిన్స్ అని, విభజన ప్రణాళికలో పాకిస్తాన్ భాగంగా అసోం లేదని, అసోంలోని సిల్హెట్ జిల్లా ముస్లిం మెజారిటీ ప్రాంతం అని అన్నారు. ఇప్పుడు సిల్హెట్ జిల్లా బంగ్లాదేశ్‌లో భాగంగా ఉంది. జులై 1947లో బ్రిటిష్ అధికారంలో ఉన్న సిల్హెట్ జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగిందని, ఆ తర్వాత అది తూర్పు బెంగాల్‌లో ఆ తర్వాత తూర్పు పాకిస్తాన్‌లో భాగమైందని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ నిర్ణయం కాదని గోపీనాథ్ బోర్డోలోయ్ ప్రయత్నాల కారణంగా కరీంగంజ్ సబ్ డిస్ట్రిక్ భారత్‌లోనే ఉంచబడిందని చెప్పారు. మోడీ శిక్షణ పొందిన ఆర్ఎస్ఎస్ వ్యక్తి అని, అబద్ధాలు వ్యాప్తి చేయడం ద్వారా జీవిస్తున్నారని అన్నారు.

# శ్రీకృష్ణుడు, హనుమంతుడు గొప్ప దౌత్యవేత్తలు
## విదేశాంగ మంత్రి జైశంకర్



**పుణె, డిసెంబరు 21:** రామాయణ, మహాభార తాలు కేవలం మత గ్రంథాలు మాత్రమే కాదని, ప్రపంచ రాజకీయాలు, దౌత్యానికి విలువైన పాఠాలను అందించే లోతైన మార్గద ర్శకాలని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పుణె బుక్‌ఫెయిర్‌కు హాజరై చర్చావేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దౌత్యం నుండి చర్చ వరకు అనే అంశంపై జైశంకర్ మాట్లాడారు. సంకీర్ణ రాజకీయాలకు, బహుళ ధ్రువ ప్రపంచానికి మధ్య పోలికలను ఈ సందర్భంగా ఎత్తిచూపారు. ప్రపంచ దేశాలు, భాగస్వామ్యాల పట్ల భారతదేశ విధానాన్ని దాని జాతీయ ప్రయోజనాలే నిర్దేశిస్తాయని జైశంకర్ నొక్కి వక్కాణించారు. దౌత్యవేత్తల విధుల గురించి మాట్లాడుతూ.. తన దృష్టిలో శ్రీకృష్ణుడు, హనుమంతుడు గొప్ప దౌత్యవే త్తలని పేర్కొన్నారు. భారత్‌కు వ్యూహాత్మక రాజకీయాలు, రాజ్య నిర్వహణ తెలియవని అనేకమంది విదేశీ రచయితలు పుస్తకాలలో రాసిన వ్యాఖ్యలను పదేపదే చదివి విసిగిపోయానని అన్నారు. మనమంతా సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు పాటిస్తూ పెరిగామని జై శంకర్ చెప్పారు. ఇవన్నీ విదేశీయులకు తెలియవు కాబట్టి.. ఎన్నో ఏళ్లుగా భారత్ పాటిస్తున్న రాజనీతిని ప్రపంచానికి చాటి చెప్పాలనుకుంటున్నట్లు తెలిపారు. రామాయణంలోని ప్రజాపాలన, సంక్లిష్ట పరిస్థితులు, రాజకీయ వ్యూహాలు మన పరిపాలనా విధానాలను తెలియజేస్తా యన్నారు. ఆ సమయంలో హనుమంతుడు దౌత్యవేత్తగా తన విధులను ఎంతో చక్కగా నిర్వహించాడని చెప్పారు. సీతకు సంబం ధించిన సమాచారం తీసుకురమ్మని ఒక్క పనిమీద లంకకు పంపితే.. అక్కడికి వెళ్లిన హనుమంతుడు పది పనులు చేసుకువచ్చాడని, సీతలో మనోధై ర్యాన్ని, రావణుడిలో భయాన్ని నింపాడని జైశంకర్ అన్నారు. అదేవిధంగా మహాభార తంలో శ్రీకృష్ణుడు కూడా కౌరవులు, పాండవుల మధ్య సంధి కోసం ప్రయత్నిం చాడని, యుద్ధంలో ధర్మంవైపు నిలబడ్డాడని చెప్పారు. అంతకంటే గొప్ప దౌత్యవేత్తలను మనం ఇంకెక్కడ చూడగలమని ప్రశ్నించారు. వారిని ఆదర్శంగా తీసుకుని తాను కూడా ప్రధాని మోదీ నాయకత్వంలో ముందుకు వెళ్తున్నానని చెప్పారు. ఈ కార్యక్ర మంలో నేషనల్ బుక్ ట్రస్ట్ డైరెక్టర్ యువరాజ్ మాలిక్, కేంద్ర మంత్రులు మురళీధర్ మోహోల్, చంద్రకాంత్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్‌ను రాజకీయ కోణంలో చూడొద్దు
## బిజెపితో ముడివేయడం పెద్దపొరపాటు
## హిందూ సమాజ శ్రేయస్సే సంస్థ లక్ష్యం: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టీకరణ




**కోల్‌కతా, డిసెంబరు 21:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఎలాంటి రాజకీయ ఉద్దేశంతో నడవడం లేదని, లేదా ఏదైనా రాజకీయ సమస్యకు ప్రతిస్పందనగా కూడా ప్రారంభం కాలేదని ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. భారత దేశం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందేలా, విశ్వగురు భారత్ గా ఎదగడానికే సంఘ్ స్థాపన జరిగిందన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల్లో భాగంగా ఆదివారం కలకత్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ గురించి చాలామందిలో అపోహలు ఉన్నాయని అన్నారు. ఆర్ఎస్ఎస్‌ను బిజెపితో ముడివేయడం పెద్ద తప్పు అని స్పష్టం చేశారు.

బిజెపిలో అనేక మంది నాయకులు ఆర్ఎస్ఎస్ నుంచి వెళ్లినవాళ్లే అని, అంతమాత్రాన ఆర్ఎస్ఎస్‌ను బిజెపితో కలిపి చూడడం పొరపాటు అని అభిప్రాయ పడ్డారు. సంఘ్ ఎవరి పట్ల విరోధభావంతో పనిచేయదని, హిందూ సమాజ ఐక్యత, సౌహార్ద్రత కోసమే పనిచేస్తుందని మోహన్ భగవత్ స్పష్టం చేశారు. చాలామందికి ఆర్ఎస్ఎస్ అనే పేరు మాత్రమే తెలుసని, కానీ ఆర్ఎస్ఎస్ ఎలాంటి కార్యకలా పాలు నిర్వర్తిస్తుందో తెలియదని అన్నారు. సంఘ్ అభివృద్ధి చెందడం కొందరికి నచ్చని విషయం అని వ్యాఖ్యానించారు. కేవలం హిందూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి రాజకీయ అజెండా లేదని భగవత్ ఉద్ఘాటించారు.

సంఘ్ గురించి ఏర్పడే అభిప్రాయాలు తరుచుగా మూడో పక్షం ద్వారా వ్యాప్తి అయ్యే తప్పుడు కథనాలపై ఆధారపడి వుంటోందని, అలా కాకుండా ప్రజలు సంఘ్‌ను అవగాహన చేసుకోవాలని, దాని వచ్చిన వాస్తవాలపై అర్థం చేసుకోవాలని సూచించారు. అంతేగానీ పుకార్లు, అపోహలను ఆధారంగా చేసుకొని సంఘ్‌ను అర్థం చేసుకోవద్దని కోరారు.

హిందూ సమాజాన్ని సంఘటితం చేయడానికే సంఘ్ స్థాపన జరిగిందని భాగవత్ పునరు ద్ఘాటించారు. అంతేగానీ ఎవ్వరికీ వ్యతిరేకంగా స్థాపించలేదని స్పష్టం చేశారు.

సంఘ్‌కు ఎలాంటి రాజకీయ అజెండా లేదని, దేశమే తొలి ప్రాధాన్యం అన్న సిద్ధాంతాన్ని పాటిస్తూ పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు తమ కార్యకర్తలు పనిచేస్తున్నారని ఆయన చెప్పారు.


సంఘ్ చేస్తున్న ఈ కృషితో భారత్ మళ్లీ విశ్వగురువుగా మారుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. భారతదేశ సనాతన సంస్కృతీ విలువలకు కట్టుబడి ఉండటం, స్వదేశీని ప్రోత్సహించడం వంటివి జాతి నిర్మాణం, జాతి భద్రతకు అనివార్యమని అన్నారు. పేదల అభ్యున్నత, హిందూ సమాజ పరిరక్షణకు సంఘ్ పనిచేస్తోందని చెప్పారు.

# భరణం కోసం అనారోగ్యం నాటకమన్న భార్య
## పక్షవాతంతో ఉన్న భర్త స్ట్రెచర్‌పై కోర్టుకు హాజరు
## భార్య ఆరోపణలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన కోర్టు

**లక్నో,డిసెంబరు 21:** భరణం చెల్లించకుండా తప్పించుకునేందుకు భర్త అనారోగ్యం నాటకం ఆడుతున్నాడని భార్య ఆరోపించడంతో ఆ వ్యక్తిని స్ట్రెచర్‌పై కోర్టుకు కుటుంబం తరలించింది. పక్షవాతంతో మంచానికి పరిమితమైన అతడి పరిస్థితిని కోర్టుకు చూపించింది. ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక జంట వివాహం నెలలోనే విచ్ఛిన్నమైంది. దీంతో భార్య తన పుట్టింటికి వెళ్లింది. భరణం కోరుతూ కాన్పూర్ ఫ్యామిలీ కోర్టును ఆమె ఆశ్రయించింది. కాగా, ఐదేళ్ల కిందట ఆ వ్యక్తికి పక్షపాతం వచ్చింది. దీంతో మాట్లాడలేని, నడవలేని స్థితిలో ఉన్న అతడు పూర్తిగా మంచానికి పరిమి తమయ్యాడు. సంరక్షణ కోసం పూర్తిగా తన కుటుంబంపై ఆధారపడ్డాడు. అయితే తన భర్త ఆరోగ్యంగా ఉన్నాడని, పని చేయగలడని భార్య కోర్టుకు తెలిపింది. భరణం చెల్లించకుండా ఉండేందుకు ఉద్దేశపూర్వకంగా అనారోగ్యంతో ఉన్నట్లు నటిస్తున్నాడని కోర్టులో ఆరోపించింది. మరోవైపు భార్య ఆరోపణలపై భర్త కుటుంబం కలత చెందింది. హాస్పిటల్‌లో ఉన్న అతడ్ని అంబులెన్స్‌లో కోర్టుకు తరలించారు. స్ట్రెచర్‌పై కోర్టు హాలులో హాజరుపరిచారు. ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని నిర్ధారించే వైద్య నివేదికలు, సర్టిఫికెట్లు, ఇతర ఫొటోలను కోర్టుకు సమర్పించారు. న్యాయమూర్తి, న్యాయవాదులు, కోర్టులో ఉన్న వారిని ఇది దిగ్భ్రాంతికి గురిచేసింది.

భార్య ఆరోపణలపై కోర్టు అసం తృప్తి వ్యక్తం చేసింది. నిర్ధారణ కోసం ఆ వ్యక్తికి వైద్యపరీక్షలకు ఆదేశించింది. అయితే పక్షవా తంతో మంచానికి పరిమితమైన భర్తను చూసేం దుకు భార్య ఒక్కసారి కూడా ఇంటికి రాలేదని అతడి కుటుంబం ఆరోపించింది. అతడి ఆరోగ్యం కోసం గత ఐదేళ్లుగా చాలా ఖర్చు చేసినట్లు సోదరి వాపోయింది. ఆ వ్యక్తిని స్ట్రెచర్‌పై కోర్టుకు తరలించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# భూమివైపు దూసుకొస్తున్న స్టార్‌లింక్ శాటిలైట్



**న్యూయార్కు, డిసెంబరు 21:** టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కు చెందిన స్టార్‌లింక్ ప్రాజెక్టు లోని ఉపగ్రహాల్లో ఒకటి అంతరిక్షం నుంచి అదుపుతప్పి భూమివైపు వస్తున్నది. ఈ నెల 17న భూమి నుంచి 418 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న శాటిలైట్ 35956 హఠాత్తుగా అక్కడి నుంచి జారిపోవడం మొదలైంది. స్పేస్‌ఎక్స్ దానిపై నియంత్రణ కోల్పోయింది. ఆ తర్వాత ఆ సంస్థ దీనిపై వివరణ ఇచ్చింది. హఠాత్తుగా ఉపగ్రహంలో సాంకేతిక లోపం తలెత్తి ప్రొపెల్షన్ ట్యాంక్‌లో గ్యాస్ అత్యంత శక్తిమంతంగా బయటకు వెలువడింది. దాంతో ఒక్కసారిగా అది నాలుగు కిలోమీటర్ల కిందకు దూసుకొ చ్చింది. ఆ తర్వాత కొన్ని భాగాలుగా విడిపోయి మెల్లగా జారుతున్నాయి. వారం రోజుల్లోగా అవి భూవాతావరణంలోకి వచ్చి కూలిపోవచ్చు అని స్పేస్‌ఎక్స్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ఆ ఉపగ్రహానికి సంబంధించిన శకలాలు అమె రికాలోని అలాస్కా సమీపంలో గగనతలంలో ప్రయాణిస్తుండగా వెంటోర్‌టెక్ సంస్థకు చెందిన వరల్డ్‌వ్యూ3 అనే ఉపగ్రహం 241 కిలోమీటర్ల దూరం నుంచి హైరిజల్యూషన్ చిత్రాలను తీసింది. ఈ ఉపగ్రహం నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి లేదా భూమికి ఎలాంటి ముప్పు లేదని స్పేస్‌ఎక్స్ చెబుతోంది. ప్రస్తుతం అది ఐఎస్ఎస్ కంటే కిందే ఉందని వెల్లడిం చింది. అది లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో ఉండటంతో భూగురుత్వాకర్షణ శక్తి దానిని సులువుగా లాగే స్తుందని తెలిపింది. అవి వాతావరణ ఘర్షణతో కాలిపోయే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ప్రస్తుతం స్టార్‌లింక్ ప్రాజెక్టు కింద 9,000 ఉపగ్రహాలను స్పేస్‌ఎక్స్ అంతరిక్షంలోకి పం పింది. దాంతో భూమిపై మారుమూల ప్రాం తాలకు ఇంటర్నెట్‌ను సరఫరా చేయగలు గుతోంది.

# దీపూదాస్ మతపరమైన ఆరోపణలు చేయలేదు
## హిందూ యువకుడి హత్యలో ప్రాథమిక విచారణ

**ఢాకా, డిసెంబరు 21:** బంగ్లాదేశ్‌లో ఇటీవల మత విద్వేషం ముసుగులో జరిగిన హిందూ యువకుడి దారుణ హత్య ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ హత్యకు కారణమని చెబుతున్న మత దూషణ ఆరోపణల్లో ఎటువంటి నిజం లేదని ప్రాథమిక విచారణలో తేలింది. ఈనెల 18 రాత్రి మైమెన్‌సింగ్‌లో దీపు చంద్రదాస్ అనే హిందూ యువకుడిని ఒక ఉన్మాద మూక అత్యంత క్రూరంగా కొట్టి చంపింది. ఇస్లాం మతాన్ని కించపరిచాడంటూ తన ఫ్యాక్టరీలోని ఒక సహోద్యోగి చేసిన ఆరోపణలతో ఈ హింస మొదలైంది. ఆవేశంతో వచ్చిన మూక దీపును చంపి, మృతదేహాన్ని చెట్టుకు వేలాడదీసి నిప్పుపెట్టింది. ఈ ఘటనపై బంగ్లాదేశ్ పత్రిక ది డైలీ స్టార్ తో మాట్లాడిన రాబ్14 కంపెనీ కమాండర్ మహ్మద్ సంసు జ్జమాన్ సంచలన విషయాలు వెల్లడించారు. దీపు చంద్రదాస్ తన సోషల్ మీడియాలో మతపరమైన భావాలను దెబ్బతీసేలా ఎలాంటి పోస్టులు చేయలేదని స్పష్టం చేశారు. దీపు మతాన్ని విమర్శించడం మేము స్వయంగా విన్నామని చెప్పే ఒక్క వ్యక్తి కూడా అక్కడ లేరని ఆయన తెలిపారు. ఫ్యాక్టరీలో గొడవ జరుగు తున్నప్పుడు, ఫ్యాక్టరీకి నష్టం కలగకూడదనే ఉద్దే శంతో అతడిని బలవంతంగా బయటకు నెట్టే శారని, ఆ తర్వాతే ఈ ఘోరం జరిగిందని అధికారి పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబం ధించిన వీడియోలు వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఇప్పటివరకు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వచ్చిన సమాచారంతో మరో ఐదుగురిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం 10 మందిని పోలీసులు విచారిస్తున్నట్లు ఏఎస్పీ మహ్మద్ అబ్దుల్లా అల్ మామున్ తెలిపారు. ఈ దారుణ హత్యపై ఉత్తర అమెరికా హిందూ కూటమి తీవ్రంగా స్పందిం చింది. బంగ్లాదేశ్ ఆటవిక రాజ్యం వైపు వెళ్తోంది. హిందువులపై ఇంతటి హింస జరుగుతున్నా అంతర్జాతీయ మీడియా, ప్రపంచ దేశాలు మౌ నంగా ఉండటం శోచనీయమని ఆ సంస్థ ఆవేదన వ్యక్తం చేసింది.



# పాక్‌కు 700 మిలియన్ డాలర్ల ప్రపంచ బ్యాంకు సాయం




## అప్రమత్తమైన భారత్!

**వాషింగ్టన్, డిసెంబరు 21:** పాకిస్థాన్‌కు ప్రపంచ బ్యాంకు భారీ సాయాన్ని ఆమోదించింది. 700 మిలియన్ డాలర్ల సాయాన్ని ఆమోదిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌లోని ఆర్థిక వ్యవ స్థను గాడినపెట్టేందుకు, అలాగే సేవారంగాన్ని పెంపొందించేందుకు వరల్డ్ బ్యాంక్ రుణ సదుపాయాన్ని కల్పించినట్లు సమాచారం. పబ్లిక్ రీసోర్స్ ఫర్ ఇన్‌క్లూజివ్ డెవలప్‌మెంట్ మల్టీఫేజ్ ప్రోగ్రామాటిక్ అప్రోచ్ (పిఆర్ఐడి-ఎంపిఎ)లో భాగంగా మొత్తం 1.35 బిలియన్ డాలర్ల సాయాన్ని వరల్డ్ బ్యాంకు అప్రూవల్ చేసినట్లు డాన్ ప్రతిక కథనం ద్వారా వెల్లడవుతోంది. ఇందులో 600 మిలియన్ డాలర్లకు ఫెడరల్ లెవెల్ ప్రోగ్రామ్స్‌కు అలాగే 100 మిలియన్ డాలర్లు సింధ్ రాష్ట్రంలోని అభివృద్ధి పనులకు కేటాయించింది.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ధాటికి పాకిస్థాన్ అతలాకుతలం అయిన విషయం తెలిసిందే. అలాగే పాక్‌పై భారత్ అనేక కఠిన ఆంక్షలు విధించింది. సింధూ జలాల నిలిపివేతతోపాటు ఇరు దేశాల మధ్య వాణిజ్యం నిలిచిపోయింది. అలాగే పలు ఇతర కారణాలతో పాకిస్థాన్ ఆర్థిక రంగం దెబ్బతిన్నది. ఈ క్రమంలో పాకిస్థాన్‌లోని ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు వరల్డ్ బ్యాంకు మొత్తం 1.35 బిలియన్ డాలర్ల సాయా న్ని ప్రకటించింది. దానిలో భాగంగా తాజాగా 700 మిలియన్ డాలర్ల సాయాన్ని ఆమోదిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

ఇక ఇటీవల పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలోని ప్రాథమిక విద్యాభివృద్ధి కోసం ఈ యేడాది ఆగస్టులో 47.9 మిలియన్ డాలర్లు సాయం చేసింది. తాజాగా వరల్డ్ బ్యాంక్ మరో 700 మిలియన్ డాలర్లు ఆమోదించింది. ఈ విష యాన్ని పాకిస్థాన్‌లోని వరల్డ్ బ్యాంకు ఆఫీసర్ బోలోర్మా అంగాబజార్ ధ్రువీకరించారు. పాకి స్థాన్‌లో సమీకృత, సుస్థిర అభివృద్ధి కోసం దేశీయంగా ఉన్న రీసోర్స్‌లను సమర్థవంతంగా వినియోగించి మెరుగైన ఫలితాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# 'స్మార్ట్' కళ్లజోడుతో అనంతపద్మనాభుని ఆలయంలోకి!
## విడియో షూట్‌కు యత్నించడంతో అదుపులోకి తీసుకొన్న పోలీసులు



**తిరువనంతపురం, డిసెంబరు 21:** కేరళలోని తిరువనంతపురం శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయంలో కలకలం రేగింది. స్మార్ట్ కళ్లజోడు పెట్టుకుని ఆలయంలోకి ప్రవేశించిన విదేశీ భక్తుడు దాని సాయంతో లోపలి రికార్డు చేసేం దుకు ప్రయత్నించాడు. దీన్ని గమనించిన భద్ర తా సిబ్బంది అప్రమత్తమై అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 20న శనివారం ఉదయం జరిగిన ఈఘటనలో నిందితుడిని సింగపూం లోని నార్త్‌షోర్ డ్రైవ్‌కు చెందిన తిరునీపనార్ (49)గా గుర్తించారు. తిరునీపనార్‌ను శ్రీలంక సంతతికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం శ్రీ అనంతపద్మనాభస్వామి ఆలయంలోకి శనివారం ఉదయం 9.25 గంటల సమయంలో తిరునీపనార్ కెమెరా అమర్చిన స్మార్ట్ కళ్లజోడు ధరించి ప్రవేశించాడు. తర్వాత లోపల విడియో రికార్డు చేయడం మొదలుపెట్టాడు. ఆలయ ఉత్తరంవైపు, తులాభారం మండపం సహా ఇతర ప్రదేశాలను విడియోలో బంధించాడు. అతడి చర్యలను గుర్తించిన సెక్యూరిటీ వెంటనే అప్రమత్తమై అదుపులోకి తీసుకుంది. అనంతరం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఆలయ అధికారుల ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడికి నోటీసులు ఇచ్చి వదిలిపెట్టిన పోలీసులు ఈ నెల 21న విచారణకు రావాలని ఆదేశించారు.

శ్రీలంక సంతతికి చెందిన తిరునీపనార్ కేరళ లోని పర్యాటక ప్రదేశాలను చూసేందుకు వచ్చి నట్లు పోలీసులు తెలిపారు. అయితే, పద్మనాభ స్వామి ఆలయంలో ఇలాంటి సంఘ టన జరగడం ఇదే మొదటిసారి కాదు. ఈ యేడాది జూలైలో గుజరాత్‌కు చెందిన సురేంద్ర షా అనే వ్యక్తి ఆలయం లోపలి విడియో తీయడానికి ప్రయత్నించడంతో భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. కుటుంబంతో కలిసి ఆలయ సందర్శనకు వచ్చిన అతడు స్మార్ట్ కళ్లజోడు పెట్టుకుని ప్రవేశించాడు. కాగా, 8వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయంలో టన్నులకొద్దీ బంగారం, వజ్రాలు, విగ్రహాలు 2011లో బయట పడ టంతో ఒక్కసారిగా ప్రపంచం దృష్టిని ఆకర్షిం చింది. ఆలయ నేలమాళిగలోని ఆరు గదుల్లో అపార సంపదలు బయటపడ్డాయి. అయితే, ఐదు గదులను తెరవగా ఆరో గది మాత్రం తెరవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆ గది తలుపులపై నాగబంధనం ఉందని, తెరిస్తే అరిష్టమనే ప్రచారం కూడా జరిగింది.

# సంక్షిప్తంగా..

## హోంగార్డ్ ఉద్యోగాలకు ఎంబిఎ, ఎంసిఎ పట్టభద్రులు



**భువనేశ్వర్, డిసెంబరు 21:** ఒడిశా పోలీసుశాఖ 187 హోంగార్డ్ ఉద్యో గాల భర్తీకి ఇటీవల నిర్వహించిన రాత పరీక్షకు ఎంబిఎ, ఎంసిఎ పట్టభద్రులు కూడా హాజరయ్యారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ ఘాటుగా స్పందించింది. బిజెపిపాలిత రాష్ట్రంలో నిరుద్యోగ దుస్థితి ఇలా ఉందని దుయ్యబట్టింది. చేతిలో డిగ్రీలు ఉన్నా, కొలువులు మాత్రం లేవంటూ ఎక్స్ పోస్టులో ఎద్దేవా చేసింది. డబుల్ ఇంజిన్ సర్కారు తీరు ఇలా ఉందని వ్యాఖ్యానించింది. సంభల్‌పూర్‌లో ఈ నెల 16న జరిగిన ఈ పరీక్షకు సుమారు 8,000 మంది హాజరయ్యారు. అభ్యర్థులను అదుపు చేసేందుకు ప్రత్యేక బలగాలను రప్పిం చాల్సి వచ్చింది. సంభల్‌పూర్‌లోని ఒక ఎయిర్‌బేస్ రన్‌వేపై వారికి పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది.

## పబ్‌పై సాయుధ దుండగుల దాడి: 9 మంది మృతి




**జోహన్స్‌బర్గ్, డిసెంబరు 21:** అర్ధరాత్రి సమయంలో సాయుధులైన 12 మంది దుండగులు రెండు వాహ నాల్లో వచ్చి బీభత్సం సృష్టించారు. ఓ పబ్ లో చొరబడి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 9 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 10 మంది గాయపడ్డారు. దక్షిణాఫ్రికా లోని జొహాన్స్‌బర్గ్ వెస్ట్ ప్రాంతంలోగల బెకర్స్‌డాల్ టౌన్‌షిప్‌లో ఆదివారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దుండగులు పబ్‌లో చొరబడి ఒక్కసారి కాల్పులు మొదలు పెట్టడంతో భయాందోళనకు గురైన జనం పరుగులు తీశారు. పబ్‌లో కాల్పుల అనంతరం దుండగులు పారిపోతూ కూడా కనిపించిన వారిపై కాల్పులు జరిపారు. వీధుల్లో కూడా కాల్పులు జరుపుతూ పారి పోయారు. ఈ కాల్పుల్లో మరణించిన 9 మందిలో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారు.

## పాస్‌పోర్టు వ్యక్తిగత స్వేచ్ఛలో ఒక భాగం: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** విదేశీయానం, పాస్‌పోర్ట్‌ను కలిగి ఉండటం అనేవి భారత రాజ్యాంగంలోని అధికరణ 21 ప్రకారం వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులో భాగమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ హక్కులపై ఏమైనా ఆంక్షలను విధించాలంటే, అవి తప్పనిసరిగా న్యాయంగా, నిష్పక్షపాతంగా, సహేతుకంగా ఉండాలని చెప్పింది. చట్టబద్ధంగా ఆమోదయోగ్యమైన కారణం ఉండాలని స్పష్టం చేసింది. ఈ నెల 19న ఈ తీర్పునిచ్చింది. చట్టానికి లోబడి ఒక చోటు నుంచి మరొక చోటుకు ప్రయాణించేందుకు, జీవనోపాధి, అవకాశాలను పొందేందుకు పౌరునికి గల స్వేచ్ఛ అధికరణ 21ప్రకారం ఇచ్చిన హామీలో ముఖ్యమైన భాగమని వివరించింది. పారిశ్రామికవేత్త మహేశ్ కుమార్ అగర్వాల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ తీర్పునిచ్చింది. 2023 ఆగస్టు 28న తన పాస్‌పోర్ట్ గడువు ముగిసిందని, దానిని రెన్యువల్ చేయాలని పిటిషనర్ కోరారు. ఓ కేసులో దోషిగా ఉన్న ఆయన బెయిల్‌పై ఉన్నారు. తన పాస్‌పోర్ట్ రెన్యువల్ కోసం సంబంధిత కోర్టుల నుంచి ఆయన నిరభ్యంతర పత్రాలను పొందారు. అయినప్పటికీ రెన్యువ ల్‌ను అధికారులు తిరస్కరించారు.

## బంగ్లాలో బిఎన్‌పినేత ఇల్లు దగ్ధం: చిన్నారి సజీవదహనం



**ఢాకా, డిసెంబరు 21:** బంగ్లాదేశ్‌లో అరాచకం హద్దులు దాటుతోంది. రాజ కీయ కక్షల వల్ల ఒక పసి ప్రాణం బలవగా, ఒక కుటుంబం మొత్తం ప్రాణాపాయ స్థితిలో ఉంది. లక్ష్మీపూర్ సదర్ ఉపజిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన సంచలనం సృష్టిస్తోంది. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేత, వ్యాపారవేత్త బేలాల్ హుస్సేన్ నివాసమేలక్ష్యంగా దుం డగులు ఈ దాడికి పాల్పడ్డారు. తెల్లవారు జామున అందరూ నిద్రలో ఉన్న సమయంలో ఈ ఘాతుకం జరిగింది. దుండగులు పథకం ప్రకారం ఇంటికి ఉన్న రెండు తలుపులకు బయట నుంచి తాళం వేశారు. అనంతరం ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దీనివల్ల లోపల ఉన్న వారు బయటకు రావడానికి వీలు లేకుండా పోయింది. ఈ అగ్నిప్రమాదంలో బేలాల్ హుస్సేన్ ఏడేళ్ల కుమార్తె అయేషా అక్తర్ మంటల్లో చిక్కుకుని సజీవ దహనమైంది.

## పనికంటే తిండిపైనే శ్రద్ధ పెడుతోందని కోర్టుకెక్కిన యువకుడు

**బీజింగ్, డిసెంబరు 21:** చైనాలో ఓ యువకుడు తన మాజీ ప్రియురాలు, ఫియాన్సీని కోర్టుకీడ్చాడు. తనతో కలిసి ఉన్నప్పుడు ఆమె తిండి కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేశానని, ఆ సొమ్మంతా తిరిగిప్పించాలని కోరాడు. ఈ మేరకు కోర్టులో దావా వేశాడు. రిలేషన్ షిప్ లో ఉన్న సమయంలో పెట్టిన ఖర్చు, కొనిచ్చిన వస్తువులతో ఇరువురూ భావోద్వేగ బంధాన్ని కలిగి ఉంటారని గుర్తుచేస్తూ, ఆ సొమ్ము తిరిగివ్వమనడం సరికాదని పేర్కొంటూ పిటిషన్ కొట్టేసింది. బ్రైడ్ ప్రైస్ కింద యువకుడి తల్లిదండ్రులు ఇచ్చిన సొమ్ములో సగం తిరిగివ్వాలని మాజీ ప్రియురాలిని కోర్టు ఆదేశించింది.

# ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది

## కాలానుగుణంగా విద్యార్థులకు బోధన అందించాలి

## టిఆర్‌టిఎఫ్ 80 వసంతాల సభలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** పవిత్ర వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అందుకే తల్లిదండ్రుల తరువాత ఆచార్య దేవోభవ అంటారని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉపాధ్యాయ సంఘంగా 80 వసంతాల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియ జేస్తున్నానని, మీ ఆశీర్వాదంతో వచ్చిన ప్రజాప్ర భుత్వంలో అనేక విద్య సంస్కరణలు చేస్తున్నదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడ రేషన్(ఏపిటిఎఫ్) పేరుతో ఏర్పడి 80 సంవత్సరాలు పూర్తి చేసు కున్న తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్) ఆదివారం హైదరాబాద్‌లో విద్యా సదస్సును నిర్వహించింది. ప్రస్తు త విద్యావ్యవస్థ ఎదుర్కొం టున్న సవాళ్లు, ప్రభుత్వ పాఠ శాలల బలోపేతం, ఉపాధ్యా యుల సమస్యలు, విద్యావిధానాల్లో అవస రమైన మార్పులు, భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్య అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్య క్షులు కటకం రమేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజి రెడ్డి తెలిపారు. విద్యా సదస్సుకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సంఘం ఏర్పడి 80 వసంతాల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సంఘంలోని ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మీ ఆశీర్వాదంతో వచ్చిన ప్రజా ప్రభుత్వంలో అనేక విద్య సంస్కరణలు చేపట్టామన్నారు. ఉపాధ్యా యుల్లో ఉన్న అసహనాన్ని తొలగించడానికి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్‌లు, ట్రాన్స్ఫర్స్‌ను ఒకేసారి చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్టు గతంలో పేదలకు భూములు డబ్బులు పంచ డానికి ఉండేదని.. కానీ ఇప్పుడు ప్రభుత్వం అందించ గలిగేది విద్య మాత్రమేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో నూతన నియామకాలు, ప్రమోషన్‌లు, రిటైర్డ్ అయిన తర్వాత పెండింగ్ బకాయిలను.. మీ సమస్యలు తొలగిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో మీరు కీలక పాత్ర పోషిం చాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు బోధన అందించాలని.. అప్పుడే రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేసుకోవడానికి సంఘం అవసరమని, ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో మీ సంఘ నాయ కులు సఫలీకృతం అవుతున్నారన్నారు. విద్యలో విద్యార్థి అధ్యాపక బంధం జీవితాంతం ఉంటుందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. మీ దగ్గర విద్యానేర్చుకున్న విద్యార్థి భవిష్య త్తులో మరింత ఉపయోగపడాలని, విద్యార్థి దశలో హాస్టల్‌లో వేస్తే రేపు తల్లిదండ్రులుగా మనల్ని హాస్టల్‌లో వేస్తున్నారన్నారు. మీ పక్షాన నేను మీ గొంతు వినిపిస్తానని.. మీ సంస్థ మరింత ముందుకు పోవాలని, భవిషత్ తరాన్ని తయారుచేయడంలో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశించారు.



## మేడారం మహాజాతరకు రావాలంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆహ్వానం

### పోస్టర్‌ను విడుదల చేసిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 21:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మేడారం మహా జాతరకు రావాలంటూ ఆమెకు మేడారం మహా జాతర ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానం పలికారు. రాష్ట్రపతికి సమ్మక్క తల్లి చీరను, కంకణం, కండువా బంగారాన్ని మంత్రులు అందజేశారు. మేడారం ఘనతను, జాతర విశిష్టతను, సమ్మక్క సారాలమ్మ తల్లుల పోరాటాన్ని, త్యాగాన్ని, అభివృద్ధి పనులను మంత్రి సీతక్క రాష్ట్రపతికి వివరించారు. మేడారం జాతర విశేషాలను రాష్ట్రపతి ఆసక్తిగా విన్నారు. ఈ మహా జాతరకు వచ్చేందుకు కచ్చితంగా ప్రయత్నిస్తానని ఆమె తెలిపారు. మేడారం జాతర ఆహ్వాన పత్రికను అందజేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రులకు రాష్ట్రపతి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రులకు ఆప్యాయంగా నూతనయ వస్త్రాలను ఆమె బహూకరించారు. కాగా అంతకు ముందు ఉదయం మేడారం మహాజాతర-2026 పోస్టర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. వచ్చే యేడాది జనవరి 28 నుంచి 31 వరకు మేడారం జాతర నిర్వహించనున్నారు. దీని కోసం ఇప్పటికే ఏర్పాట్లు కొనసాగుతన్నాయి. ఈసారి భారీగా భక్తులు మేడారం మహా జాతరను వస్తారని అధికారులు భావిస్తున్నారు.

## ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షునిగా ఆర్.మోహన్‌సింగ్ నియామకం



**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త :** ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్. మోహన్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నగరంలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశం లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జాతీయాధ్యక్షులు టి.సి రాథోడ్ రిటైర్డ్ ఇంజనీర్ ఆర్ మోహన్ సింగ్ నియామకాన్ని ధ్రువీకరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్ తదితరులు అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల నుంచి సంఘ్ నాయకులు కార్యకర్తలు ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు టిసి రాథోడ్ మాట్లాడుతూ భారతదేశంలోని బంజారాలందరూ ఎన్నో సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్నారని జాతి మనుగడ కోసం అందరూ కలిసికట్టుగా ఐక్యంగా ముందుకు కదలి తండాలలో ఉన్న బంజారా ప్రజల జీవన స్థితిగతులు అసమానతలు మెరుగుపడే విధంగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ నూతన అధ్యక్షులు ఆర్ మోహన్ సింగ్ మాట్లాడుతూ తెలంగాణలో అన్ని జిల్లాలతో పాటు మారుమూల తండాలలో కూడా సేవా సంఘ్ కమిటీలు ఏర్పాటు చేసి ఉత్సవంతులైనటువంటి యువకులను భాగస్వామ్యం కల్పిస్తానని బంజారాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల సాధనకై సామాజిక రాజకీయ ఆర్థిక అసమానతలపై పోరాటం చేస్తానని అన్నారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ బంజారాల ఆర్థిక అసమానతలు రూపుమాపే విధంగా కృషి చేయాలని సంఘం జాతి ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తే తప్ప మన హక్కులు సాధించబడవని అన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర్ సీతారాం నాయక్ మాట్లాడుతూ బంజారాల గురువైనటువంటి సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15 తేదీని జాతీయ సెలవు దినంగా ప్రకటించి అధికారికంగా నిర్వహించేటట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లి కృషి చేయాలని ఈటెల రాజేందర్ ను కోరారు. అదేవిధంగా తిరుపతి లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుడు శ్రీ హాతీరాం బావాజీ మఠాన్ని బంజారాల వారసత్వ కట్టడంగా గుర్తించి అభివృద్ధి కోసం ప్రధాని దృష్టికి తీసుకెళ్లి తమ వంతు కృషి చేయాలని కోరారు. మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్ , మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాల నుండి వచ్చిన జాతీయ కార్యవర్గ సభ్యులు, సౌత్ ఇండియా అధ్యక్షులు సరోజ బాయ్ గారు, జాతీయ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తారాచంద్ నాయక్ , బాబురావు నాయక్ , ఇంటలెక్చువల్ ఫోరం ధనుంజయ నాయక్ , వాల్యానాయక్, మాజీ కార్పొరేటర్ సుమన్ , దీప్లాల్ చవాన్ , నారాయణనాయక్ రాంజీ , నిజామాబాద్ జిల్లా నాయ కులు చంద్రునాయక్, బద్య నాయక్, కామారెడ్డి జిల్లా రాజు నాయక్ , మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు పరశురాం నాయక్ , హైదరాబాద్ విష్ణు , అన్ని జిల్లాల నుంచి నాయకులు కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీని బలహీనపరచడానికి కుట్ర

### మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** దేశంలో పేదరికం, ఆత్మహత్యలను తగ్గించడంలో సహాయ పడిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామి పథకాన్ని కేంద్రం బలహీన పరుస్తోందని మాజీ ఎంపి వి.హనుమంతరావు దుయ్య బట్టారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ ఉపాధిహామి స్థానంలో విబిజి రామ్ జీ పథకం ప్రవేశపెట్టడం ద్వారా కేంద్రం పేదలకు అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. జాతీయ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ బిల్లు తీసుకురావడంపై కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ స్వాతంత్ర్యం తేకపోతే వికసిత్ భారత్ సాధ్యమయ్యేదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని నీరుగార్చిందని మహాత్మా గాంధీ పేరును తొలగించి ఆర్థిక భారాన్ని రాష్ట్రాలపై మోపుతోందని ఆరోపించారు. దేశంలో ప్రజల ఆకలి చావులు చూసి సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నరేగా పథకాన్ని ప్రవేశపెడితే 20 ఏళ్ల తర్వాత మోడీ ప్రభుత్వం రాముడి పేరుతో ఈ పథకంలో మార్పులు చేస్తోందని మండిపడ్డారు. మహాత్మ గాంధీ పేరును తొలగించి విక్షి త్ భారత్‌ను చేర్చారు. ఈ స్కీమ్ లో మార్పులు పేదలకు ప్రయోజనం చేకూర్చే బదులు వారి కి అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## స్థానిక ఎన్నికల స్ఫూర్తితో రాజ్యాధికారం సాధిద్దాం

### బిసి పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్




సదస్సులో మాట్లాడుతున్న బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికల్లో 51శాతం బీసీలు సర్పంచ్‌లుగా గెలుపొందడం శుభపరిణామమని, ఇదే స్ఫూర్తితో రాజ్యాధికారాన్ని సాధించుకుందామని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'పంచాయతీ ఎన్నికల స్ఫూర్తితో రాజ్యాధికారం సాదిద్దాం' అనే అంశంపై ఎస్. దుర్గయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి బాలగౌని బాల్‌రాజ్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల అమలుపై చిత్తశుద్ధి లేని కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలకు ఈ విజయం చెంప పెట్టులాంటిదన్నారు. బీసీలు చైతన్యవంతులయ్యారనడానికి పంచాయతీ ఎన్నికల విజయమే నిదర్శనమన్నారు. బీసీల ఐక్యతకు, బీసీ రిజర్వేషన్ల సాధనకు బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాజకీయ పార్టీలకతీతంగా బీసీ ఉద్యమాన్ని నడిపించామన్నారు. బీసీల్లో మరింత రాజకీయ చైతన్యం తీసుకొచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపడుతామన్నారు. గత బిఆర్ఎస్ పదేండ్ల పాలనలో పటేళ్లు, దొరలకు మాత్రమే రాజ్యాధికారం అప్పగించారని, బీసీలను విస్మరించారన్నారు. బిజెపి కూడా ఏనాడూ బీసీలకు మేలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బిసిలను నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు. గత పంచాయతీ ఎన్నికల్లో 22శాతం ఉన్న బిసి రిజర్వేషన్లను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం17 శాతానికి తగ్గించి బిసిలను నట్టేట ముంచిందన్నారు. అయినా, బీసీలు చైతన్యవంతమై జనరల్ స్థానాల్లో సైతం పోటీ చేసి సగానికి పైగా విజయం సాధించారన్నారు.

ఎంపీటీసీ, జడ్పిటీసీ ఎన్నికల్లో ఎస్సి, ఎస్టి, బీసీలు ఏకమై ఇదే విజయ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ యెలికట్టె విజయ కుమార్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్, బైరు శేఖర్ గంగపుత్ర, నగేశ్ ముదిరాజ్, మల్లేష్ యాదవ్, సింగం నాగేష్‌గౌడ్, దామోదర్‌గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వాలు జనం కోసమే పని చేయాలి, లేదంటే క్షమించరు

### మాజీమంత్రి నాగం జనార్దనరెడ్డి

**హైదరాబాద్ (చిక్కడపల్లి) డిసెంబరు 21, ప్రభాతవార్త :** ప్రభుత్వాలు ప్రజల కోసం పని చేయాలని, కానీ అందుకు విరుద్దంగా పనిచేస్తే ప్రజలు క్షమించరని మాజీ మంత్రి నాగం జనార్దనరెడ్డి విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన డిండి ఎత్తిపోతల పథకం, ఎర్రవల్లి ఎర్రవల్లి తాండ గ్రామాల ముంపు నివారించాలి వంటి సమస్యలపై అక్కడి ప్రజలు, రైతాంగం ఆందోళనలు చేస్తుంటే రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నిమిటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నల్గొండ జిల్లాకే మంత్రా లేక రాష్ట్రానికి మంత్రా అనేది తెలియకుండా ఉందని అసహనం వ్యక్తంచేసారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను ఆమోదించారు. సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, పాశం యాదగిరి, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, సారంపల్లి మల్లారెడ్డి, గోవర్ధన్, పృధ్వీ, రాఘవాచారి, పర్యావరణవేత్త బాబురావు, విఠల్ తది తరులు పాల్గొన్నారు. ఎర్రవల్లి ఎర్రవల్లి తాండ గ్రామాల ముంపు నివారిం చాలి. 2016లో తెంపిన గోకారం పాత చెరువును పునర్నిర్మించాలని, డిండి ఎత్తిపోతల పథకంలో నల్లగొండలోని రిజర్వాయర్లకు నాగార్జునసాగర్ లేదా బస్వాపూర్ రిజర్వాయర్ నుండి నీరు ఇవ్వాలని, పాలమూరురంగారెడ్డి పథకం నీరు కేవలం మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాలోనే ఉపయోగించాలి. ఈ నీరు ఈ జిల్లాల హక్కు అని సమావేశం డిమాండ్ చేసింది. భూముల ముంపు తగ్గించే విధంగా సమగ్ర సాగునీటి విధానం రూపొందించాలని ప్రభుత్వానికి సూచించింది. ఎర్రవల్లి, ఎర్రవల్లి తాండా రెండు గ్రామాలు ముంపు రీత్యా ఖాళీ చేయవలసి ఉంటుందని ఆర్డీఓ పేర్కొనడంతో ఆ గ్రామాల ప్రజలు తీవ్ర ఆందో ళనతో తమ గ్రామాలు, భూములు, భవిష్యత్తు కాపాడాలని నిరాహార దీక్షలు చేస్తున్నారని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో వివిధ సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, పార్టీలు బాధితులకు తమ మద్దతు ప్ర క టిం చా ల ని , బాధితులకు న్యాయం కోసం, నాగర్ కర్నూల్ జిల్లాలో గ్రామాల ముంపు నివారణ కోసం, వేల ఎకరాల భూముల ముంపు నివారణ కోసం న్యాయ సాధనకై మరింత ఉధృతంగా ఆందోళనలను చేయవలసిన సమయం ఆసన్నమైందని సమావేశం అభిప్రాయ పడింది. డిండి ఎత్తిపోతల పథకం పేరుతో జరుగుతున్న అన్యాయాన్ని ఎర్రవల్లి, ఎర్రవల్లి తాండా రైతులు తమ గ్రామాల ముంపు ఆపాలని కోరుతున్న ప్రభుత్వాలు పాటించు కోకపోవడం దురదృష్టక రమన్నారు. అందుకు అనువుగా రిజర్వాయర్ స్థాయి తగ్గించాలని అడుగుతు న్నారని సమావేశం కోరింది.




ప్రసంగిస్తున్న మాజీ మంత్రి నాగం జనార్దనరెడ్డి




## సోనియాగాంధీని ప్రశ్నించే నైతికవాక్కు బిజెపికి, కిషన్‌రెడ్డికి లేదు

### మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** ఆరు గ్యారెంటీలపై సోనియాగాంధీని ప్రశ్నించే నైతికత బిజెపికి కిషన్‌రెడ్డికి లేదని మాజీ ఎమ్మెల్యే సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ సోనియా గాంధీ కి ఆరు గ్యారెంటీల మీద లెటర్ రాసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముందు మీ ప్రధాన మంత్రి మోడికి లెటర్ రాయాలనీ డిమాండ్ చేశారు. దేశ ప్రజలతో పాటు తెలంగాణ ప్రజలకు విదేశాల్లో ఉన్న నల్లధనం తెచ్చి ప్రతి అకౌంట్ లో 15లక్షలు వేస్తా అని చెప్పి అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలైనా ఎందుకు తీసుకొని రాలేదని నిలదీశారు. సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలలో తెలంగాణ యువతకు ఎంత ఇప్పించావు దేశంలో ఎంతమందికి ఇచ్చారో తెలుపాలని కోరారు. వీటి అన్నిటి పైన మొదట మోదీ లెటర్ రాస్తే బాగుండేది ఇప్పుడు మోడీ లేఖా రాయండి అప్పుడు మేము సోనియా గాంధికి రాసిన లేఖ పైన జవాబు ఇస్తాము అని అన్నారు. సోనియా గాంధీ హామీ ఇచ్చిన మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేశామని వివరించారు, 500 లకే గ్యాస్ సిలిండర్ అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు 2500 ఇస్తామన్న హామీ త్వరలోనే అమలు చేస్తామని అన్నారు రైతు భరోసాలో 2 లక్షల రైతు రుణమాఫీ అమలు చేసాం అని చెప్పారు. వరి పంటకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని అన్నారు. వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు ఇచ్చే పథకం ప్రాసెస్ లో ఉందని తెలిపారు. కౌలు రైతులను గుర్తించే పనిలో ప్రభుత్వం ఉందని అన్నారు. గృహజ్యోతిలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామనీ, నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని పేదలు అందులో నివసిస్తున్నారని తెలిపారు. ఇండ్ల స్థలాలు లేని దగ్గర రైతుల నుండి భూమి కొని పేదలకు ఇచ్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాంరాజీవ్ ఆరోగ్య శ్రీ 10లక్షలకు పెంచి అందిస్తున్నామని తెలిపారు. వృద్దులకు 4000 రూపాయల పెన్షన్ కోసం డబ్బులు సమకూర్చుకుంటున్నామని వివరించారు.

## ఓటర్ల జాబితా సవరణలో తెలంగాణ దేశానికే మార్గదర్శకం

### సిఇసి జ్ఞానేష్‌కుమార్



**హైదరాబాద్ (రవీంద్రభారతి), డిసెంబరు 21, ప్రభాతవార్త :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్-ఎస్ఐఆర్) విషయంలో తెలంగాణ త్వరలోనే దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందని అభినందనలు తెలిపారు. ఈ విషయంలో బీహార్ ఇటీవల విజయవంతంగా పూర్తయిన ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రమాణంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జ్ఞానేష్‌కుమార్ బూత్‌స్థాయి అధికారులు బిఎస్ఓలను ఉద్దేశించి ప్రసంగిస్తూ భారత ఎన్నికల వ్యవస్థకు వీరే వెన్నెముకని, వారి నిబద్ధత, కృషిపైనే ఓటర్ల జాబితా సవరణ విజయం ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రపంచం మొత్తం భారతదేశం ఎన్నికలను ఎలా నిర్వహిస్తుందో తెలుసుకోవాలనే ఆసక్తితో గమనిస్తోందని వ్యాఖ్యానించారు. బీహార్‌లో నిర్వహించిన భారీ ఎస్ఐఆర్ ప్రక్రియ ఎలాంటి లోపాలు లేకుండా పూర్తయిందని సీఈసి వివరించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 7.5కోట్లమంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఈ మొత్తం ప్రక్రియలో ఒక్క ఫిర్యాదు కూడా నమోదు కాకపోవడం, రీపోలింగ్, రీకౌంటింగ్ అవసరం లేకపోవడం విశేషమన్నారు. అందుకు బిఎస్ఓలను ఆయన అభినందించారు. కెనడాకంటే తెలంగాణ విస్తీర్ణం పెద్దదన్న జ్ఞానేష్‌కుమార్ సమగ్ర ఓటర్ల జాబితా సవరణ పూర్తయిన తర్వాత రాష్ట్రంలో ఎన్నికల పరిపాలన కొత్తయుగంలోకి అడుగుపెడుతుందని చెప్పారు. బిఎల్ఓలతో జరిగిన చర్చలో పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉండానికి పట్టణ ఓటర్ల నిరాసక్తతే ప్రధాన కారణమన్నారు. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు ఉత్సాహంగా క్యూలైన్లలో నిలబడి ఓటుహక్కును వినియోగిస్తూ దేశానికి దారి చూపుతున్నారని వ్యాఖ్యానించారు. దేశంలో ఎన్నికలు దేశచట్టాల ప్రకారమే నిర్వహించ బడతాయని, ఎన్నికల చట్టాలను ప్రతీఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి ముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి తన పరిచయ ప్రసంగంలో రాష్ట్రానికి సంబంధించిన కీలక గణాంకాలను సవివర పరిచారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్లల సంఖ్య, జిల్లాలు, ఎమ్మెల్యే, ఎంపీ నియోజకవర్గాలు తదితర వివరాలను ప్రస్తావించారు. ఈ సమా వేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వరరెడ్డి, జీహెచ్ ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్, సీనియర్ డిప్యూటీ సీఈసీ పవన్‌కుమార్‌శర్మ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం 'క్రిస్మస్' వ్యాఖ్యలపై బిజెపి ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 21:** తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి నిన్న క్రిస్మస్ వేడుకల్లో చేసిన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం రేగింది. ఈ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంతకీ రేవంత్ రెడ్డి ఏమన్నా రంటే... ఇవాళ క్రిస్మస్ వేడుకలను తెలంగాణ రాష్ట్రంలో చేసుకుంటున్నామంటే అందుకు సోనియాగాంధీ చేసిన త్యాగాలే కారణమని అన్నారు. తెలంగాణ ఏర్పా టులో సోనియాగాంధీ ముఖ్య పాత్ర పోషించారని, డిసెంబరు నెల తెలంగాణకు ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. సోనియా పుట్టింది ఈ నెలలోనే, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది ఈ నెలలోనే అని వ్యాఖ్యానించారు. దీనిపై తెలంగాణ బీజేపీ స్పందించింది. గాంధీ కుటుంబం వల్లే తెలంగాణలో సూర్యుడు ఉదయిస్తాడేమోనని కూడా చెబుతారేమో అని వ్యంగ్యం ప్రదర్శించింది. పొగడ్తలకు కూడా ఓ హద్దు ఉంటుందని, క్రిస్మస్ వేడుకలను కూడా సోనియాకు ఆపాదించడం సరికాదు అని తెలంగాణ బీజేపీ పేర్కొంది.

బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ స్పందిస్తూ... ఓ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. సోనియా ఏరోజూ హిందూ విశ్వాసాలపై నమ్మకం చూప లేదని, ఆమె ఇప్పటికీ క్రైస్తవ మతాన్నే అనుసరిస్తున్నారని తెలిపారు.

యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు తన నివాసంలో క్రిస్మస్ వేడుకలు జరిపారే కానీ, దీపావళి జరపలేదని ఆరోపించారు. బీజేపీ నేత రాజ్ పురోహిత్ స్పందిస్తూ... ఏసుక్రీస్తు త్యాగాలతో సోనియాను పోల్చడం పిచ్చికి పరాకాష్ఠ అని విమ ర్శించారు.

## బిజెపి 12 యేళ్ల, కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై చర్చకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సిద్ధమా?

### కెసిఆర్, హరీశ్‌రావు తప్పిదాల వల్లే జలవివాదాలు

### కెసిఆర్ అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నాం: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్




**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** బిజెపి 12గా కేంద్రంలో చేస్తున్న పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలపనపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చర్చకు సిద్ధమా అంటూ పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సవాల్ చేశారు. గాంధీభవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి చేసింది ఏమిటో ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. యేడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బిజెపి హామీ ఇచ్చినా, 12 ఏళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు కల్పించిన దాఖలాలు లేవని విమర్శించారు. తెలం గాణలోని కాంగ్రెస్ పాలనపై కిషన్‌రెడ్డి సోనియా గాంధీ లేఖ రాయడం విడ్డూరమని అన్నారు. సోనియా గాంధీ ప్రశ్నించే స్థాయి కిషన్‌రెడ్డికి లేదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణపై అడుగడుగున కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తున్న ప్రధాని మోదీపై ఒత్తిడి తెచ్చే సత్తువలేని కిషన్‌రెడ్డికి, సోనియా గాంధీకి లేఖ రాసే నైతిక హక్కు లేదని చెప్పారు బడ్జెట్ కేటాయింపుల నుంచి అన్ని రంగాల్లో కేంద్రం తెలంగాణపై పక్షపాతం చూపుతోందని అన్నారు. బిసి రిజర్వేషన్లు, మెట్రో రైలు ప్రాజెక్టు, మూసీ నది సుందరీకరణ, రాష్ట్రంలో కేంద్ర విద్యా సంస్థల స్థాపన వంటి కీలక అంశాల్లో మోదీ ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు కిషన్ రెడ్డికి కనిపించడం లేదా? అనిఆయన ప్రశ్నిం చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన అఖండ విజయాలే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని తెలిపారు. కెసిఆర్ ప్రజా జీవితంలో ఉంటే సంతోషమేనని ప్రతిపక్షనేతగా అసెంబ్లీకి రావాలని కూడా కోరుకుంటున్నామని మహేష్ కుమార్ తెలిపారు. పంచాయతీ ఎన్నికలలో మేం 70శాతం గెలిచామని ఈ ఎన్నికలలో బిఆర్ఎస్ ఎక్కడుందని ప్రశ్నించారు. కెసిఆర్ హరీశ్‌రావు తప్పిదాలతోనే నది జలాల సమస్య ఏర్పడిందని వృథా ప్రాజెక్టుల కోసం అనవసరపు ఖర్చులు చేశారని ఆరోపించారు.

# ఈ ఆర్థికంలో రాబడి రూ.24 వేల కోట్లు తగ్గుదల!

## కొత్త బడ్జెట్‌పై దృష్టి.. 2026-27కు శాఖల వారీగా ఫోకస్

## 2025-26లో రూ.2.60 లక్షల కోట్లకు పరిమితం

## కేంద్ర, రాష్ట్ర ఆదాయంపై ఆర్థిక శాఖ తర్జనభర్జన

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** వచ్చే 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వానికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేసుకోవడంపై ఆర్థికశాఖ శ్రద్ధ పెట్టింది. కొత్త బడ్జెట్‌ను వచ్చే ఫిబ్రవరి లేదా మార్చి నెలలో శాసనసభలో ప్రవేశపెట్టాలని ఉద్దేశ్యంతో ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ శాఖలకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసి, తమ ప్రతిపాదనలు సమర్పించమని ఆర్థికశాఖ ఆహ్వానించింది. అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు వచ్చిన తర్వాత, ప్రభుత్వం ఆదాయ లక్ష్యాలపై తుది పరిణామాలు, మార్పులను వచ్చే 2026-27 బడ్జెట్‌లో ప్రతిబింబింపజేయనుంది. ప్రస్తుత 2025-26 బడ్జెట్ ప్రకారం మొత్తం ఆదాయం రూ.2.84 లక్షల కోట్లుగా ఉండాలి, కానీ మార్చి నాటికి ఇది రూ.2.60 లక్షల కోట్ల వరకు పరిమితం కావచ్చని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ శాఖల నుండి ప్రతిపాదనలు అందిన తర్వాత, సంబంధిత శాఖల కార్యదర్శులు, మంత్రులతో కలిసి ఆర్థికశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ కేటాయింపుల అంచనాలపై సమీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రస్తుత ఏడాది పన్నుల వసూళ్లపై ప్రతిపాదనలు అందిన తర్వాత, శాఖల కార్యదర్శులు, మంత్రులతో కలిసి ఆర్థికశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ కేటాయింపుల అంచనాలపై సంబంధిత శాఖల వారీగా సమీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక అంశాలపై ఆ శాఖ అధికారులు దృష్టిసారించారు. ప్రధానంగా పన్నుల వసూళ్ల విషయమై పునరాలోచన చేస్తున్నారు. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక శాఖ బడ్జెట్‌లో ప్రభుత్వం పన్నుల ద్వారా రూ.1.75 లక్షల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేసింది. ఇందులో భాగంగా ఇప్పటివరకు రూ.1 లక్ష కోట్లకు పైగా వసూళ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మార్చి నాటికి పన్నుల వసూళ్లు బాగా పెరగవచ్చని అంచనా. కాగా మార్చి నెలాఖరు వరకు రూ.2.60 లక్షల కోట్ల ఆదాయం సాధ్యమా అనేదానిపై ఆర్థిక శాఖ తర్జన భర్జనలు పడుతోంది. ఇందులో భాగంగా గతేడాది 2024-25 ఆర్థిక సంవత్సరం కన్నా ప్రస్తుత 2025-26లో 10 శాతం ఎక్కువ పన్నుల వసూళ్లు సాధించమని ప్రభుత్వ ఖజానాకు ఆదాయం తెచ్చిపెట్టే ప్రధాన శాఖలను ఆదేశించింది. 2024-25లో పన్నుల ద్వారా లక్ష్యంగా పెట్టిన రూ.1.64 లక్షల కోట్లకు చివరికి రూ.1.40 లక్షల కోట్లు మాత్రమే సాధించగలిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత 2025-26లో రూ.1.75 లక్షల కోట్ల లక్ష్యానికి చేరే అవకాశం ఉన్నప్పటికీ, మార్చి నాటికి సాధ్యమైన వసూళ్లు రూ.2.60 లక్షల కోట్ల పరిధిలోనే ఉండవచ్చని ఆర్థిక శాఖ సీనియర్ అధికారులు తెలిపారు. కాగా గ్లోబల్ సమిట్, మూసీ పునరుజ్జీవం, ప్రాంతీయ వలయ రహదారి(ఆర్ఆర్ఆర్) వంటి ప్రాజెక్టుల కారణంగా రియల్ ఎస్టేట్ రంగం పెరుగుతుందని, దీనివల్ల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పన్ను వసూళ్లలో గణనీయమైన పెరుగుదల రానుందని అధికారులు భావిస్తున్నారు. ఇదే సమయంలో ప్రస్తుత ఆర్థికంలో పన్నేతర ఆదాయం, కేంద్రం నుండి అందుకునే గ్రాంట్లను కలిపి రూ.53 వేల కోట్లకుపైగా రావచ్చని బడ్జెట్‌లో అంచనా. అయితే ఇప్పటివరకు వాటిలో కేవలం రూ.11 వేల కోట్ల మాత్రమే కేంద్రం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో కొత్త బడ్జెట్‌లో ఈ వసూళ్లను పెంచాలా, లేక ఇంతే స్థాయిలో కొనసాగించాలా అనే చర్చ జరుగుతోంది.



## రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం

### హాజరైన గవర్నర్, సిఎం, మంత్రులు, నేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, డిసెంబరు 21:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆధ్వర్యంలో సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆదివారం సాయంత్రం ఎట్ హోం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు డిప్యూటీ సిఎం ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్,సీతక్క కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో బిజెపి,కాంగ్రెస్ ఎంపీలు,ఎమ్మెల్యేలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అతిథులతో ఆత్మీయంగా మాట్లాడారు.

## కొండెక్కిన కోడి గుడ్డు

### రూ.8కి చేరిన ఆల్‌టైమ్ రికార్డ్ ధర

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** కోడి గుడ్ల ధరలు కొండెక్కాయి. వీటి ధరలు భారీగా పెరగడంతో వినియోగదారులు గుడ్లు తేలేస్తున్నారు. ఇంత భారీగా పెరగడం పౌల్ట్రీ చరిత్రలోనే అత్యధికమని చెబుతున్నారు. కొద్ది నెలల క్రితం బహిరంగ మార్కెట్లో గుడ్డు ధర 5 నుండి 6 రూపాయలు ఉండగా, ఇప్పుడది 8 రూపాయలకు చేరింది. హోల్‌సేల్ మార్కెట్లో అయితే ఒక్కో కోడి గుడ్డు ధర 7.30 రూపాయలు పలుకుతోంది. గతంలో 30 కోడి గుడ్లు 160 నుండి 170 రూపాయల వరకూ విక్రయించేవారు. గత పది రోజులుగా 30 కోడి గుడ్లు 210 నుండి 220 రూపాయల ధరకు అమ్ముతున్నారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నాటు కోడి గుడ్డు అయితే రెట్టింపు చేసి అమ్ముతున్నారు. ఒక్కొక్కో నాటు కోడి గుడ్డు 15 రూపాయల వరకూ విక్రయిస్తున్నారు. కాగా డిమాండ్‌కు తగినట్లు గుడ్ల సరఫరా లేకపోవడంతో వీటి రేట్లు పెరిగాయని పౌల్ట్రీ వ్యాపారులు చెబుతున్నారు. గతంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి రోజుకు దాదాపు 8 కోట్ల కోడి గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. అయితే కోళ్ల ఫారాలకు అవసరమైయ్యే మక్కలు, చేప పొట్టు, దాణా తదితర వాటి ధరలు పెగడంతో పలువురు పౌల్ట్రీ వ్యాపారులు కోళ్ల ఫారాలను నిలిపివేశారు. దీంతో గుడ్ల ఉత్పత్తి తగ్గిపోయింది.



## తొలి టి-20 మ్యాచ్‌లో భారత్ మహిళలు అదుర్స్

### ఎనిమిది వికెట్లతో శ్రీలంక మహిళా జట్టు ఓటమి

**విశాఖపట్టణం, డిసెంబరు 22:** మహిళల ఐదు టి20 సిరీస్‌లో భాగంగా భారత జట్టు తొలి సిరీస్‌ను విజయంతో ఆరంభించింది. విశాఖపట్టణంలో షురూ అయిన వన్‌డే ఛాంపియన్ టోర్నీలో తొలిమ్యాచ్‌లోనే భారత మహిళలు అదరగొట్టారు. జెమీమా రోడ్రిగ్స్69 నాటౌట్‌గా క్లాస్ ఇన్నింగ్స్‌తో చెలరేగి శ్రీలంకను చిత్తుగా ఓడించింది. స్మృతి మంధాన25తో హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో విజయానికి బాటలు వేసింది. మంధాన ఔటైనా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15 నాటౌట్‌తో కలిసి కూల్‌గా ఆడిన జెమీమా టీమిండియాను 8 వికెట్లతో గెలిపించింది. మరో 5 ఓవర్లు మిగిలి ఉండగానే ప్రత్యర్థిని మట్టికరిపించిన భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో 10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. స్వదేశంలో ఇటీవలే వన్డే ప్రపంచకప్ పట్టేసిన టీమిండియా టీ20 వరల్డ్‌కప్ సన్నద్ధతను ఘనంగా ఆరంభించింది. శ్రీలంకతో విశాఖలో జరిగిన తొలి టీ20లో భారత్ భారీ విజయం సాధించింది. మొదట శ్రీ చరణి1-30, క్రాంతి గౌడ్1-23లు లంకను 121కే కట్టడి చేశారు. అనంతరం స్వల్ప ఛేదనలో షఫాలీ వర్మ9 విఫలమైనా స్మృతి మంధాన 25 తన స్టయిల్లో రెచ్చిపోయింది. ఈ ఫార్మాట్లో 4 వేల క్లబ్‌లో చేరిన మంధాన కాసేపటికే రణవీర ఓవర్లో సిక్సర్‌కు యత్నించి వెనుదిరిగింది. దాంతో రెండో వికెట్‌కు జెమా రోడ్రిగ్స్69 నాటౌట్‌తో నెలకొల్పిన 54 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15 నాటౌట్ తో కలిసి జట్టును గెలుపు దిశగా నడిపించింది జెమీమా. గిమ్మాని వేసిన 12వ ఓవర్లో రెండు ఫోర్లతో అర్థ శతకం పూర్తి చేసుకున్న ఆమె చివరి రెండు బంతుల్ని బౌండరీకి తరలించింది. రణవీర వేసిన 15వ ఓవర్లో జెమీమా సింగిల్ తీయగా 8 వికెట్ల తేడాతో టీమిండియా గెలిచింది. సిరీస్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక ఇన్నింగ్స్ నత్త నడ కన సాగింది. ఓపెనర్లు విష్మీ గుణరత్నే39, చమరి ఆటపట్టు 15,శుభా రంభ మిచ్చిన ఆ తర్వాత బ్యాటర్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు. శ్రీ చరణి1-30, క్రాంతి గౌడ్1-23లు పొదుపుగా బౌలింగ్ చేయడంతో బౌండరీలు రాబట్టేందుకు లంక బ్యాటర్లు తిప్పలు పడ్డారు. హాసిని పెరేరా20, హర్షిత మాధవి21లు కీలక భాగస్వామ్యంతో లంక స్కోర్ వంద దాటింది. చివరిలో కవిష దిల్హరి మాత్రమే8 పరుగులతో రాణించారు. నిర్ణీత ఓవర్లలో లంక 6 వికెట్ల నష్టానికి 121 పరిమితం అయింది.

## రాష్ట్ర కాటన్ అసోసియేషన్ డైరెక్టర్‌గా రవీందర్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్ర కాటన్ అసోసియేషన్ అసోసియేట్ డైరక్టర్‌గా బొమ్మినేని రవీందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సిఎండి లలిత్ కుమార్‌గుప్తా, కాటన్ అసోసియేషన్ సభ్యులు వినయ్, రమేశ్, తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు. దీన్ని పురస్కరించుకుని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 15న రాష్ట్ర కాటన్ అసోసియేషన్ నుండి అసోసియేట్ డైరక్టర్‌గా ఎన్నికైన నేపథ్యంలో ముంబైలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)లో బాధ్యతలను తీసుకున్నట్లు తెలిపారు.

## రామడుగు మండలం హత్య కేసులో ఐదుగురు నిందితుల అరెస్ట్

**కరీంనగర్, ప్రభాతవార్త, డిసెంబరు 21:** రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గాదె అంజయ్య (36) అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో తండ్రి, భార్యే సుపారీ ఇచ్చి అంజయ్యను హత్య చేయించినట్లు విచారణలో తేలింది. ఈ దారుణానికి పాల్పడిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీపూర్ నివాసి గాదె లచ్చయ్య (63) తన కోడలు శిరీషతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడు. 2017లో ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన అంజయ్య, 2019లో తిరిగి వచ్చిన తర్వాత తండ్రి, భార్యల మధ్య ఉన్న సంబంధాన్ని చూసి వారిని మందలించాడు. దీనితో తమ సాన్నిహిత్యానికి అడ్డుగా ఉన్న అంజయ్యను వదిలించుకోవాలని తండ్రి, భార్య పథకం వేశారు. నేరుగా చంపితే అనుమానం వస్తుందని భావించిన లచ్చయ్య, అదే గ్రామానికి చెందిన కొలిపాక రవి సహాయంతో సుపారీ గ్యాంగ్‌ను సంప్రదించాడు. రవి తన బంధువైన ఉప్పరపల్లి కోటేశ్వర్, అతని స్నేహితుడు మహమ్మద్ అబ్రార్‌లకు అంజయ్యను చంపేందుకు రూ. 3 లక్షల ఒప్పందం కుదుర్చుకున్నాడు. అంజయ్యతో స్నేహం పెంచుకున్న కోటేశ్వర్, అబ్రార్‌లు గత కొన్ని రోజులుగా అతనితో కలిసి మద్యం సేవించేవారు. ఈ నెల 2న మద్యం తాగుదామని అంజయ్యను ఊరి చివర కెనాల్ సమీపంలోకి పిలిచారు. అక్కడ అతనికి అమితంగా మద్యం తాగించి, మత్తులోకి జారుకున్న తర్వాత కోటేశ్వర్ గొంతు నులమగా, అబ్రార్ చేతులు పట్టుకుని అంజయ్యను హతమార్చారు. నిందితుడు రవి దగ్గరుండి ఈ విషయాన్ని లచ్చయ్యకు చేరవేశాడు. సాక్ష్యాలను మరుగుపరచడానికి చీకటి పడిన తర్వాత మృతదేహాన్ని డీ8 కెనాల్‌లోకి తోసేశారు. ఈ నెల 5న కాలువలో శవం దొరకడంతో, ప్రమాదవశాత్తు పడి చనిపోయాడని నమ్మించేందుకు నిందితులు ప్రయత్నించారు. అయితే, పోలీసుల లోతైన విచారణలో లచ్చయ్య, శిరీషల ప్రవర్తనపై అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజం బయటపడింది. గాదె లచ్చయ్య (మృతుడి తండ్రి), గాదె శిరీష (మృతుడి భార్య), ఉప్పరపల్లి కోటేశ్వర్ (సుపారీ హంతకుడు),మహమ్మద్ అబ్రార్ (సుపారీ హంతకుడు), కొలిపాక రవి (మధ్యవర్తి)లను అరెస్టు చేసిఫోన్లు, బైక్, రూ. 40,000 నగదు స్వాధీనం చేసుకున్న పోలీస్ అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

## కులాలవారీగా సర్పంచ్, వార్డు సభ్యుల వివరాల సేకరణ

### రాష్ట్ర బిసి కమిషన్ నిర్ణయం

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇటీవల కొత్తగా ఎన్నికైన పంచాయితీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు సంబంధించి కులాల వారీగా వివరాలను సేకరించాలని రాష్ట్ర బిసి కమిషన్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో బిసి విభాగాలను ఏర్పాటు చేసే దిశగా తీసుకున్న చర్యల్లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో బిసి కమిషన్ ఛైర్మన్ జి నిరంజన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 343 విభాగాలు ఉండగా, వాటిలో 333 విభాగాల నుండి ఉద్యోగుల కులాల వివరాలు తమకు అందినట్లు తెలిపారు. ఇంకా రావాల్సిన 10 ప్రభుత్వ విభాగాల్లో 8 ఫైనాన్స్ శాఖకు సంబంధించినవి కాగా, మరో 2 విభాగాలు మున్సిపల్ పరిపాలన శాఖకు సంబంధించినవని వెల్లడించారు. ఈ ప్రభుత్వ విభాగాల నుండి కుల వివరాలు రావడంల జాప్యం జరుగుతున్నందున బిసి కమిషన్ తలపెట్టిన ఉద్యోగుల వివరాలు రాష్ట్ర విశ్లేషణకు సంబంధించి మరింత సమయం పడుతుందన్నారు. కాగా రాష్ట్రంలో సంచార జాతులను నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం జారీ చేస్తున్న కుల ధృవీకరణ పత్రాలలో చేయాల్సిన మార్పులను కూడా సూచించనున్నట్లు తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

### ప్రభాకర్‌రావును నేరుగా విచారించనున్న సిటీ కొత్వాల్ సజ్జనార్

### రెండో రోజు విచారణలో సిట్ బృందం కీలక ఆధారాల సేకరణ

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు లో పోలీసు కస్టడీలో వున్న మొదటి ముద్దాయి నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావును సిటీ కొత్వాల్ సజ్జన్నార్ విచారించనున్నారు. ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించి రెండవ దఫాగా ఏర్పడ్డ సిట్‌కు సజ్జన్నార్ బాస్‌గా వుండడం తెలిసిందే. ఈ బృందంలో ఆయనతో పాటు గతంలో ఈ కేసును కొం తకాలం విచారించిన సిద్దిపేట్ కమిషనర్ (అప్పట్లో పశ్చిమ మండల డిసిపిగా వున్నారు) విజయ్ కుమార్ వుండగా ఆయనతో పాటు రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మాదాపూర్ డిసిపి రితిరాజ్ సహా మరో ఐదుగురు అధికారులు సభ్యులుగా వుండడం విదితమే. ఈ బృందంలోని కొందరు ప్రభాకర్ రావును శనివారంతో పాటు ఆదివారం కూడా విచారించారు. రెండవ రోజైన ఆదివారం నాడు ఆరు గంటలకు పైగా ప్రభాకర్ రా వును సిట్ బృందం విచారించినట్లు తెలిసింది. రెండవ రోజు విచారణలో ప్రభాకర్ రావు నుంచి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కీలక ఆధారాలు సి ట్ బృందం సేకరించినట్లు తెలిసింది. కాగా సిటీ కొత్వాల్ సజ్జన్నార్ సోమవారం లేదా మంగళవారం నాడు ప్రభాకర్ రావును నేరుగా జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో లేదా కమాండ్ కంట్రోల్‌లో విచారించనున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు ప్రభాకర్ రావును విచారించిన అధికారుల్లో ఐపిఎస్‌లు వున్నా వారంతా ఆయనకన్నా జూనియర్లు కావడం, నాన్ ఐపిఎస్ అధికారులు కిందిస్థాయి వారు కావడంతో ఆయన విచారణలో తలబిరుసుగా వ్య వహరించినట్లు సమాచారం. అయితే సజ్జన్నార్ ప్రభాకర్ రావుకంటే ఐపిఎస్ హోదాలో సీనియర్ కావడంతో ఫోన్ ట్యాపింగ్ విచారణలో కచ్చితంగా కీలక విషయాలు వెలుగు చూసే వీలుంది. ఇతర అధికారులతో వ్యవహరించినట్లుగా తలబిరుసుగా, ఇష్టం వచ్చినట్లుగా సజ్జన్నార్‌తో ప్రభాకర్ రావు వ్యవహరించే అవకాశాలు లేవని చెప్పాలి. ఇప్పటి వరకు వున్న సమాచారం ప్రకారం ప్రభాకర్ రావును ఒకటి లేదా రెండు రోజుల పాటు సజ్జన్నార్ స్వయంగా విచారించే వీలుంది. ప్రభాకర్ రావు కస్టడీ విచారణ ఈ నెల 25వ తేదీతో ముగియనుండడంతో ఈలోపు విచారణ త్వరగా ముగించాల ని సిట్ బృందం భావిస్తున్నట్లు తెలిసింది.

## ఆస్పత్రి వార్డుల్లో ఆహారం తింటే కఠినచర్యలు!

### ఐసియులు, ఆపరేషన్ థియేటర్ల వద్ద ఇనుప జాలీలు, సీలింగ్‌ల ఏర్పాటు

### మంత్రి దామోదర్ ఆదేశాలతో మార్గదర్శకాలు జారీ చేసిన డిఎంఇ

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** ఇకపై ఆసుపత్రి వార్డుల్లో ఎలా పడితే అలా వ్యవహారించకుండా ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. ఆసుపత్రి వార్డుల్లో ఆహారం తింటే కఠిన చర్యలు తప్పవు. ఆసుపత్రి సిబ్బంది, రోగుల సహాయకులకు నిర్ధేశిత ప్రదేశాల్లో భోజన వసతి ఏర్పాట్లు, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్ల వద్ద ఇనుప జాలీలు, సీలింగ్‌లను ఏర్పాటు చేయనున్నట్టు మార్గదర్శకాలను జారీ చేసింది. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ అసుపత్రులలో నిర్ధిష్టమైన విధానాల అమలుకు డీఎంఈ మార్గదర్శకాలు జారీ చేశారు. మంత్రి అదేశాల మేరకు అన్ని ప్రభుత్వ అసుపత్రులలో పారిశుధ్యం, భద్రత, ముఖ్యంగా ఎలుకలు, కీటకాల నియంత్రణ కోసం ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఐహెచ్‌ఎఫ్ఎం) విధానాన్ని మరింత పటిష్టం చేస్తూ వైద్య విద్య డైరెక్టర్ (డిఎంఈ) డాక్టర్ నరేంద్ర కుమార్ మార్గదర్శకాలను జారీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణాల్లో ఎలుకల సమస్యను పూర్తిగా అరికట్టేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎలుకల సమస్య తలెత్తడానికి ప్రధాన కారణం నిర్దేశించిన ప్రదేశాల్లో కాకుండా వార్డుల వద్దే ఆహారం వండటం, నిల్వ చేయడం, భుజించడమేనని అధికారులు గుర్తించారు. రోగుల సహాయకులు మిగిలిపోయిన ఆహారాన్ని బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం, తెరిచి ఉన్న మురుగు కాలువలు ఎలుకల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఆసుపత్రి భవనాల పగుళ్లు, రంధ్రాలను పటిష్టమైన మెటీరియల్‌తో మూసివేయాలని ఆదేశించారు. ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, లేబర్ రూమ్‌లలో ఎటువంటి ఖాళీలు లేకుండా చర్యలను చేపట్టాలని సూచించారు. కిటికీలు, వెంటిలేటర్లు, డ్రైనేజీ పైపులు, సర్వీస్ డక్ట్‌లకు నాణ్యమైన ఇనుప జాలీలను అమర్చాలని అసుపత్రుల భాద్యులను సూచనలు జారి చేశారు. వార్డుల్లో రోగుల సహాయకులు ఆహారం వండుకోవడాన్ని, తినడాన్ని కఠినంగా నిషేధిస్తూ. భోజనాలను కేవలం నిర్దేశించిన ప్రదేశాలలో పరిమితం చేయాలని నిబంధనలను కఠిన తరం చేయడం జరిగింది. అన్ని వార్డులలో మూత ఉన్న చెత్త డబ్బాలను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్యం పాటించేలా బహుభాషా సూచికలు, మైకుల ద్వారా రోగులకు, వారి సహాయకులకు నిరంతరం అవగాహన కల్పించాలని కోరారు. లైసెన్స్ పొందిన ఏజెన్సీల ద్వారా నిర్ణీత కాలవ్యవధులలో ఎరలు వేయడం, బోన్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు నిరంతరం కొనసాగాలని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీ(హెచ్ఐసిసి) చర్యలను పర్యవేక్షిస్తూ పెస్ట్ కంట్రోల్ లాగ్‌బుక్‌ను నిర్వహించాలన్నారు. పారిశుధ్య సిబ్బంది ఎలుకల ఉనికిని గుర్తిస్తూ అధికారులకు ఎప్పటికప్పుడు నివేదిస్తారు. అత్యంత కీలక విభాగాలైన ఐసీయూలు, ల్యాబ్‌లు, వంటశాలల బాధ్యతను ఆయా యూనిట్ హెడ్లు, సూపరింటెండెంట్లు వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రోగుల ఆరోగ్య భద్రత విషయంలో ఎటువంటి నిరక్ష్యాన్ని సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినచర్యలు తప్పవని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు.

## సనాతన ధర్మానికి ప్రతీక నాగఫణిశర్మ

### కన్నుల పండువగా సాగిన 'గురు సత్కారం'లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, డి.సిఎం భట్టి ప్రశంస

### ధార్మికవరేణ్య, అవధాన శకపురుష పురస్కారాలు ప్రదానం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), డిసెంబరు 21, ప్రభాతవార్త:** సుమధురగళం, సుస్వరమైన గాన మాధుర్యం ఎవ్వరిలో చూడలేదని, ఏభాషవారైనా ఆయన గొంతుకు ఆకర్షితులవు తారని, అందులో కట్టిపడేసే శక్తి ఉందని, హిందూ సనాతనధర్మం, ఆధ్యాత్మికం, శక్తితో కూడిన భావన, ప్రజాచైతన్యం నాగఫణిశర్మ కంఠంలో ప్రజ్వరిల్లుతుందని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. నాగఫణిశర్మ కవిత్వం, గానం, అవధానంలో ఆధ్యాత్మికత, ధర్మం, సనాతనధర్మం, దేశభక్తి, జాతీయభావజాలం, సమాజాన్ని చైతన్యం చేసే సందేశం కనిపిస్తుందన్నారు. తెలుగు సాహితీవనంలో అద్భుతమైన మణిదీపం పద్మశ్రీ డా. మాడుగల నాగఫణిశర్మ అన్న తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సరస్వతీ కటాక్షధారి అయిన ఆయన తెలుగుభాషకు దక్కిన వరం అన్నారు. అవధాన కళను పునరుజ్జీవింపజేసిన మహనీయుడన్నారు. ఆయన్ను సత్కరించుకోవడమంటే తెలుగుజాతికే ప్రత్యేకమైన ప్రక్రియ అవధాన విద్యను సత్కరించుకున్నట్లే అన్నారు. తెలుగువారందరికీ గర్వకారణమన్నారు.

నాగఫణిశర్మ అవధానం వింటున్నప్పుడెల్లా ఆనాటి భారతప్రధాని పి.వి.నరసింహారావు వారితో అవధానంలో పాల్గొని పృచ్ఛికలుగా ప్రశ్నలు వేయడం, వీరి అవధానానికి సంతోషించిన సంగతి గుర్తుకొస్తుంద న్నారు. ఆయన్ను సత్కరించే అవకాశం చాలా అదృష్టం, ఆనందంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక మాసపత్రిక దర్శనమ్ అధ్యర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఆదివారం రాత్రి దర్శనమ్ 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన గురుసత్కార మహోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, విశిష్ట అతిథులు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టువిక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, బిజెపి రాష్ట్రాధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, మాజీ గవర్నరు, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు, గౌరవ అతిథులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, జెడి వి.వి.లక్ష్మీనారాయణ, సినీగేయ రచయిత జొన్నవిత్తుల, దోర్బల ప్రభాకరశర్మ, దర్శనమ్ సంపాదకుడు మరుమాముల వెంకటరమణశర్మ (ఎంవిఆర్.శర్మ), దత్తాత్రేయశర్మ, దక్షిణామూర్తి తదితరులతో కలిసి బృహత్ ద్విసహస్రావధాని, గొప్ప కవి, మహామనీషి పద్మశ్రీ బ్రహ్మశ్రీ డా. మాడుగుల నాగఫణిశర్మ దంపతులకు మంగళవాయిద్యాల మధ్య కన్నులపండువగా పూర్ణకుంభ స్వాగతంతో పూల పల్లకీసేవ, పాదపూజ, స్వర్ణకంకణ ప్రదానం, పుష్పాభిషేకంలతో గురుసత్కారం... ధార్మికవరేణ్య బిరుదు, అవధాన శకపురుష అవార్డు, జీవన సాఫల్య పురస్కారం ప్రదానంచేసి నమస్సుమాంజలి సమర్పించారు. అనంతరం దర్శనమ్ విశేష ప్రత్యేక సంచికతోపాటు పలు ప్రత్యేక సంచికలను ఆవిష్కరించారు. సభకు ఎం.వి.ఆర్.శర్మ స్వాగతోపన్యాసంలో దర్శనమ్ ప్రస్థానాన్ని, కార్యక్రమ నేపథ్యాన్ని, డా. మాడుగుల నాగఫణిశర్మ జీవిత విశేషాల గురించి సవివరపరిచారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు, శ్రీధర్‌బాబు, దత్తాత్రేయ, గరికపాటి నరసింహారావు తదితరులు తమతమ అభిప్రాయాలు, శుభాభినందనలు తెలిపారు.



నాగఫణిశర్మ దంపతులకు గురుసత్కారం చేస్తున్న కిషన్‌రెడ్డి, భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు, దత్తాత్రేయ, గరికపాటి, ఎంవిఆర్.శర్మ, రామచందర్‌రావు, లక్ష్మీనారాయణ, దక్షిణామూర్తి తదితరులు

## 'మహాలక్ష్మి'లకు ప్రత్యేక కార్డులు


>> అందించిన సహకారంతో సంస్థకు కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. అంతేకాక బస్ డిపోల ఏర్పాటు, బస్ స్టేషన్‌ల అభివృద్ధికి ప్రజాప్రభుత్వం సహకారం అందిస్తోందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటుగా సంస్థ స్వతహాగా నూతనంగా ఆదాయా మార్గాలను అన్వేషించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఆర్టీసీలో మహాలక్ష్మీ పథకం కింద ఇప్పటి వరకు 255 కోట్ల ఉచిత ప్రయాణాలు జరగాయి. మహాలక్ష్మీ పథకం వల్ల మహిళా సాధికారత దిశగా అడుగులు పడుతున్నట్లు ఆయన అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీలో పీఎఫ్ బకాయిలు రూ.1400 కోట్లు ఉండగా.. ప్రజాప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రూ. 660 కోట్లకు తగ్గించినట్లు ఆయన చెప్పారు. అలాగే సీసీఎస్ బకాయిలు గతంలో రూ.600 కోట్లు ఉండగా ప్రజాప్రభుత్వం వచ్చాక రూ.373 కోట్లకు తగ్గించినట్లు తెలిపారు. ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం కోసం సెంట్రల్ ఫర్ గుడ్ గుడ్ గవర్నెన్స్‌తో ఒప్పందం చేసుకొని ప్రత్యేక కార్డులు పంపిణీ చేయాలని అధికారులను బట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ కార్డులు తెలంగాణలోని ప్రతి మహిళకు చేరాలని అధికా రులకు ఆయన సూచిం చారు. దీంతో బస్సులో టికెట్ ఇవ్వాల్సిన అవసరం ఉండదన్నారు. ఆర్టీసీలో పీఎం ఈ డ్రైవ్ కింద హైదరాబాద్‌లో 2800 ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని వీటికి చార్జింగ్ స్టేషన్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పీఎం ఈ డ్రైవ్ కింద నిజామాబాద్ వరంగల్ పట్టణాలకు 100 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫామ్స్,బుక్స్, షూస్ పంపిణీ చేయాలని అందుకు సంబధించిన నిధులు విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ సుల్తానియాను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశించారు.

నాయి బ్రాహ్మణ, రజకకుల సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్తుకు సంబంధించిన బకాయిలు లేకుండా చూస్తూ నెల వారిగా ఎప్పటికప్పుడు విడుదల చేయాలని అధికారులు ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.ప్రజాప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధను తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఒకేసారి వంద ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేసిందని చెప్పారు. గతంలో ఎంజేపిలో 327 గురుకులాలకు కేవలం 26 గురుకులాలకు మాత్రమే సొంత భవనాలున్నాయని చెప్పారు. ప్రజాప్రభుత్వం వంద ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు కార్పొరేట్ తరహాలో భవనాలను నిర్మిస్తోందని అన్నారు. గురుకులాల స్కూల్ అద్దె కోసం మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీల కోసం రూ.152 కోట్లు విడుదల చేశారని చెప్పారు. గీత వృత్తిదారుల రక్షణకు ఇప్పటి వరకు 30 వేల కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ చేసినట్లు తెలిపారు, కాగా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పోస్టుల నియామకాలకు అనుమతి ఆర్థిక శాఖ నుంచి అనుమతి ఇవ్వాలన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా కోరారు. అదేవిధంగా మార్చ్ 2026 వరకు 3233 కండక్టర్ పోస్టులు అవసరం ఉండగా తాత్కాలికంగా నియామకాలు జరపడంతో పాటు 50 శాతం రెగ్యులర్ నియామకాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. వాటితో పాటు చీఫ్ అకౌంట్ ఆఫీసర్ పోస్టులకు అనుమతి ఇవ్వాలని కోరారు. అంతేకాక డ్రైవింగ్ లైసెన్స్‌ల జారిలో ఉన్న ఇబ్బందులు తేలెత్తకుండా యూజర్ ఛార్జీలకు అనుమతి ఇవ్వాలని కోరారు.రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచడానికి కొత్త వాహనాలకు అనుమతి ఇవ్వాలని ,టాక్స్ కలెక్షన్ కోసం ట్యాబ్‌లు మంజూరు చేయాలని కోరారు.

# శేషాచలంకొండలకు జీవనాడి 'దివ్యఔషధ వనం'

## రూ.4.25కోట్లతో 3.90ఎకరాల్లో ఏర్పాటు

**తిరుమల,డిసెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలకొండలకు మరో మణిహారం చేరనుంది. భారతీయ సాంప్రదాయ వైద్యానికి ప్రాణంపోసే ఔషధమొక్కల సంరక్షణ లక్ష్యంగా తిరుమలలో "దివ్యఔషధవనాన్ని" ఏర్పాటుచేయాలని టిటిడి నిర్ణయించింది. తిరుమలలో జిఎన్‌సి టోల్‌గేట్‌కు సమీపంలో దిగువ,ఎగువ ఘాట్‌రోడ్లకు మధ్యలో ఉన్న 3.90 ఎకరాల స్థలంలో ఈ విద్యఔషధవనం అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్వయం నిర్ణయంతో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రణాళికలు సిద్ధం చేశారు. 2026 జనవరిలో పనులు ప్రారంభించి మొక్కలను పెంచనున్నారు. భక్తుల సందర్శనకు వీలుగా పార్కింగ్, మౌళిక సదుపా యాలు

ఏర్పాటుచేసి 2026 చివరికి పూర్తి స్థాయిలో ఔషధవనాన్ని అందుబాటులోకి తీసుకు రానున్నారు.

4.25కోట్ల రూపాయల అంచనాతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు టిటిడి బోర్డు ఆమోదం తెలిపింది. అరుదైన, జీవపరి ణామం ఉట్టిపడే శేషాచలం అడవుల్లో అంతరించిపోతున్న ఔషధమొక్కలకు నిలయంగా ఉన్న జీవనాడి దివ్యఔషధవనం ఏర్పాటుచేసేందుకు టిటిడి సంకల్పించింది. ఔషధమొక్కలను సంరక్షిస్తూ ప్రజలకు పరిచయం చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం. దీనిద్వారా పర్యావరణ పరిరక్షణ,జీవ వైవిధ్య సంరక్షణ లక్ష్యాలకు దివ్య ఔషధ వనం తోడ్పడనుంది. దక్షిణభారత దేశంలోనే ఈ తరహాలో రూపొందించనున్న ఔషధవనం భక్తులు, పరిశోధకులు, విద్యార్థులు ప్రకృతి ప్రేమికులకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

**భక్తి విజ్ఞానం ప్రకృతి సమ్మేళనం**

తిరుమలలో టిటిడి ఏర్పాటుచేయనున్న దివ్య ఔషధవనంలో దేహ చికిత్స వనం, సుగంధ వనం, పవిత్రవనం, ప్రసాద వనం, పూజాద్రవ్య వనం, జీవరాశివనం, కల్పవృ క్షధామం, ఔషధకుండి, మూలికావనం, విశిష్టవృక్ష వనం, ఔషధమొక్కలు వంటి 13రకాల ప్రత్యేక థీమ్ ఆధారిత విభాగాలు ఏర్పాటు చేయనున్నారు. ఇవి భక్తులకు ఆధ్యా త్మిక అనుభూతిని కలిగించడమేగాక ఔషధ విజ్ఞానం, ప్రకృతిపై అవగాహనను పెంపొందించనున్నాయి.

# తిరుపతిలో అధునాతన బస్ టెర్మినల్

## పాతబస్టాండు స్థానంలోనే అద్భుతంగా ఇంటెగ్రేటెడ్ భవనం నిర్మాణానికి కసరత్తు



**తిరుపతి,డిసెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** కొన్ని దశాబ్దాల క్రిందట అప్పటి తిరుమల యాత్రికుల అవసరాలకు అనుగుణంగా తిరుపతినగరంలో నిర్మితమైన సెంట్రల్ ఆర్టీసి బస్టాండు ఇప్పటి భక్తుల రద్దీకి ,విపరీతంగా పెరిగిన ప్రయాణీల సేవలకు తగ్గట్లు లేకపోవడంతో అధునాతన నూతన ఇంటిగ్రేటెడ్ బస్టాండు టర్మినల్ నిర్మాణం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పదిసంవత్సరాల క్రిందట ప్రతిపాదనలు ఇప్పుడు అమలులోకి వస్తుండటంతో దీనిపై కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. సుమారు 500 కోట్ల రూపాయలు వ్యయంతో గ్రౌండ్‌ఫ్లోర్‌తోబాటు 10 అంతస్థులతో తిరుమల ఆలయ నమూనా తరహాలో ఈ ఆర్టీసి బస్టాండు ఇంటిగ్రేటెడ్ టర్మినల్ నిర్మాణం చేయాలని ఆమోదించారు. తిరుపతి స్మార్ట్‌సిటీ, అంతర్జాతీయ ఖ్యాత ఉట్టిపడేలా అధునాతనంగా బస్‌స్టేషన్ నిర్మాణం పనులు మొదలుకానున్నాయి. ప్రస్తుతం 60వేలమంది ప్రయాణీకులతో ,50వేలమంది వరకు యాత్రికులతో నిత్యం రద్దీగా ఉండే తిరుపతి సెంట్రల్ బస్టాండు (ఏడుకొండలు బస్టాండ్, శ్రీహరిబస్టాండు, శ్రీనివాసాబస్టాండ్) నుండి తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, పాండిచ్చేరి రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆర్టీసిబస్సులతోబాటు తమిళనాడు, కర్నాటక ,పాండిచ్చేరి రాష్ట్రాల ఆర్టీసి బస్సులు తిరుపతికి వస్తున్నాయి. ఇక్కడకు వస్తున్న ప్రయాణీకుల సౌకర్యం తోబాటు అన్ని రకాల వాణిజ్యసముదాయాలకు నిలయంగా ఇంటిగ్రేటెడ్ బస్టేషన్ అభివృద్ధి చేసేందుకు డిపిఆర్ సిద్ధమైంది. బస్‌టర్మినల్ నుండి కూతవేటు దూరంలో ఉన్న రైల్వేస్టేషన్‌కు స్కైవే ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటుకానుంది. 13ఎకరాల్లో ఉన్న తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రస్తుతం 70వరకు ప్లాట్‌ఫామ్‌లతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సుసర్వీసులతో నిండిపో తోంది. ఈ బస్‌స్టేషన్ నుండి తిరుమలకు నేరుగా రోడ్డుసౌకర్యం ఉంది. తిరుపతి విమానాశ్రయంకు కూడా నూతన ఫ్లైఓవర్ నిర్మాణం జరగనుంది. ఈ నిర్మాణ పనులను నేషనల్ హైవేస్ ఆథారిటీ ఆఫ్ ఇండియా చేపట్టనుంది. నూతన టర్మినల్‌లో గ్రౌండ్‌ఫ్లోర్‌లో అన్ని ప్రాంతాలకు వెళ్ళే బస్సుప్లాట్‌ఫామ్‌లు, మొదటి అంతస్థుల నుండి ప్రయాణీకులకు సదు పాయాలు, వాణిజ్యసముదాయాలు, హోటళ్ళు, ఆర్టీసి కార్యాలయాలు,డార్మిటరీలు,డ్రైవర్ల విశ్రాంతి గదులు, ప్రవేశ,నిష్క్రమణ ద్వారాలు ఉంటాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని 3లక్షలమంది వరకు ప్రయాణీలకు సరిపోయేలా ,మరో నాలుగు దశాబ్దాల వరకు ఇబ్బంది లేకుండా ఈ అధునాతన ఇంటిగ్రేటెడ్ బస్టాండు నిర్మాణం జరగనుంది. ప్రస్తుతం ఇతరరాష్ట్రాల నుండి బస్టాండుకు వస్తున్న ఆర్టీసి బస్సులతోబాటు తిరుపతి,చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుండి వచ్చే గ్రామీణ ప్రాంతాల ఆర్టీసి బస్సులను తాత్కాలిక బస్టాండులు మంగళం, బైరాగిపట్టెడ,తిరుచానూరుసమీపం, మూవడ మైలు ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని నిర్ణయిస్తున్నారు. ఈ స్థలాలను ఇప్పటికే ఆర్టీసి ఉన్నతాధికారులు పరిశీలించారు.

# అలిపిరిలో బ్రీత్ అనలైజర్లతో తనిఖీ

## రూ.8 లక్షల విలువైన పరికరాలు అందజేత



**తిరుమల,డిసెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన తిరుమల పుణ్యక్షేత్రానికి మద్యం సేవించి కొండెక్కాలని చూస్తే ఇకపై అలాంటి ఆటలు సాగనీయకుండా తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రంలో బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీచేసేందుకు టిటిడి ,తిరుపతి పోలీసులు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇందుకు అవసరమైన బ్రీత్ ఎనలైజర్లను టిటిడి తిరుపతి పోలీసులకు అందజేసింది. తొలివిడతలో 20 బ్రీత్‌ఎనలైజర్లు అందజేయగా వీటిల్లో నాలుగు అలిపిరి తనిఖీ కేంద్రానికి, మరో నాలుగు తిరుమలకు అందించారు.మిగిలిన 12 వాటిని తిరుపతిలో ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు. తిరుమలను పవిత్రక్షేత్రంగానే భావించి భక్తులు, స్థానికులు, కార్మికులు పవిత్రతను కాపాడటానికి ఇతోధికంగా సహకారం అందించాలి. అయితే కొన్ని సందర్భాల్లో కార్మికులు, స్థానికులు ,యాత్రికులు కూడా మద్యం సేవించి మత్తులో కొండకు ఆర్టీసి బస్సుల్లో, ట్యాక్సీల్లో వచ్చేస్తున్నారు. ఇలా తోటి భక్తులకు కూడా తీవ్ర ఇబ్బందికలిగిస్తున్నారు. దీనిపై ఇప్పటికే టిటిడికి అందిన ఫిర్యాదులతో తగిన చర్యలకు ఉపక్రమించింది. యాత్రికులను అలిపిరి తనిఖీ కేంద్రంలో తిరుమలలో జిఎన్‌సి టోల్‌గేట్‌లో తనిఖీ చేసేందుకు బ్రీత్ ఎనలైజర్లు పరికరాలు అందజేశారు. ఆదివారం ఉదయం టిటిడి ఇఒ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఒ కెవి మురళీకృష్ణ, అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, శ్రీనివాసులు, డిఎస్పీలు రామకృష్ణమాచారి, విజయశేఖర్, సిఐలు హరిప్రసాద్, సంజీవకుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు. తిరుమల పోలీసులకు, తిరుపతి ట్రాఫిక్ పోలీసులకు ఇఒ సింఘాల్,ఎస్పీ సుబ్బరాయుడు స్వయంగా అందజేశారు. ఘాట రోడ్లలో రోడ్డుప్రమాదాల నివారణ, భక్తుల భద్రతకు టిటిడి చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా మద్యంసేవించి బండి నడిపేవారినేగాక కొండెక్కేవారిని పట్టుకునేందుకు ఇవి ఉపయోగిస్తారు. తొలిరోజే ఆదివారం సాయంత్రం అలిపిరి టోల్‌గేట్‌లో వీటిని ఉపయోగించారు. కాగా బ్రీత్‌ఎనలైజర్ల పనితీరును స్వయంగా ఎస్పీ సుబ్బరాయుడు ఇఒకు వివరించారు.

# రాజ్యాంగ సూత్రాల మేరకే వ్యవహరించాలి

## జిల్లా న్యాయవ్యవస్థకు ఉత్తమస్థానం కల్పించిన రాజ్యాంగం: 'సుప్రీం' జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా



ప్రసంగిస్తున్న జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

**విజయవాడ, డిసెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే భారత న్యాయ వ్యవస్థ అతి పెద్దదని సుప్రీమ్ కోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. అనేక దేశాల రాజ్యాంగాల కంటే ఉత్తమ లక్షణాలను కలిగి ఉందన్నారు.న్యాయ వ్యవస్థకు జిల్లా న్యాయ వ్యవస్థ మూల స్థంభం అని అన్నారు. జ్యుడిషియల్ అకాడమీలో నిర్వహించిన రాజ్యాంగ దృక్కోణం జిల్లా న్యాయ వ్యవస్థ పాత్ర (అప్ హోల్డింగ్ ద కానిస్టిట్యూషనల్ విజన్ ద రోల్ ఆఫ్ డిస్ట్రిక్ట్ జూడీషియరీ) అనే సెమినార్ లో సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలక ఉపన్యాసం చేశారు. న్యాయ వ్యవస్థలో ప్రతి అంశంలో రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాలకు అనుగుణంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. క్లిష్టమైన పరిస్థితుల్లోనూ ప్రశాంతంగా, స్థైర్యంగా ఉండాలని సూచించారు. రాజ్యాంగంలో జిల్లా న్యాయ వ్యవస్థకు ఉత్తమ స్థానం కల్పించడం జరిగిందన్నారు. ఉత్తమ న్యాయం అందించడమే న్యాయ వ్యవస్థ ప్రధాన విధిగా గుర్తించాలని సూచించారు. సామాన్యునికి న్యాయం చేరువ కావడానికి న్యాయ వ్యవస్థ పనితీరు మీద ఆధారపడి ఉంటుందని అన్నారు. న్యాయ స్థానంలో జరిగే విచారణ సామాన్యునికి సైతం అర్థం కావాలని, అప్పుడే న్యాయ వ్యవస్థపై విశ్వాసం, నమ్మకం పెరుగుతుందని చెప్పారు. న్యాయ వ్యవస్థ చట్టానికి, గౌరవానికి వారధిగా పనిచేయాలని అందుకు న్యాయ మూర్తులుగా విలువలు, బాధ్యతలు పాటించాలని, మంచి క్రమశిక్షణ, న్యాయ పరిజ్ఞానం కలిగి ఉండాలని ఉద్బోధించారు. పోటీ తత్వంలో విజయం సాధించే దిశగా ప్రతి న్యాయ మూర్తి తయారు కావాలని, రోజు రోజుకు పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీ పాట్రన్ ఆఫ్ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జిల్లా న్యాయవ్యవస్థ న్యాయవ్యవస్థలోకే ముఖ్యమైనదని అన్నారు. జీవించే హక్కు కలిగి ఉండడం అంటే వ్యక్తి జీవించడం ఒకటే కాదని, మంచి జీవనాన్ని గడిపే హక్కు కలిగి ఉండటం అని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థ పనితీరులో ఏమాత్రం అశ్రద్ధ ఉన్న అధికరణ 14,15 ప్రకారం న్యాయాన్ని సక్రమంగా వెలువరించడం సాధ్యం కాదని అన్నారు. రాజీలేని న్యాయ వ్యవస్థను నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. రాజ్యాంగాన్ని సక్రమంగా పరిరక్షి ంచుకోవడమే రాజ్యాంగానికి ఇచ్చిన విలువ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తి , జ్యుడిషియల్ అకాడమీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షులు జస్టిస్ రవినాథ్ తిల్హారి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి వ్యక్తికి పౌర హక్కులు ఇచ్చిందన్నారు. వీటిని జిల్లా న్యాయ వ్యవస్థ పటిష్టంగా రక్షణ కల్పించాలన్నారు. మహిళలు, చిన్నారులు పై వచ్చే వివాదాలు చాలా మేరకు సున్నితమైనవని సరైన ప్రక్రియ ద్వారా పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలోనే స్పష్టమైన విధానాన్ని అవలంబించడం ద్వారా కేసుల పరిష్కారంలో రాజ్యాంగ మార్గదర్శకాల మేరకు చేయవచ్చని చెప్పారు. రాజ్యాంగ పీఠికలో ప్రతి పౌరునికి ఆర్థిక, సామాజిక, సౌభ్రాతృత్వం వంటి అంశాలను కల్పించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ చింతలపూడి పురుషోత్తం కుమార్, హై కోర్టు న్యాయమూర్తులు, జిల్లా ప్రధాన న్యాయ మూర్తులు, రాష్ట్రంలో వివిధ జిల్లాలో పనిచేస్తున్న న్యాయ అధికారులు పాల్గొన్నారు.

# రైల్లో 7 కేజీల గంజాయి పట్టివేత: ఇద్దరు అరెస్టు

**సింగరాయకొండ, డిసెంబరు 21, ప్రభాత వార్త:** రైల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం ఉదయం సింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఈగల్ టీం సిబ్బంది ఒంగోలు నుంచి సింగరాయకొండ వరకు బొకారో ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం నుంచి చెన్నైకి గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 6.770 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న గంజాయితో కలిసి ఒంగోలు జీఆర్‌పీ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఒంగోలు జీఆర్‌పీ సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ యు.సుధాకర్ ఆధ్వ ర్యంలో ఎస్సైలు సుదర్శన్, చెంచయ్య, శివరామయ్య, జీఆర్‌పీ ఎస్సై కే.మధుసూదన్ రావు, ఏఎస్ఐ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



మళ్లీ అధికారంలోకి రాగానే

# చేపట్టాల్సిన కార్యక్రమాలపై జగన్‌కు స్పష్టత

## వైసిపి రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

**విజయవాడ,డిసెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధినేత జగన్ తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఎంత మేలు చేయాలో అంతా చేశారని, మళ్లీ అధికారంలోకి రాగానే చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా ఆయనకు స్పష్టమైన ప్రణాళిక ఉందని ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలో జరిగిన జగన్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి, అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలు జగన్ వెంటే ఉంటారని సజ్జల ధీమా వ్యక్తం చేశారు. "ప్రజలకు మేలు చేసేది జగన్ ఒక్కరేనని కోట్లాది మంది నమ్ముతున్నారు. అందుకే తన ఐదేళ్ల పాలనలో అందరికీ మేలు చేశారు. ఏదో ఆశించి ఆయన సహాయం చేయరు. తన వల్ల ప్రజలకు ఎంత మంచి జరుగుతుందనే నిత్యం ఆలోచిస్తారు" అని తెలిపారు. ఓదార్పు యాత్ర సమయంలోనూ, కరోనా కష్టకా లంలోనూ జగన్ ప్రజలకు అండగా నిలిచిన తీరును సజ్జల గుర్తుచేశారు.

జగన్ ఏనాడూ పబ్లిసిటీ కోరుకోలేదని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి కాలనీలు సృష్టించారని, 17 మెడికల్ కాలేజీలు, పోర్టులు, హార్బర్లు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ప్రచారం చేసుకోలేదని అన్నారు. చంద్రబాబు తన 18 నెలల పాలనలోనే రూ.2.70 లక్షల కోట్లు అప్పు చేశారని, కానీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఆర్థికవేత్తలే ఆశ్చర్యపోయేలా జగన్ తన ఐదేళ్ల పాలనను సాగించారని సజ్జల ప్రశంసించారు.

# ఎపి మహిళలకు మరో పథకం

## సిద్ధమవుతున్న ప్రభుత్వం

**విజయవాడ,డిసెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు ఏపీ ప్రభుత్వం మరో మంచికబురు తెలిపింది. స్వయం సహాయక సంఘాలకు మరో కీలక బాధ్యతలను అప్పగించనుంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతోంది. అలాగే పలు కోర్సుల్లో వారికి ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి కల్పిస్తోంది. ఈ క్రమంలో వారి కోసం మరో పథకం ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఏపీలోని ప్రభుత్వ స్కూళ్లల్లో మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉంది. ఈ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్మార్ట్ కిచెన్ల బాధ్యతలను మహిళా సంఘాలకు అందించనుంది.వంట వండటమే కాకుండా ప్యాకింగ్, సమయానికి భోజనం పంపించడం, వ్యర్థాల నిర్వహణ వంటి బాధ్యతలను మహిళలకు ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్రంలోని కడప, జమ్మలమడుగు వంటి ప్రాంతాల్లో స్మార్ కిచెన్లను మహిళా సంఘాలకు అప్పగించడంతో సక్సెస్ అయింది. దీంతో త్వరలో మరో 33 స్మార్ట్ కిచెన్ల బాధ్యతలను కూడా వారిని ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

ఇక మహిళా సంఘాల ఆధ్వర్యంలో నేచురల్ ఫార్మింగ్ కూరగాయలు పండిస్తున్నారు. వీటిని మధ్యాహ్న భోజనం పథకానికి ఉపయోగించనున్నారు. మహిళా సంఘాలు పండించిన కూరగాయలు మధ్యాహ్న భోజన పథకంకు సరఫరా చేయడం వల్ల వారికి ఆదాయం లభిస్తుంది. అలాగే సేంద్రీయ వ్యవసాయంపై మహిళా సంఘాలకు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఇందుకు మండల సమాఖ్యలు సహాయం చేయనున్నాయి. ఆర్గానిక్ కూరగాయలు మధ్యాహ్న భోజన పథకంలో ఉపయోగించడం వల్ల పిల్లలకు పోషక విలువలు కూడా పెరగనున్నాయి. అంతేకాకుండా మహిళలకు ఉపాధి కూడా లభించనుంది.

# తిరుమల సమాచారం

## 2,129మంది చిన్నారులకు పోలియో చుక్కలు

**తిరుమల,డిసెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో చుక్కలు వేసే కార్యక్రమం తిరుమలలో విజయవంతమైంది. శ్రీవారి దర్శనంలోభాగంగా తిరుమలలో పలుచోట్ల 0-5ఏళ్ళలోపు పిల్లలతో వచ్చిన యాత్రికులను గుర్తించి 2,129మందికి టిటిడి వైద్యఆరోగ్యసిబ్బంది పోలియోచుక్కలు వేశారు. ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నిరంతరాయంగా 25 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయించేలా సిబ్బంది చూశారు.అలిపిరి నుండి కాలినడకమార్గాల్లో, తిరుమల ఆలయం



వరకు పలుకేంద్రాలను నిర్వహించారు.




## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మనసు సంతోషం

**తిరుమల,డిసెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు సంతోషం కలిగిస్తుందని ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివ్‌ప్రతాప్ దంపతులు, ఏపి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జైసూర్య, జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్, జస్టిస్ శ్యామ్‌సుందర్‌లు ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఎపిలో ఇక కేరళ తరహా జలవిహారం

## విజయవాడ బెర్మ్ పార్కు నుంచి పవిత్ర సంగమం వరకు

## సూర్యలంక బీచ్ బ్యాక్‌వాటర్‌లో కూడా... రాత్రి బోటులోనే బస

## అక్టోబరుకల్లా అందుబాటులోకి విలాసవంతమైన పడవలు

**విజయవాడ,డిసెంబరు 21,ప్రభాతవార్త ప్రతినిధి:** పర్యాటక రంగంలో కీలక ముందడుగు పడింది.విజయవాడ బెర్మ్ పార్కు సూర్యలంక బీచ్ బ్యాక్ వాటర్‌లో పర్యాటకుల కోసం ఐదు అల్ట్రా లగ్జరీ బోట్లు నడిపేందుకు ప్రైవేటు ఆపరేటర్లు ముందుకొచ్చారు. వీరికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రాథమిక అనుమతులిచ్చింది. రెండు చోట్లా ఐదు జెట్టీలు నిర్మించడంతో పాటు బోట్లకు విద్యుత్ సౌకర్యం సంస్థ కల్పించనుంది. ఐదు బోట్లకు సంబంధించిన డ్రాయింగ్‌లకు ఇన్‌లాంట్ వాటర్ వేస్ అథారిటీ అనుమతులు ఆపరేటరుల తీసుకొని బోట్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. 2026 అక్టోబరు నాటికి బోట్లు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో కేరళ తరహాలో నదులు,సముద్రం బ్యాక్ వాటర్‌లో పర్యాటకుల కోసం విలాసవంతమైన పడవలు(అల్ట్రా లగ్జరీ బోట్లు) ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా నడిపించేందుకు కూటమి ప్రభుత్వం ఏడాదిగా ప్రయత్నిస్తోంది. అందుకోసం ఆసక్తి గల సంస్థలను ఆహ్వానించింది. కేరళలో ఇప్పటికే ఈ తరహా సేవలు అందిస్తున్న ఒక సంస్థ ఏపీకి చెందిన మరొకరితో కలిసి ఉమ్మడి భాగస్వామ్యం కింద బెర్మ్ పార్కు నుంచి పవిత్ర సంగమం వరకు రెండు బోట్లు నడిపేందుకు ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి



20 కిలోమీటర్ల మేర సర్వే కూడా చేశారు. ఒక బోటులో ఐదు పడక గదులు,వంద మందికి సరిపడా కాన్ఫరెన్స్ హాలు ఉంటుంది. మరో బోటును 200 మంది డిన్నర్ చేసేందుకు వీలుగా డిజైన్ చేయనున్నారు. రాత్రుల్లో భవానీ ద్వీపం వద్ద బోట్లు నిలిపేలా అక్కడో జెట్టీ,విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారు.బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ బ్యాక్ వాటర్‌లో నాగరాజు కెనాల్ నుంచి నిజాంపట్నం వరకు మూడు బోట్లు ప్రైవేటు సంస్థలు నడపనునానయి. ఒక బోటులో 9,మరో బోటులో 3,ఇంకో బోటులో 2 పడక గదులు ఉంటాయి. బ్యాక్ వాటర్‌లో దాదాపు 30 కిలోమీటర్ల మేర బోటులో ప్రయాణించవచ్చు. మార్గమధ్యంలో సుందరమైన ప్రాంతాలను కూడా గుర్తించారు.విశాఖ తీరంలో రాజమహేంద్రవరం,కాకినాడలో గోదావరి నదిలో, నాగార్జునసాగర్‌లోనూ అల్ట్రా డీలక్స్ బోట్లు ప్రైవేటు ఆపరేటర్లతో నడిపేలా పర్యాటకాభి వృద్ధి సంస్థ ఫీజబులిటీ సర్వేచేస్తోంది. ఈ ప్రక్రి య పూర్తయ్యాకఆసక్తిగల సంస్థలను ఆహ్వానిస్తారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

## ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు

## ఒంగోలులో జరిగిన ఎబివిపి రాష్ట్ర మహాసభకు హాజరు




**ఒంగోలు, ప్రభాతవార్త:** ఒంగోలు పట్టణంలో జరుగుతున్న అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) 44వ రాష్ట్ర మహాసభల సందర్భంగా 3వ రోజు శ్రీజనమంచి గౌరీజీ యువపురస్కారం కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఒరిస్సా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు విచ్చే శారు. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నూజిళ్ళ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సభలో రాష్ట్ర కార్యదర్శి శ్రీ యాగంటి గోపి, పురస్కార గ్రహీత మదనపల్లికి చెందిన వెల్ విషర్ స్వచ్ఛంద సేవా సంస్థ శ్రీ గిరీష్ నల్లగుట్ట, రాష్ట్ర మహా సభల స్వాగత సమితి అధ్యక్షులు శివారెడ్డి పాల్గొన్నారు. నూజిళ్ళ శ్రీనివాస్ జనమంచి గౌరీ శంకర్ స్ఫూర్తిదాయక జీవితం గురించి ప్రస్తావన చేశారు. ముఖ్య అతిధి చేతుల మీదుగా పురస్కారం అందజేయబడింది. ముఖ్య అతిధిగా విచ్చేసిన శ్రీ కంభంపాటి హరిబాబు ఏబీవీపీ కార్యకర్తలను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. గౌరిజీ జీవితం నుండి సేవ చేసే లక్షణాన్ని అలవర్చుకోవాలి అన్నారు. గౌరీజీ పేరు మీద సేవా సంస్థల నిర్వాహకులకు అవార్డు ఇవ్వడం అభినందనీయమన్నారు. యువతకు దిశానిర్ధేశం చేస్తూ డిగ్రీలతో పాటు నైపుణ్యాలు అలవర్చుకోవాలి అన్నారు. నూతన విద్యా విధానం అమలు సమాజంలో మంచి ప్రయోజనాలు అందిస్తుందన్నారు. ఈశాన్య రాష్ట్రాలతో ఇతర ప్రాంతాలకు సంబంధాలు మెరుగు పరచడంలో దేశ సమైక్యతను బలోపేతం చేయడంలో ఏబీవీపీ ప్రారంభించిన సీల్ ప్రాజెక్ట్ కీలక పాత్ర వహించింది అన్నారు. విద్యార్థులు ఇక్కడ పర్యటించిన విషయాన్ని గుర్తు చేశారు. అభివృద్ధి పథంలో నడుస్తూ ప్రపంచ వ్యాప్తంగా విశ్వ గురు స్థానంలో ఉన్న భారతదేశంలో నేడు యువత అధికశాతం ఉండటం ప్రయోజనకరమని అయితే నేడు ప్రధాన సమస్యగా మారిన డ్రగ్స్ వినియోగంపై యువత విద్యార్థులు పోరాడాలని అన్నారు. ఇందుకు సంబంధించి మంచి కార్యక్రమాలని రూపొందించి విద్యార్థులలో యువతలో డ్రగ్స్ పట్ల వ్యతిరేకతకు అవగాహన కలిగించాలని ఏబీవీపీ కార్యకర్తలను మార్గదర్శనం చేశారు. తిరుపతికి చెందిన డాక్టర్ లక్ష్మీనారాయణ సంచాలకత్వంలో సాగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఏబీవీపీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జి రావులపల్లి నాగేంద్ర యాదవ్ పాల్గొన్నారు. కంభంపాటి హరిబాబుతో పూర్వ పరిచయం ఉన్న అనేక మంది మిత్రులు, కార్యకర్తలు వారిని కలిసి జ్ఞాపకాలు పంచుకొన్నారు.

# ఎపి కాంగ్రెస్ చీఫ్ షర్మిలకు జగన్ థ్యాంక్స్

**విజయవాడ,డిసెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల కూడా తన సోదరుడికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని ట్వీట్ చేశారు. షర్మిల ట్వీట్ కు జగన్ స్పందించారు. థాంక్యూ షర్మిలమ్మ అంటూ రిప్లయ్ ఇచ్చారు. జగన్ స్పందనతో వైసీపీ అభిమానులు ఆనం దంతో పొంగిపోతున్నారు. గత కొంతకాలంగా జగన్, షర్మిల మధ్య విభేదాలు తెలిసిందే. ఈ నేపథ్యంలో జగన్ పుట్టినరోజు సందర్భంగా షర్మిల శుభాకాంక్షలు తెలపడం, జగన్ కూడా షర్మిలమ్మ



అంటూ స్పందించడం అభిమానులను ఆనందానికి గురిచేసింది.

## తిరుప్పావై

### 7వ పాశురము



కీశుకీశెన్దెంగుమ్ ఆనై చ్చాత్తన్,
కలన్దు
పేశిన పేచ్చరవమ్ కేట్టిలైయో
పేయెప్పెణ్ణే
కాశుమ్ పిఱప్పుమ్ కలకలప్ప
కైపేర్తు,
వాశనఱుంగుళల్ ఆయిచ్చియర్,
మత్తినాల్
ఓశైప్పడుత్తత్తయిరరవమ్
కేట్టిలైయో !
నాయగప్పెణ్ పిళ్ళాయ్ !
నారాయణన్ మూర్త్తి,
కేశవన్నైపాడవుమ్ నీకేట్టే
కిడత్తియో
తేశముడైయాయ్! తిఱవేలో
రెమ్బావాయ్

పగలు గూట్లో ఉండబోమని తెలిసిన భరద్వాజ పక్షులు కీచుకీచుమని ఒకదానితోనొకటి మాటలాడుచున్న ధ్వని వినవస్తున్నది. గోపికలు పెరుగు చిలుకుతున్నప్పుడు వాని చేతి గాజులు మరియు ఆభరణముల చప్పుడు విని పిస్తూ మరియు పూలతోనున్న కొప్పుముడి విడివడుటచే సువాసన అంతటా వ్యాపించుచున్నది. కేశియను రాక్షసుని చంపిన సర్వ పదార్థములయందు లోపల మరియు వెలు పల వ్యాపించియున్న కృష్ణరూపమున అవతరించిన ఆ సర్వేశ్వరుని కీర్తించుచున్న ధ్వని వినవస్తున్నది. లోపలనున్న గోపికను పిచ్చిపిల్లాయని, నాయకు రాలాయని బ్రహ్మతేజస్సు కలదానా అని పొగడుతు తెల్లవా రిందని తెలుపుతూ తలుపుతీసి తమతో కలవమని వెలుపల నున్న గోపికలు మేల్కొలుపుతున్నారు. ఫలం :"తేజస్సు, వర్చస్సు కలుగుతుంది"

కొందరు చూసిన వాళ్లంతా ఇళ్లు వేశామేట్ అంటున్నారే మధ్య చాలా ఇబ్బందిగా ఉంటుంది. తక్కువ తింటున్నా, బరువెలా పెరుగుతున్నానో తెలియక, ఏం తినాలో కూడా అర్థం కావడంలేదు అంటారు. అలాగని తినడం మానొద్దు అంటున్నారు నిపుణులు. శరీరానికి శక్తితోపాటు కడుపునిండిన భావన ఇచ్చేలా కెలోరీలు తక్కువగా ఉన్న. బరువు సమస్య లేని ఆహారాలను ఎంచుకోమని సూచిస్తున్నారు.

## కేలరీలు తక్కువైతే బరువు తక్కువే!

రోజువారీ ఆహారంలో బూడిదగుమ్మడి, కీరదోస, దోస, బీరకాయ, ముల్లంగివంటి కూరగాయ లుంటే తక్కువ కెలోరీలు అందుతాయి. వీటిలో పీచు, నీటిశాతం ఎక్కువ అలాగే టొమాటో, రెడ్‌ప్పిక్యకమ్ వంటి సిట్రస్ జాతికి చెందినవి కూడా తక్కువ క్యాలరీలనే ఇస్తాయి. బరువు పెరగకుండానూ వేస్తాయి. కెలోరీలెక్కువ లేకుండా తేలికగా జీర్ణ మయ్యే ఆకు కూరల్లో ఐరన్, ఎ, సి, బిక్ విట మిన్లు, మాంగ నీస్ వంటివి కూడా ఉంటాయి. పుట్ట గొడుగు ల్లోనూ తక్కువ క్యాలరీ లతోపాటు విటమిన్ డి. సెలీనియం, జింక్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండి శరీరాన్ని శక్తిమంతం గానూ చేస్తాయి.



**వీటివల్ల బరువు సమస్యా...**
రాదు. అలాగే ఏదైనా స్నాక్స్ తినాలనిపించిన ప్పుడు కప్పు పాప్కార్న్ లేదా మొలకలొచ్చిన విత్తనాలు తింటే చాలు, తక్కువ క్యాలరీలు అందుతాయి. కడుపు నిండుతుంది. పామార్న్లోని పీచు జీర్ణవ్యవస్థను మెరుగ్గా జరిగేలా చేస్తుంది. కాఫీ, శీతలపానీయాలంటూ కాకుండా సాయంకాలం తాగే వేడివేడి సూప్స్ కూడా మంచి ప్రయోజనాలిస్తాయి. సూప్లోవేసే కూర గాయల నుంచి పోషకాలు, మిరియాలపొడిలోని సి బి విటమిన్లు శరీరానికి శక్తినిస్తాయి. డీహైడ్రేషన్కు గురికాకుండా పరిరక్షి స్తాయి..

**డైటింగ్‌ంటే....** బరువు తగ్గడానికి ప్రత్యేకంగా డైటింగ్ చేయనవసరం లేకుండా ఆహారంలోనే తగిన జాగ్రత్తలు తీసుకుంటే చాలు, యాపిల్, లిచీ, బొప్పాయి, జామ, స్ట్రాబెర్రీ, చెర్రీ, పుచ్చకాయ వంటి పండ్లను తినాలి. ఆయా సీజన్లలో వచ్చే పండ్లను ఎంచుకుంటే మంచిది. పీచు, అధికశాతం నీటితోపాటు విటమిన్లు, ఖనిజలవణాలు మెండుగా, కెలోరీలు తక్కువగా ఉండేవాటికి ప్రాధాన్యమిస్తే ఆరోగ్యానికి ఆరోగ్యం, అందానికీ అందం సొంతమవుతాయి. అధికబరువు సమస్యకు దూరంకావొచ్చు.

## వెనకబడిన విద్యార్థులకు పాఠాలు చెబుతూ..

**అమ్మాయి ఎక్కువ చదవ కూడదు.. ఇది ఆ ఊర్లో ఉండే కఠిన నియమం. అలాంటి గ్రామంలో పుట్టిన ఓ చిన్నారి పుస్తకాలపై ప్రేమ పెంచుకుంది. ఎన్నో ఆంక్షల మధ్య కష్టపడి చదివి టీచర్ అయ్యింది. పేద, వెనకబడిన విద్యార్థులకు పాఠాలు చెబుతూ సమాజంలో మార్పు తీసుకు వస్తోంది దర్శనా చౌదరి.**

హరియాణలోని ఫతేహాబాద్ జిల్లాలోని బుధ కలాన్ గ్రామంలో పుట్టి పెరిగారు. దర్శన. ముగ్గురు అక్కచెల్లెళ్లలో పెద్దమ్మాయి అమ్మానాన్నలు వ్యవసాయం చేస్తారు. 'మా ఊర్లో అమ్మాయి ఎక్కువ చదువుకుంటే పెళ్లికి అబ్బాయి దొరకడం కష్టం అనేవారు. అందుకే నన్నూ పది, పన్నెండు తరగతుల వరకూ చదివించి ఆపేశారు. అదీగాక పై చదువులు చదవా లంటే పద్దెనిమిది కిలో మీటర్లు నడిచి వెళ్లాలి. ఒంటరిగా అంత దూరం పంపడం ఇష్టం లేని అమ్మానాన్న లు నన్ను చదువు మాన్పించేశారు. కానీ, నేను ప్రైవేట్‌గా చదవాలనుకున్నా. ఎలాంటి శిక్షణా లేకుండానే డిగ్రీ బిఇడి పూర్తిచేశా. దీనికి చాలా కష్టపడ్డా' అంటారీమె.

**ముందు ఊరిని మార్చాలని...** వివాహం తర్వాత ప్రైవేట్ స్కూల్లో పనిచేసే దాన్ని కానీ, నాకు గ్రామాల్లోని విద్యార్థులకి పాఠాలు చెప్పాలనిపించేది. ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం సాధించా. రాజస్థాన్‌లోని ధౌల్‌పూర్ జిల్లాలోని కట్టైల్‌పురాలో పోస్టింగ్. అదొక మారుమూల గ్రామం. దారంతా బురద. చాలా దూరం నడిచాక చివరికి ఓ చిన్న భవనం కనిపించింది. అదే బడి. అందులో ఉన్నది కేవలం 17 మంది విద్యార్థులే వాళ్లు కూడా మధ్యాహ్న భోజనం తినడానికి వస్తారని తెలిసి ఆశ్చర్య పోయా. అప్పుడే స్కూల్ కంటే ముందు ఊరుని మార్చాలనుకున్నా. ఇందుకు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి.. చదువు ప్రాముఖ్యతను అర్థమయ్యేలా చెప్పాను. కొంతమంది వింటే మరి కొందరు సోదిగా భావించేవారు అసలు సమస్య ఏంటంటే.. స్కూల్లో చాలామంది విద్యార్థులకి కనీసం అక్షరాలు కూడా రావు. ఇందుకు టైమ్ టేబుల్ వేసుకుని వెళ్లి పాఠాలు చెప్పే దాన్ని క్రమంగా వారు స్కూల్ మీద ఇష్టాన్నిపెంచుకునేలా చేయగలిగా.





**సెలిఫోన్ కాంతిలోనే పాఠాలు..** విద్యార్థులు చదువుకునేందుకు సుముఖంగా ఉన్నా.. బడిలో సమస్యలు తప్పలేదు. ముఖ్యంగా గ్రామంలో విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో ట్రాన్స్ ఫార్మర్లు తొలగించారు. దాంతో చెట్ల కిందే పిల్లల చదువు సాగేది. వర్షం పడిందంటే అందరినీ ఒకే గదిలో ఉంచి పాఠాలు చెప్పాల్సి వచ్చేది. మొబైల్‌ఫోన్ లైట్ వెలుగులోనే పిల్లలు చదువుకునేవారు. అయినా సరే, ఆ ఇబ్బందులను పట్టించుకోకుండా నేర్చుకోవడం పైనే వారు శ్రద్ధ పెట్టారు' అని చెబుతారు దర్శన. స్కూలుకి రాకపోతే.. మొదట్లో తల్లిదండ్రులు ఆడపిల్లల్ని పాఠశాలకు పంపేందుకు నిరాకరించారు. వాళ్లని ఒప్పించడం చాలా కష్టమైంది. అందుకే, విద్య కన్నా వారి రక్షణపైనే దృష్టి పెట్టా. ఎందుకంటే పిల్లల తల్లిదండ్రులకు ముందు మాపై నమ్మకం ఏర్పడితేనే.. విద్యార్థినుల భవిష్యత్తుకు అడుగులు పడతాయని అర్థమైంది. పాఠాలు చెప్పడంతోనే నా పని అయిపోయిందని ఎప్పుడూ అనుకోలేదు. వాళ్లు స్కూల్‌కి రాకపోతే ఇంటికి ఫోన్ చేసి అడిగేదాన్ని. ఈ ప్రయత్నాలతో 17 మంది మాత్రమే ఉండే విద్యార్థుల సంఖ్య ఇప్పుడు 122కి చేరింది. ఇందులో బాలికలే ఎక్కువ. చదువే తెలియని గ్రామం నుంచి ఇప్పుడెందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు వచ్చినా చదువుని వదిలేయకూడదు. అప్పుడే జీవితంలో తమంతట తాము నిర్ణయాలు తీసు కోగలుగుతారు' అంటారు దర్శన.

## రంగవల్లి



**ఎం. ధనలక్ష్మి**
నెల్లూరు



**16 చుక్కలు, 4 వరుసలు**
**4 వరకు సరిచుక్కలు**



**ముగ్గులకు ఆహ్వానం** మా చిరునామా
ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com
**కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు**

## మొటిమల్ని తగ్గించే జామాకు..



పర్యా వరణ కాలుష్యం, మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ముఖంపై గీతలు, నల్లమచ్చలు ఏర్పడుతున్నాయి. వీటిని దూరం చేయడంలో జామాకు బాగా పనిచేస్తుంది. జామాకుల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమల్ని తగ్గించడంలో సాయపడతాయి. ఇందుకు గుప్పెడు జామాకుల్ని తీసుకుని మిక్సీ పట్టుకోవాలి. రసం తీసి దానికి రెండు చెంచాల ఆవుపాలు కలిపి ముఖానికి పట్టించాలి. ఇది సెబమ్ ఉత్పత్తినే కాదు, మొటిమలతో వచ్చే వాపునీ తగ్గిస్తుంది. గంటల తరబడి కంప్యూటర్ల ముందు కూర్చున్న వారిలో నీలికాంతి వల్ల ముఖంపై పిగ్మెంటేషన్ ఏర్పడుతుంది. నల్లగా మారుతుంది. ఆ నలుపు తగ్గాలంటే నాలుగు జామాకుల్ని ఒక గిన్నెనీటిలో వేసి మరిగించాలి. ఆ నీటితో ముఖాన్ని కడిగితే సరి. ఇలా వారానికి మూడుసార్లు చేస్తే చర్మం కాంతిమంతంగా కనిపిస్తుంది.

## క్రంచీ కుల్‌కుల్స్



**కావలసినవి:**
మైదాపిండి రెండు కప్పులు, ఉప్మారవ్వ అర కప్పు, పంచదార పొడి కప్పున్నర, కొబ్బరి పాలు కప్పున్నర, ఉప్పు పావు చెంచా, నెయ్యి పావు కప్పు, నూనె వేయించేందుకు సరిపడా

**తయారీ:** ఒక పాత్రలో మైదాపిండి, రవ్వ, కరిగిన నెయ్యి, పంచదార పొడి, కొబ్బరి పాలు, ఉప్పు వేసి కలపాలి. మెత్తగా అయ్యేదాకా మళ్లీ మళ్లీ కలిపి, శుభ్రమైన తడి వస్త్రం చుట్టి, అరగంట సేపు పక్కనుంచాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక్కో బాల్నూ కుల్కుల్ రోలర్ మీద దొర్లించి, వెడల్పుగా అయ్యాక.. రెండు అంచులనూ మెల్లగా కలిపేసి ట్రేలో వేయాలి. రోలర్ లేదంటే ఫోర్క్, లేదా కొత్త దువ్వెన సాయంతో చేయొచ్చు. అన్నీ అయ్యాక కడాయిలో నూనె కాగనిచ్చి, బంగారు రంగు వచ్చేదాకా వేయిస్తే సరిపోతుంది. రుచికరమైన కరకర లాడే కుల్కుల్స్ రెడీ: ఇవి చల్లారాక.. గాలి చొరబడని డబ్బాలో ఉంచితే రెండు వారాలు నిలవుతాయి.

# తెర

## ఈటివి విన్‌లో 'నవాబుపేట దేవర' స్ట్రీమింగ్



దర్శకుడు మురళీకృష్ణ తుమ్మ. 'పొద్దుటూరు దసరా' డాక్యుమెంటరీ ఈటీవీవిన్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. తాజాగా డైరెక్టర్ మురళీకృష్ణ తుమ్మ 'నవాబుపేట దేవర' డాక్యుమెంటరీని రూపొందించారు. ఈ డాక్యుమెంటరీని బిందు ప్రియ, పూజ కృష్ణ తుమ్మ, కోప్రొడ్యూసర్ కే. ఓబులమ్మ నిర్మించారు. హైదరాబాద్‌లో నవాబుపేట దేవర డాక్యుమెంటరీ ప్రీమియర్ షో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నటుడు మహేశ్ విట్టా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాక్టర్ మహేశ్ విట్టా మాట్లాడుతూ, మా రాయల సీమలో దేవర పండుగను ఇలాగే జరుపుతారు. డైరెక్టర్ మురళీ గతంలో పొద్దుటూరు దసరా అనే డాక్యుమెంటరీ చేశాడు. ఇప్పుడు నవాబుపేట దేవర డాక్యు మెంటరీ రూపొందించాడు. ప్రొడ్యూసర్ శివప్రసాద్ మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి దేవరపండుగ జరిపే విధానం చూసేవాడిని. ఈనేపథ్యంతో డాక్యు మెంటరీ చేస్తే బాగుంటుందిఅనిపించింది. డైరెక్టర్ మురళీని అప్రోచ్ అయ్యాను. ఆయనకు గతంలో పొద్దుటూరు దసరా డాక్యుమెంటరీ చేసిన అనుభవం ఉంది. నవాబుపేట దేవర డాక్యుమెంటరీ ఇంత బాగా రావడానికి టీమ్ మెంబర్స్ అందరు చేసిన కృషి కారణం. డైరెక్టర్ మురళీకృష్ణ తుమ్మ మాట్లాడుతూ, మానవాబుపేట దేవర డాక్యుమెంటరీ మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాం.

## 'శంబాలా' సినిమా చాలా డిఫరెంట్..



**నిర్మాతలు**
**రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి**

'శంబాలా' నిర్మాతలువెర్సటైల్ యాక్టర్ ఆది సాయికుమార్ హీరోగాషైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మించిన చిత్రం శంబాల. డిఫరెంట్ హారర్ ఎంటర్ టైనర్‌గా రూపొందిన ఈ మూవీకి యగంధర్ ముని దర్శకత్వం వహించారు. ఈచిత్రంలో అర్చన అయ్యర్, స్వసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. శ్రీ చరణ్ పాకాల సంగీతాన్ని అందించారు. ఇప్పటికే శంబాలా నుంచి వచ్చిన టీజర్, ట్రైలర్ సినిమాపై ఆసక్తి పెంచేసి హైప్ క్రియేట్ చేశాయి. డిసెంబర్ 25న భారీఎత్తున రిలీజ్ చేయబోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాతలు రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి మీడియాతో ముచ్చటించి చిత్ర విశేషాలు చెప్పారు.

**ఈ సినిమా స్క్రిప్ట్ వినగానే మీకు నచ్చింది ఏంటి?**
స్క్రిప్ట్ కన్నా ముందు స్టోరీ. కథ బాగానచ్చడంతో డివోషనల్, హారర్ ఎలిమెంట్స్ కనెక్ట్ కావడంతో వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చి రంగంలోకి దిగాము.

**బడ్జెట్ పరంగా ఎలా ముందుకెళ్లారు?**
ఈరేంజ్‌గాజనాల్లోకి పోతుందని అనుకోలేదు. మొదట కొంచెం బడ్జెట్ తక్కువగా ఉన్నప్పటికీ ఆ తర్వాత బడ్జెట్‌పెంచి హైక్వాలిటీతోఈ సినిమా ఫినిష్ చేశాము.

**ఇప్పటివరకు ఎంతవరకు సేఫ్ జోన్ లోకి వచ్చారు?**
ఇప్పటికేజరిగిన బిజినెస్‌తోసేఫ్ జోన్‌లోకి వచ్చాము. శాటిలైట్, ఓటీటీ రైట్స్ ద్వారా 80 శాతం రికవరీ వచ్చేసింది. ఇంకో 20 శాతం రికవరీ బ్యాలెన్స్ అంతే. థియేట్రికల్‌రన్‌తోలాభాల్లోకివస్తామని నమ్ముతున్నాం.

**శ్రీచరణ్ పాకాల సంగీతం గురించి ఏమంటారు?**
శ్రీచరణ్‌పాకాల సంగీతం మా సినిమాకు పెద్ద అసెట్. విజువల్‌తో పాటు మ్యూజిక్ బాగా వచ్చింది.

**శంబాలా టైటిల్ పెట్టడానికి రీజన్?**
కల్కిలో వచ్చిన తరువాత శంబాలా అనేది అందరికీ తెలిసింది.

## మెలోడియస్ మ్యూజిక్ వీడియో 'అప్నీ హద్‌సే'



మహమ్మద్ నజీర్, రిఫత్ రజూర్‌జంటగా నటించిన మెలోడియస్ మ్యూజిక్ వీడియో 'అప్నీ హద్ సే' హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో సినీ ప్రముఖుల మధ్యఘనంగా విడుదలైంది. ఈ వేడుకకు జుబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై, సాంగ్‌ను లాంచ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యువ ప్రతిభను ప్రోత్సహించ డం సంతోషంగా ఉందని, సౌత్‌లో హిందీ సినిమా చేయటం చాలా మంచి పరిణామం ఈ సినిమా వీడియో సాంగ్ మంచి విజయం సాధించాలని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మ్యూజిక్ వీడియోలో మహమ్మద్ నజీర్ హీరోగా నటించగా, రిఫత్ రజూర్ హీరోయిన్‌గా మెరిశారు.
వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సాంగ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గానం: బాలీవుడ్ ప్రముఖ గాయకుడు, 'ప్రియతమా' వంటి సూపర్ హిట్ సాంగ్స్ పాడిన అభయ్ జోధ్‌పుర్కర్ తన గాత్రంతో ఈ పాటను మరోస్థాయికి తీసుకెళ్లారు. హీరో మహమ్మద్ నజీర్ మాట్లాడుతూ, "మా 'అప్నీ హద్ సే'సాంగ్ లాంచ్ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి అతిథులకు ధన్యవాదాలు.
అభయ్ జోధ్‌పుర్కర్ వంటి గొప్ప సింగర్ మా పాట పాడటం మాకు గర్వకారణం. ప్రేక్షకులకు ఈ పాట కచ్చితంగా నచ్చుతుందని నమ్ముతున్నాను అని తెలిపారు.

## జనవరి 13న రవితేజ చిత్రం



మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో ఈ సంక్రాంతికి అద్భుతమైన వినోదాన్ని అందించ డానికి సిద్ధంగా ఉన్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై మ్యాసీవ్ బజ్‌ను సృష్టించాయి. జనవరి 13న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ప్రెస్ మీట్ లో డైరెక్టర్ కిషోర్ తిరుమల మాట్లాడుతూ, మీడియా మిత్రులందరికీ నమస్కారం. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సంక్రాంతికి మీ అందరి ముందుకు రాబోతోంది. ప్రొడ్యూసర్ సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ, జనవరి 13న ఈ సినిమా రిలీజ్ అవుతుంది. ఫుల్‌ఎంటర్టైన్మెంట్‌తో ఉంటుంది. ఈ సినిమా టైటిల్ చాలా కొత్తగా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. కిషోర్‌తిరుమల సెన్సిబుల్ డైరెక్టర్. ఆయన డైరెక్షన్లో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో నా క్యారెక్టర్ పేరు బాలామణి. ఇందులో ఒక కొత్త డింపుల్‌ని చూస్తారు. ఇది భోగి రోజున రిలీజ్ అవుతుంది. ఇది నా ఫస్ట్ సంక్రాంతి సినిమా చాలా స్పెషల్. హీరోయిన్ ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ, ఈ టైటిల్ ఒక క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. ఇది ఎంటర్టైనింగ్ ఫన్ ఫ్యామిలీ ఫిలిం. మోడరన్ రిలేషన్ షిప్ గురించి చాలా హ్యూమరస్ సెన్సిబుల్‌గా చెబుతున్నాం. ఇందులో మానస శెట్టి పాత్రలో కనిపిస్తాను. చాలా మోడరన్ కాన్ఫిడెంట్ బోల్డ్ క్యారెక్టర్. అందరికీ నచ్చు తుంది. తేజ చాలా ఫన్ అండ్ ఎంటర్టైనింగ్. ఆయనతో వర్క్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇందులో చాలాకొత్త డిఫరెంట్ రవితేజ కనిపిస్తారు. చాలా అద్భుతమైన టీంతో భారీగా తీసిన సినిమా ఇది. ఈ సినిమా మీ అందరిని అలరిస్తుంది.

## యూత్‌ఫుల్ కామెడీ స్పోర్ట్స్ డ్రామా 'పతంగ్'

ప్రతిష్టాత్మక సంస్థ సురేష్ ప్రొడక్షన్స్ డి.సురేష్ బాబు సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'పతంగ్' పతంగుల పోటీతో రాబోతున్న ఈ యూత్‌ఫుల్ కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. సినిమాటిక్ ఎలిమెంట్స్, రిషన్ సినిమాస్, మాన్‌సూన్ టేల్స్ సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామా ఈ చిత్రానికి విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మకా, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మాతలు. ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రమ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. పాపులర్ దర్శకుడు నటుడు గౌతమ్ వాసుదేవ మీనన్, ప్రముఖ సింగర్, నటుడు ఎస్‌పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రల్లో కనిపించబోతున్నారు. డిసెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌కు అనూహ్యమైన స్పందన వస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్రమేకర్స్ ట్రైలర్ సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ప్రణవ్ కౌశిక్ మాట్లాడుతూ, ఈ సినిమా నాతో పాటు మా అందరికి చాలా టఫ్ అండ్ ఎమోషనల్ జర్నీ. సినిమా అంటే లవ్‌తో సినీ పరిశ్రమలో వచ్చాను. ఈ జర్నీలోఅన్ని ఫేస్ చేశాం. డిసెంబరు 25ప విడుదలైన అన్ని సినిమాలు ఆడాలి. సినిమా గెలవాలి అన్నారు.



పతంగ్ రోలర్ కోస్టర్‌లా మా సినిమా నిర్మాణం కూడా జరిగిందని, పతంగ్ జర్నీ గ్రేట్ జర్నీ అని నిర్మాత విజయ్‌శేఖర్ అన్నే తెలిపారు. సురేష్ కొత్తింటి మాట్లాడుతూ, డీలే అయినా ఓ మంచి క్వాలిటీ సినిమా తీశామనే నమ్మకం ఉంది. నిర్మాత రమ్య మాట్లాడుతూ, సినిమా చూసిన అందరూ సినిమా గురించి ఎంతో ప్రశంసిస్తున్నారు.
తప్పకుండా సినిమా అందరికి నచ్చుతుందని నమ్మకం ఉంది అన్నారు.
మా సినిమా ఈ సంవత్సరం విడుదలై విజయం సాధించిన మంచి చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుందనే విశ్వాసం వుంది అన్నారు.

## 'ఛాంపియన్' 25న విడుదల



**హీరో రోషన్**

స్వప్న సినిమాస్ అప్ కమింగ్ మూవీ 'ఛాంపియన్' ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శ కత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణ లో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. మిక్కీ జే మేయర్ అందించిన పాటలు చార్ట్ బస్టర్ అయ్యాయి. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో రోషన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈవెంట్లో రామ్‌చరణ్ మిమ్మల్ని చాలా ప్రశంసించారు కదా.. ఎలా అనిపించింది?**
చాలా ఆనందంగా ఉంది. చరణ్ అన్ననాకు చిన్నప్పటి నుంచి తెలుసు. నాగురించి మా సినిమా గురించిటీం గురించి ఆయన చాలాబాగా మాట్లాడారు. నిజంగా చాలా సంతోషంగా ఉంది.

**మీరు చేసే కొత్త సినిమాగురించి?**
త్వరలోనే అనౌన్స్మెంట్‌ఉంటుంది. ఈసారి ఎక్కువ గ్యాప్ లేకుండా కనీసం రెండు సంవత్సరాలకి మూడు సినిమాలు చేయాలని అనుకుంటున్నాను.

**ఆల్ ది బెస్ట్..** థాంక్ యూ.




## టాటా స్టీల్ వరల్డ్..
# గుల్వీర్, సీమాకు టైటిళ్లు

**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ వరల్డ్ టోర్నమెంట్‌లో గుల్వీర్ సింగ్, సీమా భారత టైటిళ్లను గెలుచుకుని జాతీయ రికార్డులు. ఆదివారం జరిగిన 2025 టాటా స్టీల్ వరల్డ్ 25కే కోల్‌కతాలో భారత దిగ్గజ లాంగ్ డిస్టెన్స్ రన్నర్లు గుల్వీర్ సింగ్ మరియు సీమా కొత్త జాతీయ రికార్డులను సృష్టించి ఈ సంవత్సరం కూడా తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారు. బహుళ జాతీయ రికార్డు కలిగిన గుల్వీర్ (1:12:06) కోల్‌కతాలో అద్భుతమైన పరుగును సాధించాడు. గత ఎడిషన్ నుండి తన జాతీయ రికార్డును 2 నిమిషాలు మెరుగుపరుచుకున్నాడు. ఎలైట్ అంతర్జాతీయ అథ్లెట్లలో ఐదవ స్థానంలో నిలిచాడు. ఇంతలో, సీమా తన తొలి 25 కి.మీ రోడ్ రేసులో 1:26:04 సమయంలో గమ్యాన్ని చేరుకుని భారత ఎలైట్ టైటిల్‌ను గెలుచుకుంది. సంజీవని జాదవ్‌ను 1:30:34 సమయంలో రెండవ స్థానంలో నిలిపింది. భారత అథ్లెట్లకు ఈ సంవత్సరం చివరి అథ్లెటిక్స్ ఈవెంట్ ఇది. గుల్వీర్ తదుపరి ప్రధాన లక్ష్యం స్కాట్లాండ్‌లో 2026లో జరిగే కామన్వెల్త్ క్రీడలు. ఆ తర్వాత ఆ సంవత్సరం చివర్లో జపాన్‌లో జరిగే ఆసియా క్రీడలు. మరోవైపు, ఇథియోపియాకు చెందిన డెగిటు అజిమెరా 1:19:36 సమయంతో మహిళల ఎలైట్ టైటిల్‌ను గెలుచుకున్నాడు మరియు ఉగాండాకు చెందిన అనుభవజ్ఞుడైన మారథాన్ రన్నర్ జాషువా చెప్టెగీ 1:11:49 సమయంతో పురుషుల ఎలైట్ టైటిల్‌ను గెలుచుకున్నాడు.




# ప్రో బాక్సింగ్‌లో వరుస విజయాలు

**న్యూఢిల్లీ:** ప్రో బాక్సింగ్-2025లో భారత స్టార్ బాక్సర్ నిశాంత్ దేవ్ వరుస విజయాన్ని సాధించాడు. నిశాంత్ ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో తన అరంగేట్ర సంవత్సరంలో అజేయంగా నిలిచాడు, ఘనాలో వరుసగా ఐదవ బౌట్‌ను గెలుచుకున్నాడు. క్రెయిగ్ రిచర్డ్స్‌కు డాన్ అజీజ్‌కు మధ్య ప్రధాన పోరాటం సందర్భంగా ఆరు రౌండ్ల వెల్టర్‌వెయిట్ బౌట్‌లో అతను టాంజానియాకు చెందిన అల్లీ మ్బుక్వాపై 4వ రౌండ్ నాకౌట్ విజయాన్ని సాధించాడు. ఈ ఏడాది ఐదవ మ్యాచ్‌లో నిషాంత్‌కు ఇది మూడవ నాకౌట్ విజయం, ఇది అతని సామర్థ్యాన్ని నిరూపించుకోవడంతో పాటు, అగ్రశ్రేణి బాక్సర్లలో ఒకరిగా ర్యాంకులను ఎదగడానికి దారితీసింది. ఇక ఇది నిశాంత్ కు అమెరికా వెలుపల జరిగిన మొదటి బౌట్. అదే ఖండానికి చెందిన ప్రత్యర్థితో ఆడి అతనికి భిన్నమైన సవాలును అందించింది. ఈ సంవత్సరం రెండు ఏకగ్రీవ విజయాలు మరియు ఇప్పుడు మూడు నాకౌట్ విజయాలు సాధించాడు.

## స్పోర్ట్స్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో..
# వీర్ గప్రోత్రాకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** పురుషుల ఏరియల్ సిల్క్‌లో భారత్ అథ్లెట్ వీర్ గప్రోత్రా స్వర్ణం సాధించాడు. ఈ సంవత్సరం పోల్ అండ్ ఏరియల్ స్పోర్ట్స్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల ఏరియల్ సిల్క్ విభాగంలో భారతదేశం బంగారు పతకంతో అరంగేట్రం చేసింది, ఈ ప్రపంచ ఈవెంట్‌లో దేశం తొలిసారిగా పోడియం ఫినిషింగ్‌ను సాధించింది. జూనియర్ బి అమెచ్యూర్ మెన్ (15-17 సంవత్సరాలు) ఏరియల్ సిల్క్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ముంబైకి చెందిన 16 ఏళ్ల అథ్లెట్ వీర్ గప్రోత్రా ఈ స్వర్ణాన్ని గెలుచుకున్నాడు. ఉక్రెయిన్, హంగేరీ మరియు చెక్ రిపబ్లిక్ వంటి స్థిరపడిన ఏరియల్ స్పోర్ట్స్ ఎకోసిస్టమ్‌లు ఉన్న దేశాల అథ్లెట్లతో పోటీపడి, సాంకేతికంగా డిమాండ్ ఉన్న రంగంలో గప్రోత్రా విజయవంతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఏరియల్ సిల్క్ అనేది పనితీరు ఆధారిత వైమానిక జిమ్నాస్టిక్స్ విభాగం. దీనికి గణనీయమైన పై శరీర బలం, ఓర్పు, వశ్యత మరియు కళాత్మక నియంత్రణ అవసరం. ఇది జిమ్నాస్టిక్స్ మరియు సాంప్రదాయ భారతీయ తాడు మల్లఖాంబ్‌తో సారూప్యతలను పంచుకున్నప్పటికీ, ఈ క్రీడ ప్రస్తుతం భారతదేశంలో ప్రధాన స్రవంతి. ఛాంపియన్‌షిప్ స్థాయిలో, రొటీన్‌లను కేవలం కష్టాన్ని బట్టి కాకుండా సాంకేతిక ఖచ్చితత్వం, కళాత్మకత ఆధారంగా నిర్ణయిస్తారు. గప్రోత్రా నియంత్రణ, స్థిరత్వం ప్రత్యేకంగా న్యాయనిర్ణేతల నుండి అత్యధిక మార్కులను సంపాదించాయి.






# ఆసియా కప్ విజేతగా పాకిస్థాన్
## టీమిండియాకు ఘోర పరాభవం

**న్యూఢిల్లీ:** మెన్స్ అండర్ 19, ఆసియా కప్-2025 విజేతగా పాకిస్తాన్ నిలిచి ట్రోఫీని తన్నుకుపోయింది. దుబాయ్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్‌ను 191 పరుగుల భారీ తేడాతో పాక్ చిత్తుగా ఓడించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ ఓపెనర్ సమీర్ మిన్హస్ (172) భారీ శతకంతో చెలరేగడంతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 347 పరుగులు చేసింది.

అనంతరం భారీ లక్ష్య ఛేదనలో భారత్ తొలి నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోతూ ఓటమిని కొనితెచ్చుకుంది. 26.2 ఓవర్లలో భారత్ 156 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. పాక్ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేయగా, అలీ రజా 4, మొహమ్మద్ సయ్యమ్, అబ్దుల్ సుభాన్, సుజైఫా ఎహసాన్ తలో 2 వికెట్లు తీసి టీమిండియాను దెబ్బకొట్టారు. భారత్ తరఫున వైభవ్ సూర్యవంశీ 26 పరుగులకే వైఫల్యం చెందగా, కెప్టెన్ ఆయుష్ మాత్రే (2) స్టార్ ప్లేయర్ అరోన్ జార్జ్ (16) పెవిలియన్‌కు చేరారు. కేవలం 86 పరుగులకే 6 వికెట్లు కోల్పోవడంతో ఆదిలోనే భారత్ ఓటమి ఖరారైంది. చివర్లో దీపేశ్ దేవేంద్రన్ (36) బ్యాట్ ఝుళిపించి భారత్ స్కోర్‌ను పెంచాడు.

భారత్ ఇన్నింగ్స్‌లో ఇతనే టాప్ స్కోరర్. మిగిలిన ఆటగాళ్లలో విహాన్ మల్హోత్రా 7, వేదాంత్ త్రివేది 9, అభిగ్యాన్ కుందు 13, కనిష్క్ చౌహాన్ 9, జలన్ పటేల్ 19, హెనిల్ పటేల్ 6 పరుగులు చేసి ఔటయ్యారు. అంతకు ముందు పాకిస్తాన్ ఇన్నింగ్స్‌లో సమీర్ మిన్హాస్ మినహా మిగలిన వారు ఎవరూ పెద్ద స్కోర్లు చేయలేదు. అహ్మద్ హుసేన్ (56), ఉస్మాన్ ఖాన్ (35) ఫర్వాలేదనిపించారు.

ఓ దశలో పాక్ 400 పరుగుల మార్కు దాటుతుందని అనిపించింది. అయితే భారత్ బౌలర్లు చివర్లో పుంజుకోవడంతో పాక్ 347 పరుగులతో సరిపెట్టుకుంది. భారత్ బౌలర్లలో దీపేష్ దేవేంద్రన్ 3, హె నిల్ పటేల్, జలన్ పటేల్ రెండేసి, కనిష్క్ చౌహాన్ ఒక వికెట్ తీశారు.

# ఆస్ట్రేలియాదే యాషెస్ సిరీస్
## 82 రన్స్ తేడాతో ఇంగ్లండ్ మూడో ఓటమి

**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్-2025లో ఆతిథ్య ఆస్ట్రేలియా తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ వరుసగా మూడో టెస్టులోనూ విజయం సాధించింది. అడిలైడ్ వేదికగా ఆదివారం జరిగిన మూడో మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై ఆసీస్ 82 పరుగుల తేడాతో నెగ్గింది. 435 పరుగుల భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ 352 పరుగులకే ఆలౌటైంది. జాక్ క్రాలీ (85), జెమీ స్మిత్ (60) హాఫ్ సెంచరీలతో రాణించారు. చివర్లో విల్ జాక్స్ (41), బ్రెండన్ కార్స్ (39) పోరాడినా ఫలితం దక్కలేదు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్, నాథన్ లైయన్ తలో 3, స్కాట్ బోలాండ్ ఒక వికెట్ పడగొట్టారు. కాగా 435 పరుగుల భారీ లక్ష్యంతో దిగిన ఇంగ్లాండ్ ప్రారంభంలోనే బెన్ డకెట్ (4) వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఒలీ పోప్ (17) కూడా నిరాశ పర్చాడు. అయితే జో రూట్ (39) కాస్త కుదురుకున్నట్లే కనిపించినా, అతడిని కమిన్స్ పెవిలియన్‌కు పంపాడు. హ్యారీ బ్రూక్ (30), బెన్ స్టోక్స్ (5) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో ఇంగ్లాండ్ కష్టాల్లో పడింది. ఈ సమయంలో జెమీ స్మిత్, విల్ జాక్స్ క్రీజులో నిలబడినా, చివర్లో మళ్లీ పట్టు బిగించిన ఆసీస్ వరుస వికెట్లు కూల్చి విజయం సాధించింది. ఇక తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (107), రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ (72)తో రాణించగా, రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ (170) భారీ సెంచరీతో ఆస్ట్రేలియా ప్రత్యర్థి ముంగిట భారీ లక్ష్యాన్ని ఉంచగలిగింది. తాజా విజయంతో ఐదు టెస్టుల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే ఆస్ట్రేలియా కైవసం చేసుకుంది.







వాణిజ్యం

# 364 మిలియన్ డాలర్లు సమీకరించిన 30 స్టార్టప్‌లు!



**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** ఫండింగ్ కార్యకలాపాల్లో భారతీయ స్టార్టప్‌లు భారీ వృద్ధిని నమోదుచేసాయి. సుమారుగా 30 కంపెనీలు 363.9 మిలియన్ డాలర్లు నిధులు సమీకరించుకోగలిగాయి. ప్రారంభదశలోనే నిధుల సమీకరణలో విజయం సాధించాయి. గతవారంలో 22 స్టార్టప్‌లు 137.68 మిలియన్ డాలర్లు సమీకరించిన స్టార్టప్‌లు ఈ వారంలో 363.9 మిలియన్ డాలర్లు సమీకరించాయి. వృద్ధి, చివరిదశ ఫండింగ్ అనేవి ఈ వారంలో భారీగా జరిగాయి. తొమ్మిది డీల్స్‌తో 300 మిలియన్ డాలర్ల మార్కును అధిగమించాయి. మోఎంగేజ్ సంస్థ అత్యధికంగా 180 మిలియన్ డాలర్లు సమీకరించింది. క్రిస్ క్యాపిటల్, డ్రాగన్‌ఫండ్స్, ష్రోడర్స్ క్యాపిటల్‌నుంచి ఈ నిధులు సాధించింది. స్పేస్‌టెక్ స్టార్టప్ దిగంతర కూడా 50 మిలియన్ డాలర్లు సమీకరిస్తే విద్యుత్ వాణిజ్యవాహనాల స్టార్టప్ క్యూసెవ్ 15 మిఇయన్ డాలర్లు, స్టాక్ మార్కెట్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ స్టాక్‌గ్రో 13 మిలియన్ డాలర్లు సమీకరించాయి. ఇతర స్టార్టప్‌లు వర్క్ ఇండియా, ఓబెన్ ఎలక్ట్రిక్, ట్యాగ్‌బిన్, విరోహన్, ఏస్ టర్టిల్ వంటివి ఈ వారంలో నిధులు సమీకరించుకోగలిగాయి. ఆరంభదశలో ఉన్న స్టార్టప్‌లు ఈ వారంలో 20 డీల్స్‌ద్వారా 62.4మిలియన్ డాలర్లు సమీకరించాయి. హెయిర్‌కేర్‌బ్రాండ్ మ్యాక్సీ బ్యూటీ కూడా 15 మిలియన్ డాలర్లు సిరీస్ ఏ రౌండ్‌నుంచి సమీకరించాయి.


బెస్సెమర్ వెంచర్ పార్టనర్స్ కూడా సిరీస్ ఏరౌండ్ నిధులు సమకూర్చింది. షేవ్‌వేర్‌బ్రాండ్ అండర్‌నీట్ ఆరుమిలియన్ డాలర్లు సేకరించుకోగలిగింది. సిసిర్‌రాడార్, ఎయిల్‌మెంటో ఆగ్రో, ఎలిమెంటోజ్, రోటోరిస్ వంటివి కూడా ఎక్కువ నిధులు సేకరించాయి. లగ్జరీ జ్యూయెలరీ స్టారటప్ క్వీన్ సంస్థకూడా నిదులుసేకరించింది. అన్ని నగరాలకంటే బెంగళూరు టాప్‌లో నిలిస్తే ఆ తర్వాత ఢిల్లీ,ఎన్సీఆర్ ఆరుడీల్స్ ముంబయి, భువనేశ్వర్, హైదరాబాద్, కోల్‌కత్తా నగరాల స్టార్టప్‌లు కూడా ఈ వారంలో నిధుల సమీకరణలో ముందున్నాయి. ఈకామర్స్ రంగం ఏడు డీల్స్ బయోటెక్ కంపెనీలు మూడు డీల్స్‌చేసాయి. స్టార్టప్‌లు ఎఐ, స్పేస్‌టెక్, ఎలక్ట్రిక్ వెహికల్స్, ఎడ్‌టెక్, సాస్ సంస్థలు కూడా ఇన్వెస్టర్లలో ఆసక్తిని పెంచాయి, గడచిన ఎనిమిది వారాల్లో ఒక్కొక్క వారం సగటున 308.14 మిలియన్ డాలర్లుచొప్పున 25 డీల్స్‌జరిగాయి.

# వచ్చే యేడాది 8% దాకా ఆటోమొబైల్ వృద్ధి అంచనా



**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** భారత ఆటోమొబైల్ ఇండస్ట్రీ 2026లో ఆరునుంచి 8శాతం వృద్ధి నమోదుచేయగలదని ఆరంగ నిపుణులు అంచనావేస్తున్నారు. ప్రభుత్వ పాలసీల మద్దతు, జిఎస్టీ హేతుబద్దీకరణ, ద్రవ్యలభ్యత పరిస్థితులు, ఆదాయపు పన్ను రిలీఫ్ వంటివి కొంతమేర ఆటోమొబైల్ రంగ వృద్ధికి ఆస్కారం ఏర్పడుతుందని అంచనా. ప్యాసింజర్ వాహనాలు ముందు నెమ్మదిగా అమ్మకాలు ప్రారంభం అయినా అర్బన్‌ప్రాంతాల్లో డిమాండ్‌తో పెరిగింది. ఇక గ్రామీణ రాబడులు కూడా వృద్ధిచెందడంతో నగదు లభ్యంత అందుబాటులోకి రావడంతో ఆటోమొబైల్ విక్రయాలు పెరిగినట్లు అంచనా. ఎస్‌యువిలే ఎక్కువ డిమాండ్‌తో కొనుగోళ్లుజరిగాయి. సిఎన్‌జి, విద్యుత్ వాహనాలపట్ల ఆసక్తిపెరిగింది. 2026 సంవత్సరంలో కఠిన చట్టాలు అమలయినా ఆటోమొబైల్‌రంగంలో స్థిరమైన వృద్ధి ఉంటుందని అంచనా. కేఫ్ నిబంధనలతో కొంతమేర ఈ రంగం ఒడిదొడుకులు ఎదుర్కొన్నది. 2027లో భవిష్యత్తు కర్బన ఉద్గారాలప్రమాణాలు నిబంధనలు మరింతగా ధరలపై ప్రభావితంచేసేవీలుంది. భద్రతా ప్రమాణాలు ఎబిఎస్, సిబిఎస్‌లు టీవీలర్లకు ఇప్పటికే ఎంట్రీలెవల్ ధరలను పెంచాయి. వృద్ధి కనిపిస్తున్నా బౌగోళిక అనిశ్చితి, ట్యారిఫ్‌లు, కరెన్సీ క్షీణత వంటివికొంతమేర రిస్క్ ఉంటుందని అంచనా. ఆటోమొబైల్ ఉత్పత్తిదారులు తమ పెట్టుబడులు ఇపుడు విద్యుత్ వాహనాలకు ఎక్కువ పెడుతున్నారు. ఛార్జింగ్ వసతులు, ప్లాట్‌ఫామ్ అప్‌గ్రేడేషన్ వంటివాటిపై ఫోకస్‌పెంచారు. జిఎస్టీ ప్రయోజనాల కారణంగా ఏడునుంచి 8శాతం సాలీనా వృద్ధి కనిపిస్తుందని అంచనావేస్తున్నారు. దేశీయంగాను, ఎ గుమతుల మార్కెట్‌లోకూడా వృద్ధి ఉంటుందని, కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిసామర్థ్యం పెరగవచ్చని మారుతిసుజుకి ఎండి సిఇఒ హిసాషి తకేయుచిఅన్నారు. ఫాడా అధ్యక్షుడు సిఎస్ విఘ్నేశ్వర్ మాట్లాడుతూ రెండంకెల వృద్ధి ఉంటుందని, టూవీలర్లు, ప్యాసింజర్ వాహన కేటగిరీల్లోకూడా అదే ఉంటుందని చెపుతున్నారు. అయితే ఎంట్రీలెవల్ ధరలు మాత్రం రూ.5వేలవరకూ పెరగవచ్చని అంచనా.

# అల్ట్రాటెక్ సిమెంట్‌కు రూ.390 కోట్ల పన్ను బకాయి నోటీసులు





**ముంబయి, డిసెంబరు 21:** సిమెంట్ రంగ దిగ్గజ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్‌కు సిజిఎస్‌టి, సెంట్రల్‌ఎక్సైజ్ పరంగా భారీ పన్ను డిమాండ్ నోటీసులు జారీచేసారు. కంపెనీ పన్నుల రూపంలో రూ.390 కోట్లు బకాయి పడిందని నోటీసులు జారీచేసారు. ఈ మొత్తంతోపాటు కంపెనీ జరిమానా, వడ్డీరూపంలో రూ.28 లక్షలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని అంచనా. 2018-19 సంవత్సరం నుంచి 2022-23 సంవత్సరంవరకూ ఈ బకాయిలు చెల్లించాలి. కంపెనీ లాభాలు రూ.1232 కోట్లలో మూడింట రెండొంతులు ఈ పన్ను బకాయిలే ఉంటాయని అంచనా. ఇదే త్రైమాసికంలో కంపెనీ దేశంలోనే అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థగా నిలిచింది. రాబడులు కూడా 20.3శాతంపెరిగి 19,607 కోట్లవరకూ రాబడులు సాధించుకోగలిగింది. అయితే జిఎస్టీ ఇతర ఉన్నతాధికారులు పంపించినపన్ను బకాయిల నోటీసులను న్యాయపరంగా సవాల్‌చేయనున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. పన్ను డిమాండ్‌నోటీసుల వల్ల కంపెనీ కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం ఉండదని, వచ్చే జనవరి 24న కంపెనీ మూడో త్రైమాసిక ఫలితాలుకూడా వెల్లడిస్తుందని తెలిపింది. కంపెనీ జిఎస్టీ నోటీసులను పరిశీలిస్తోందని, న్యాయపరమైన అంశాలను కూడా యోచిస్తున్నట్లు వెల్లడించింది. అల్ట్రాటెక్‌సిమెంట్ షేర్లపై ఈనోటీసులు ప్రభావం పడలేదు. ఈ ఏడాది మొత్తంగా స్థిరంగానే కొనసాగాయి. వారాంతంలో స్టాక్ రూ.11,497వద్ద ముగిసింది. అంటే 36 రూపాయలు పెరిగింది.

# ఇ-వేలంలో వ్యర్థాల విక్రయంతో రూ.2200 కోట్ల రాబడులు




**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** ప్రభుత్వవిభాగాల్లో ఈవేస్ట్, ఇతర వ్యర్థాలను తొలగించడం లేదావేలం వేయడం ద్వారా మొత్తం రూ.2200 కోట్ల రూపాయలు రాబట్టగలిగింది. 2021 డిసెంబరు నుంచి ఈ ఏడాది నవంబరు నెలాఖరువరకూ నిర్వహించిన బిడ్డింగ్‌ప్రక్రియలో ప్రభుత్వ మంత్రిత్వశాఖలు, వివిధ ప్రభుత్వశాఖల్లో వ్యర్థాలన్నింటినీ ఈవేలం వేయడంతోరూ.220 కోట్లు సమకూరినట్లు తేలింది. ప్రభుత్వ ఈమార్కెట్‌ప్లేస్ (జిఇఎం) ఈ ప్రక్రియ నిర్వహించింది. మొత్తం 13వేలకు పైగా వేలాలు నిర్వహిస్తే సుమారు 23 వేలమందికిపైగా రిజిస్టరు అయిన బిడ్డర్లు పాల్గొన్నారు. అలాగే 17 వేల మంది వేలంపాటదారులుకూడా ఈ నాలుగేళ్ల వ్యవధిలో ప్రభుత్వస్క్రాప్‌ను కొనుగోలు చేసినట్లు తేలింది. లక్నోలోని ఆలిగంజ్‌లో 100కుపైగా ఈడబ్ల్యుఎస్ ఫ్లాట్లను ఎస్‌బిఐ వేలం వేస్తే సుమారు రూ.3453 కోట్లు రాబడులు వచ్చినట్లు తేలింది. అలాగే నేషనల్ జూలాజికల్‌పార్కులో కూడా అత్యధిక బిడ్ వచ్చినట్లు తేలింది. జిప్సమ్ వేలంలో 3.35 కోట్లు ఆరావళి జిప్సమ్ మినరల్స్ ఇండియా కంపెనీ 216 కాలంచెల్లిన వాహనాలు జమ్ముడివిజన్‌లోను, బోర్డర్ రోడ్స్ సంస్థలో సాల్వేజ్ ఉత్పత్తులు, గుల్మార్గ్‌లోని డార్మిటరీని ఐదేళ్లకాలానికి లీజు వంటివి ఈ వేలంలోనే జరిగాయి. ఇలా ప్రభుత్వశాఖల్లో వృధా ఉత్పత్తులు మిగిలిపోయిన, కాలం చెల్లిన వాటిని ఈవేలంద్వారా విక్రయించేందుకు ప్రభుత్వం ఏకంగా గవర్నమెంట్ ఈమార్కెట్‌ప్లేస్ (జిఇఎం)ను ఏర్పాటుచేసింది. మొత్తం ఈ వ్యవస్థను ఇకపై జిఇఎం పర్యవేక్షించడంవల్ల పారదర్శకతతోపాటు రికవరీ రాబడులు కూడా అత్యధికంగానే ఉంటున్నట్లు ప్రభుత్వ వర్గాలంటున్నాయి.

# టాప్ ఏడుసంస్థల్లో 76,257 కోట్లు ఎంక్యాప్ వృద్ధి



**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** దేశంలోని టాప్ పది విలువైన కంపెనీల్లో ఏడు కంపెనీల విలువలు 76,257 కోట్లరూపాయలు పెరిగాయి. టిసిఎస్, ఇన్ఫోసిస్ ఈ వారంలో భారీగా లాభపడ్డాయి. గతవారంలో బిఎస్ఇ సెన్సెక్స్ 338.3 పాయింట్లు క్షీణించింది. రిలయన్స్, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, స్టేట్‌బ్యాంకు, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టి సంస్థలు భారీ లాభాల్లో నిలిస్తే హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, బజాజ్ ఫైనాన్స్, ఎల్ఐసి సంస్థలు మార్కెట్ విలువల్లో కోతకు గురయ్యాయి. టిసిఎస్ మార్కెట్ విలువలు 22,594.96 కోట్లుపెరిగి రూ.11,87,673.41 కోట్లకుపెరిగితే ఇన్ఫోసిస్ రూ.16,971.64 కోట్లుపెరిగి రూ.6,81,192.22 కోట్లకుచేరింది. భారతీయ స్టేట్‌బ్యాంకు విలువలు రూ.15,922.81 కోట్లుపెరిగి రూ.9,04,738.98 కోట్లకు చేరితే రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.12,314.55 కోట్లుపెరిగి రూ.21,17,967.29 కోట్లకు చేరింది. మార్కెట్ విలువలపరంగా భారతి ఎయిర్‌టెల్ కూడా రూ.7384.23కోట్లుపెరిగి రూ.11,95,332,34 కోట్లకు చేరితే ఎల్అండ్‌టి రూ.68.78 కోట్లుపెరిగి రూ.5,60,439.16 కోట్లకు చేరింది. ఇక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుపరంగాచూస్తే రూ.21,920.8 కోట్లు క్షీణించి 15,16,638.63 కోట్లకు దిగజారింది. ఇక ఎల్ఐసి విలువలుకూడా రూ.9614కోట్లు క్షీణించి రూ.5,39,206.05కోట్లకు చేరింది. ఐసిఐసిఐ బ్యాంకు ఎంక్యాప్ రూ.8427.61 కోట్లు క్షీణించి రూ.9,68,240.54 కోట్లకు చేరితే బజాజ్‌ఫైనాన్స్ రూ.5880.25 కోట్లకు చేరి రూ.6,27,226.44 కోట్లకు తగ్గింది.రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటికీ టాప్ వాల్యూ ఉన్న సంస్థగా నిలిచింది. ఆ తర్వాత వరుసగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐబ్యాంకు, ఎస్‌బిఐ, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టి, ఎల్ఐసి సంస్థలు నిలిచాయి.




# పారిశ్రామిక ఉత్పత్తి సూచీ డేటాపైనే ఫోకస్
## ఈవారం సెన్సెక్స్, నిఫ్టీలపై ట్రేడర్ల అంచనాలు

**ముంబయి, డిసెంబరు 21:** స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్లు వచ్చేవారం భారత పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు, నవంబరు నెల ఐఐపి డేటాపై ఫోకస్ పెట్టే సూచనలున్నాయి. కేంద్ర అర్థగణాంకశాఖ ఈ వివరాలను ఈనెల 29వ తేదీ విడుదలచేస్తారు. వాణిజ్యసంబంధిత కీలక అంశాలు ఎక్కువ ప్రభావితంచేస్తాయి. ప్రధాని నరేంద్రమోడీ ఇటీవలి శీతాకాల సమావేశాల్లో ఫోకస్‌పెట్టిన కీలక అంశాలు, మార్పులు, సవరణలుచేసిన బిల్లుల ప్రభావం కూడా సెన్సెక్స్,నిఫ్టీల ట్రేడింగ్‌పై ఉంటుందని అంచనా. ఇక న్యూక్లియర్ రంగంలో ప్రైవేటు రంగ భాగస్వామ్యం, నూరుశాతం బీమాకంపెనీల్లో విదేశీ పెట్టుబడులకు అనుమతులు, సెక్యూరిటీస్ మార్కెట్ చట్టాలకు ఒకే కోడ్‌ను ఏర్పాటుచేయడం వంటివి కీలకంఅవుతాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలతోపాటు ముడిచమురుధరలు, అంతర్జాతీయ మార్కెట్ల ధోరణులు కూడా కీలకం అవుతాయని అంచనా. అదేవిధంగా మోడీ మూడుదేశాల పర్యటనల్లో జరిగిన వాణిజ్య ఒప్పందాలు, భారత్‌లో ఇతర విదేశీమంత్రుల పర్యటనల్లోజరిగిన ఒప్పందాలపైనా ఇన్వెస్టర్లు దృష్టిసారించి ఆయా రంగాల షేర్లపై దృష్టిపెడతారని అంచనా.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.